# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

28.2.2026 శనివారం Saturday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 223 | పేజీలు : 12 Pages : 12 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana









## అభివృద్ధిపైనే ఫోకస్

ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం

రాజకీయ విమర్శలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ 2

ప్రభుత్వ ఉద్యోగులకు

## శుభవార్త

బకాయిలు కోసం రూ.745 కోట్లు విడుదల 2





విద్యా కమిషన్‌లో

## విద్యావేత్తలేరీ ?

విద్యావేత్తలే లేని కమిటీ నివేదికతో సాధించేదేమిటి : హరీష్ రావు విమర్శలు 3

## అరాచక పాలన సాగుతోంది

రాష్ట్రంలో కాంగ్రెస్ ఉన్నా.. నడిగడ్డ బీఆర్ఎస్ వెనకే : కేటీఆర్

పాలమూరులో గెలిచిన కౌన్సిలర్లకు సన్మానం 3






## గజం 2.65 లక్షలు

హౌజింగ్ బోర్డు కాలనీలో వేలం వెర్రి 2



# అఫ్ఘాన్-పాక్ మధ్య ముదిరిన ఘర్షణ

- వైమానిక దాడులతో దద్దరిల్లిన కాబుల్, కాందహార్
- రంగంలోకి 'సూసైడ్ స్క్వాడ్'

### పాకిస్థాన్ 'బహిరంగ యుద్ధం' ప్రకటన

పాకిస్థాన్ - అఫ్ఘానిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరుకున్నాయి. అఫ్ఘానిస్థాన్‌తో తాము 'బహిరంగ యుద్ధం' ప్రారంభించామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రకటించారు. "మా సహనం నశించింది.. ఇకపై మాకు, మీకు మధ్య యుద్ధమే" అంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. గురువారం రాత్రి అఫ్ఘాన్ దళాలు జరిపి న కాల్పులకు ప్రతిగా పాక్ వైమానిక దళం 'ఆపరేషన్ గజబ్ లిల్ హక్' పేరుతో అఫ్ఘాన్ భూభాగంపై విరుచుకు పడింది. 4




## అమెరికా విద్యపై విముఖత

- 45 శాతం తగ్గిన భారతీయుల విద్యార్థుల సంఖ్య 4

# అభియోగాలే తప్ప ఆధారాలేవీ!

సీబీఐపై రౌస్ అవెన్యూ కోర్టు తీవ్ర ఆగ్రహ


### ఢిల్లీ మద్యం కేసు కొట్టివేత

కేజ్రీవాల్, సిసోడియా, కవితకు ఊరట

దర్యాప్తు అధికారులపైనే విచారణ జరగాలని వ్యాఖ్య

హైకోర్టుకు వెళ్తామన్న సీబీఐ





> ఢిల్లీ మద్యం పాలసీ కేసులో నిందితులుగా ఉన్న ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, తెలంగాణ మాజీ ఎంపీ కవిత సహా 23 మందికి ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు భారీ ఊరటనిచ్చింది. ఈ కేసులో తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ కోర్టు కేసును పూర్తిగా కొట్టివేసింది. నిందితులపై మోపిన అభియోగాలను నిరూపించడంలో సీబీఐ విఫలమైందని స్పష్టం చేస్తూ, అందరినీ కేసు నుంచి డిశ్చార్జ్ (విముక్తి) చేస్తూ శుక్రవారం తీర్పునిచ్చింది.

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** ఢిల్లీ మద్యం లిక్కర్ పాలసీ కేసును ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కొట్టి వేసింది. ఈ కేసులో దోషులుగా ఉన్న దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజీవ్రాల్, మాజీ ఉప ముఖ్య మంత్రి సిసోదియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవితకు భారీ ఊరట లభించింది. మద్యం పాలసీ కేసుపై తాజాగా విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు నిందితులందరి పైన నమోదు చేసిన కేసులు కొట్టివేసింది.

మిగతా 4 లో

## న్యాయవ్యవస్థపై పెట్టుకున్న నమ్మకం నిలబడింది

- కష్టకాలంలో అండగా నిలిచి వారిందరికీ కృతజ్ఞతలు
- ఢిల్లీ కోర్టు తీర్పుపై మాజీ ఎంపీ కవిత హర్షం 3

కడిగిన ముత్యంలా బయటకు వస్తానని ఆనాడే చెప్పా





# దోమల నివారణ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి

- కేటాయించిన స్థలంలోనే చెత్త వేసేలా అవగాహన
- హోటల్స్‌లో ఫుడ్ సేఫ్టీకి ప్రత్యేక చర్యలు
- అవసరమైతే కిచన్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటుతో పరిశీలన
- మున్సిపల్ శాఖపై సమీక్షలో సీఎం రేవంత్ సూచనలు

**హైదరాబాద్, ఫిబ్రవరి 27 :** శానిటేషన్, దోమల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు దిశానిర్దేశంచేశారు. మున్సిపల్ అధికారులు మార్క్ చేసిన చోటనే చెత్త వేసేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశానికి సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. కోర్ అర్బన్ రీజియన్ పరిధిలో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. ఎప్పటికప్పుడు పనులు పూర్తి చేసేందుకు అవసరమైతే టెక్నాలజీని ఉపయోగించాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు.

మిగతా 2 లో



# ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

**బకాయిలు కోసం రూ.745 కోట్లు విడుదల**

**హైదరాబాద్, ఫిబ్రవరి 27:** తెలంగాణ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. పెండింగ్ బకాయిలు రూ.745 కోట్లు విడుదల చేసింది. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశాలతో అధికారులు ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. విడతల వారీగా బకాయిలు విడుదల చేస్తామని గతంలో ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఉద్యోగ సంఘాలకు ఇచ్చిన హామీ మేరకు తాజాగా బకాయిలు విడుదలయ్యాయి. మరోవైపు గ్రామ పంచాయతీలకు సైతం రూ.389 కోట్ల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ఆర్థిక బకాయిల విషయంలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం నాడు ఆయన ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు రూ.745 కోట్ల పెండింగ్ బిల్లులను విడుదల చేశారు. గతంలో ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపిన తర్వాత పెండింగ్ బిల్లులను విడతల వారీగా క్లియర్ చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకుంది. ప్రభుత్వం విడుదల చేసిన రూ.745 కోట్లతో ఉద్యోగులకు పెద్ద ఊరట లభించినట్లయింది. కేవలం ఉద్యోగులకే కాకుండా, గ్రామాల్లో అభివృద్ధి పనులు, పెండింగ్ బిల్లుల కోసం ప్రభుత్వం అదనంగా రూ389 కోట్లను ఆర్థిక శాఖ విడుదల చేసింది. ఈ నిధుల విడుదల ద్వారా గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతం కావడంతో పాటు, ఎంతోమంది ఉద్యోగుల ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయని అంటున్నారు.

# మెడికల్ సీట్ల పేరుతో వందమందికి మోసం

**ఇద్దరు కేటుగాళ్లను అరెస్ట్ చేసిన పోలీసులు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 27:** మెడికల్ సీట్లు ఇప్పిస్తామని చెప్పి దాదాపు 40 లక్షల రూపాయలు మోసం చేసిన ఘటన కుత్బుల్లాపూర్, పేట్ బాషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. శుక్రవారం మోసానికి పాల్పడిన ఇద్దరు కేటుగాళ్లను పేట్ బాషీరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. జీడిమెట్ల విలేజ్ లోని ఓ బాధితుని ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్టు ఎస్.హెచ్.ఓ తెలిపారు. ఈ కేసులో ఇద్దరు నిందితులు అర్వింద్ రావు(40), న్యూఢిల్లీ, వెంకటరావు(58) హైదరాబాద్ లో అరెస్ట్ చేశారు. దేశవ్యాప్తంగా నీట్ ర్యాంకులు సాధించిన విద్యార్థులే టార్గెట్ గా దాదాపు 100 మందిని మోసం చేసినట్టు పోలీసుల దర్యాప్తులో తేలింది. దాదాపు 2 కోట్ల50 లక్షలకు పైగా మోసం చేసినట్టు పోలీసుల వెల్లడించారు. నిందితుల నుంచి నకిలీ అలాట్‌మెంట్ లెటర్స్, ఐడీలు, నకిలీ ఒప్పందపత్రాలు, 4 మొబైల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఈ సందర్భంగా పోలీసులు తెలిపారు.

# దేశ ఆర్థిక వ్యవస్థలో మార్పు

**7.8శాతం వృద్ధి రేటు నమోదు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** 2025-26 అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో దేశ ఆర్థికవ్యవస్థ 7.8 శాతం వృద్ధి రేటు నమోదు చేసింది. గతేడాది 7.4శాతం కన్నా పెరిగినట్లు కేంద్రం శుక్రవారం తెలిపింది. నూతన జీఎస్‌టి సిరీస్ ప్రకారం ఆర్థిక అంచనాల కోసం 2022-23ని బేసిక్ ఇయర్‌గా తీసుకున్నట్లు తెలిపింది. గతంలో ఇది 2011-12గా ఉండేది. ప్రస్తుత సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తి (జీడిపి) 7.6శాతంగా అంచనా వేసినట్లు గణాంకాల మరియు కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ తెలిపింది. గతేడాది జనవరిలో అంచనా విడుదలైన అంచనాల ప్రకారం.. ఇది 7.4శాతంగా ఉంది. 2025-26 జులై-సెప్టెంబర్ కాలానికి వృద్ధి రేటును 8.2శాతం నుండి 8.4శాతానికి పెంచారు. అయితే మొదటి త్రైమాసికంలో వృద్ధి రేటును 7.8శాతం నుండి 7.6శాతానికి తగ్గించారు.

# కేన్సర్ నివారణ దిశగా..

**హైదరాబాద్,ఫిబ్రవరి27(ఆర్ఎన్ఎ):** సర్వైకల్ కేన్సర్ నివారణెళి లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చేపట్టనున్నారు. కింగ్ కోఠి డిస్ట్రిక్ట్ హాస్పిటల్‌లో శనివారం ఉదయం 11 గంటలకు వ్యాక్సినేషన్ పంపిణీ కార్యక్రమాన్ని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 4 లక్షల మంది బాలికలకు వ్యాక్సిన్ ఇవ్వనున్నట్లు ఆరోగ్యశాఖ తెలిపింది.

# చిలకూరు పూర్వ ప్రధానార్చకులు సౌందర్ రాజన్ కన్నుమూత

**మృతికి పలువురు ప్రముఖులు సంతాపం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 27:** చిలుకూరు బాలాజీ ఆలయ పూర్వ ప్రధాన అర్చకుడు సౌందర్ రాజన్ (90) కన్నుమూశారు. గత కొన్నాళ్లుగా వృద్ధాప్య సమస్యల కారణంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. శుక్రవారం చిలుకూరులోని నివాసంలో కన్నుమూశారు. ఈ మేరకు ఆయన తనయుడు, ఆలయ ప్రస్తుత ప్రధాన అర్చకుడు రంగరాజన్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఈ ప్రసిద్ధ ఆలయాన్ని సౌందర్ రాజన్ ఎంతో కాలం క్రమశిక్షణతో, సేవానిరతితో నిర్వహించారు. భక్తులతో మమేకమై స్వామి వారి ప్రసాదాన్ని, సేవా విధానాన్ని ఎంతో ప్రశాంతంగా వివరించేవారు. వీసా దేవుడిగా చిలుకూరి ఆలయాన్ని ఆయన ప్రసిద్ధి పొందేలా చేశారు. ఇక్కడ భక్తులందరికీ ఒకేతరహా దర్శనంతో అవకాశ కల్పించారు. హుండీ లేకుండా చేశారు. భక్తులు నేరుగా దర్శనం కలిగించుకునేలా ఆలయాన్ని తీర్చిదిద్దారు. అలాగే ఆలయాన్ని స్వాధీనం చేసుకోవాలని ప్రభుత్వం ప్రయత్నించినా కోర్టుల ద్వారా దివంగత సౌందర్ రాజన్ పోరాడి అడ్డుకున్నారు. ఇకపోతే సౌందర్ రాజన్ ఉస్మానియా విశ్విద్యాలంయంలో కామర్స్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. సుదీర్ఘ కాలం ప్రొఫెసర్‌గా, తరవాత ఆయన ఉస్మానియా వర్సిటీ రిజిస్ట్రార్‌గా కూడా పనిచేసి రిటైర్ అయ్యారు. తరవాత వంశపారంపర్య ఆలయ అర్చకవృత్తిలో స్థిరపడ్డారు. ఆయన మృతికి పలువురు సంతాపం వ్యక్తం చేశారు. సమాచారశాఖ మాజీ కమిషనర్ కెవి రమణాచారి, తెలంగాణ శ్రీవైష్ణవసంఘం ప్రతినిధులు కూడా సంతాపం తెలిపారు.

# దోమల నివారణ, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి

మొదటి పేజీ తరువాయి



కోర్ అర్బన్ రీజియన్‌లో ఉన్న అన్ని స్ట్రీట్‌లైట్స్‌కు ప్రత్యేక నెంబర్ ఇచ్చి డ్యాష్ బోర్డుకు కనెక్ట్ చేయాలని సూచించారు. టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. నగర పరిధిలో ఫుడ్ సేఫ్టీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. హోటల్స్‌లోని కిచెన్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని దిశానిర్దేశం చేశారు. తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్దేశించారు. హోటల్స్‌కి రేటింగ్, సర్టిఫికేట్ ఇచ్చే విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ఫైర్ సేఫ్టీ విషయంలో అడ్వాన్స్‌డ్ ఎక్విప్‌మెంట్ వినియోగించాలని మార్గనిర్దేశం చేశారు. నగరంలోని సిగ్నల్ జంక్షన్స్, సర్కిల్స్‌లో వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేసి వర్షపు నీటిని ఒడిసి పట్టాలని సూచించారు. ఇందుకు ముందుగా కొన్ని ఏరియాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలిని సీఎం రేవంత్‌రెడ్డిసూచన చేశారు. టెక్నాలజీ ద్వారా సమస్య తలెత్తిన చోట వెంటనే పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. హోటల్స్ లోని కిచెన్ లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించాలి తరచూ తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రత్యేక మానిటరింగ్ వింగ్ ఎప్పటికప్పుడు పరిశీలించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఇందుకు ముందుగా కొన్ని ఏరియాలను గుర్తించి పైలట్ ప్రాజెక్టుగా వాటర్ హార్వెస్టింగ్ వెల్స్ ఏర్పాటు చేయాలన్నారు.

# లొంగిన మావోయిస్టులకు అండ

- రివార్డులు త్వరగా అందచేస్తాం
- లొంగిన నేతలతో సిఎం రేవంత్ భేటీ



**హైదరాబాద్, ఫిబ్రవరి 27:** మావోయిస్టుల అగ్రనేతలతో రేవంత్‌రెడ్డి శుక్రవారం సచివాలయంలో సమావేశం అయ్యారు. మావోయిస్టుల లొంగుబాటు పాలసీపై సీఎం చర్చించారు. ఈ సందర్భంగా ఒక్కొక్కరిని పలకరించారాయన. మావోయిస్టుల పునరావాసంపై హామీ ఇచ్చారు. లొంగిపోయిన మావో నేతలపై ఉన్న రివార్డును వెంటనే అందించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అనుమతిస్తే జైల్లో ఉన్న మావోయిస్టులను కలుస్తామని మావోయిస్టు నేతలు పేర్కొన్నారు. అలాగే , లొంగిపోయిన మావోయిస్టుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. లొంగిపోవ టానికి చొరవ చూపిన ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌కి మావోయిస్ట్ నేతలు ధన్యవాదాలు తెలిపారు. చట్టప్రకారం పునరావాసం, రక్షణ పరమైన సహకారం తమ ప్రభుత్వం అందిస్తుందని భరోసా కల్పించారు. మావోయిస్టుల లొంగుబాటుపై తెలంగాణ అసెంబ్లీలో ప్రకటన చేస్తానని తెలిపారు. మావోయిస్టులతో రాష్ట్ర ప్రభుత్వం జరిపిన చర్చలు బాగున్నాయని మావోయిస్టులు అన్నారు. ఈ ప్రభుత్వ లొంగుబాటు పాలసీ బాగుందని సీఎంకు మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ తెలిపారు. తమ భవిష్యత్ ప్రణాళికలపై సీఎం రేవంత్‌రెడ్డికి మావోయిస్టు అగ్రనాయకులు వివరించారు.

# అభివృద్ధిపైనే మా ఫోకస్

- ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం
- మంత్రి పొన్నం ప్రభాకర్
- ‘జీఐ ఆన్ వీల్స్’ ప్రారంభోత్సవంలో రాజకీయ విమర్శలకు కౌంటర్
- వారసత్వ సంపదపై కాంగ్రెస్ ముద్ర




**హైదరాబాద్, ఫిబ్రవరి 27:** తెలంగాణలో గత పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన సాంస్కృతిక వారసత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పునరుజ్జీవింపజేస్తోందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. శుక్రవారం ఎంజీబీఎస్ వద్ద ‘జీఐ ఆన్ వీల్స్’ బస్సులను గవర్నర్‌తో కలిసి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు ప్రభుత్వంపై చేస్తున్న ఆరోపణలను తిప్పికొడుతూ, తమ ప్రభుత్వం కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కళాకారుల ఆర్థికాభివృద్ధి కోసం పనిచేస్తోందని నిరూపించామన్నారు.

**బీఆర్ఎస్ నేతలకు కౌంటర్:**

బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాలో చేస్తున్న ప్రచారంపై స్పందిస్తూ.. “బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నామన్నది కేవలం అబద్ధం. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. మా దృష్టి అంతా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపైనే ఉంది“ అని మంత్రి కుండబద్దలు కొట్టారు. గత ప్రభుత్వ హయాంలో గాలికి వదిలేసిన జీఐ (భౌగోళిక గుర్తింపు) ఉత్పత్తులను ఇప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా, ఆర్టీసీ బస్సుల ద్వారా వాటికి బ్రాండ్ అంబాసిడర్లుగా మారుస్తున్నామని తెలిపారు.

**వారసత్వంపై ‘హస్తం’ ముద్ర:**

తెలంగాణ అస్థిత్వానికి ప్రతీకలైన పోచంపల్లి, నిర్మల్, కరీంనగర్ కళలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి వివరించారు. గవర్నర్ దూరదృష్టితో రూపొందించిన ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఇది కేవలం బస్సుల ప్రదర్శన మాత్రమే కాదని, గ్రామీణ కళాకారుల కుటుంబాల్లో వెలుగులు నింపే ప్రయత్నమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా అటు సాంస్కృతిక గుర్తింపును, ఇటు ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తూ ప్రతిపక్షాల విమర్శలకు తమ పనితీరుతోనే సమాధానం ఇస్తున్నామని కాంగ్రెస్ శ్రేణులు పేర్కొంటున్నాయి.

# కూకట్‌పల్లిలో గజం రూ.2.65 లక్షలు

- హౌజింగ్ బోర్డు కాలనీలో వేలం వెర్రి




**హైదరాబాద్, ఫిబ్రవరి 27:** హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించిన హౌసింగ్ బోర్డు వేలం మరోసారి రికార్డు సృష్టించింది. ఈ వేలంలో గజం భూమి ధర రూ.2.65 లక్షలకు చేరుకోవడం రియల్ ఎస్టేట్ రంగంలో సంచలనంగా మారింది. భారీ సంఖ్యలో బిడ్డర్లు పాల్గొనడంతో ప్లాట్లు,

ప్లాట్లకు ఊహించని స్థాయిలో ధరలు నమోదయ్యాయి. ఈ వేలం ద్వారా మొత్తం రూ.24.26 కోట్ల ఆదాయం హౌసింగ్ బోర్డుకు లభించింది. ఇది నగరంలో రియల్ ఎస్టేట్ మార్కెట్‌కు ఉన్న భారీ డిమాండ్‌ను స్పష్టంగా తెలియజేస్తోంది. కేపీహెచ్‌బీ కాలనీలో నిర్వహించిన ఈ వేలంలో ఓపెన్ ప్లాట్లకు భారీ పోటీ నెలకొంది. కనీస అప్‌సెట్ ధర గజానికి రూ.1.30 లక్షలుగా నిర్ణయించగా, బిడ్డర్ల మధ్య తీవ్ర పోటీ నెలకొనడంతో గజం ధర రూ.2.65 లక్షలకు చేరింది. ఇది ఆ ప్రాంతంలో ఇప్పటివరకు నమోదైన అత్యధిక ధరగా అధికారులు పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో కేపీహెచ్‌బీ కాలనీకి ఉన్న ప్రాధాన్యం, అభివృద్ధి చెందిన మౌలిక వసతులు, మెట్రో, రహదారి సౌకర్యాలు ఈ ధరలు పెరగడానికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. ఈ వేలంలో మొత్తం 40 మంది బిడ్డర్లు పాల్గొన్నారు. ప్రతి ప్లాట్, పఎ÷-లాట్ కోసం తీవ్రమైన పోటీ జరిగింది. ముఖ్యంగా ఫేజ్?1, ఫేజ్?2లోని ధర్మారెడ్డి కాలనీలో ఉన్న 4 ఓపెన్ ప్లాట్లకు భారీ డిమాండ్ పలికింది. ప్లాట్ల సంఖ్య పరిమితంగా ఉండటంతో బిడ్డర్లు అధిక ధరలకు కొనుగోలు చేయడానికి ముందుకు వచ్చారు. ఇది ఆ ప్రాంతంలో పెట్టుబడులకు ఉన్న ఆకర్షణను సూచిస్తోంది. ఫేజ్15లోని సంపూర్ణం అపార్ట్‌మెంట్‌లో ఉన్న 8 ఎ÷-లాట్లను కూడా ఈ వేలంలో విక్రయించారు. 1400 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఎ÷-లాట్ గరిష్టంగా రూ.1.10 కోట్లకు అమ్ముడుపోయింది. ఈ ఎ÷-లాట్లకు అప్‌సెట్ ధర రూ.90 లక్షలుగా నిర్ణయించగా, బిడ్డర్ల పోటీ కారణంగా ధరలు గణనీయంగా పెరిగాయి. అన్ని ప్లాట్ల అప్‌సెట్ ధర కంటే ఎక్కువ ధరలకు విక్రయించటం విశేషం. ఈ వేలం ద్వారా హౌసింగ్ బోర్డుకు మొత్తం రూ.24.26 కోట్ల ఆదాయం వచ్చింది. ఇది తెలంగాణ ప్రభుత్వానికి పెద్ద ఆదాయ వనరుగా నిలిచింది. రియల్ ఎస్టేట్ రంగంలో కేపీహెచ్‌బీ కాలనీకి ఉన్న డిమాండ్‌ను ఈ వేలం మరోసారి నిరూపించింది. హైదరాబాద్‌లో భూమి, ఎ÷-లాట్ల ధరలు నిరంతరం పెరుగుతున్న నేపథ్యంలో పెట్టుబడిదారులు ఈ ప్రాంతంపై ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ హైదరాబాద్‌లో అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో ఒకటి. మెట్రో రైలు, ప్రధాన రహదారులు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్ వంటి అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో ఈ ప్రాంతానికి భారీ డిమాండ్ ఉంది. ఇలాంటి వేలం పాటలు భవిష్యత్తులో కూడా కొనసాగితే, భూమి ధరలు మరింత పెరిగే అవకాశం ఉంది.

# విద్యా కమిషన్‌లో విద్యావేత్తలేరీ?



- విద్యావేత్తలే లేని కమిటీ నివేదికతో సాధించేదేమిటి
- బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు

హైదారాబాద్,ఫిబ్రవరి27(ఆర్‌ఎన్‌ఎ): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ విద్యా కమిషన్‌లో అనుభవమున్న విద్యావేత్తలు లేరని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అన్నారు. తెలంగాణ విద్యా కమిషన్‌లో స్కూల్ పిల్లలకు గానీ, కాలేజీ లేదా యూనివర్సిటీ స్థాయిలో బేసిక్ పాఠాలు చెప్పిన అనుభవం ఉన్న విద్యావేత్త ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. కమిషన్ ఇచ్చిన నివేదికపై హరీష్ రావు ఎక్స్ వేదికగా స్పందించారు. అసలు విద్యావేత్తలే లేని కమిటీని వేసి, వారితో విద్యా విధానంపై నివేదిక ఇప్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. విద్యా కమిషన్‌లో అసలైన విద్యావేత్తలు ఎక్కడ అని ప్రశ్నించారు. జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న ఇద్దరు ప్రొఫెసర్లు మినహా, ఎడ్యుకేషన్ లో పీహెచ్‌డీ చేసిన వాళ్లు కానీ, స్కూల్ సిలబస్ తయారీలో, కోర్ సైన్స్ సబ్జెక్టుల్లో పట్టున్న వాళ్లు కానీ ఈ కమిటీలో ఒక్కరైనా లేరని పేర్కొన్నారు. ఈ కమిటీ చైర్మన్ ఒక రిటైర్డ్ ఐఏఎస్ అధికారి అని పైగా ఆయనొక ఇంజనీర్ అని అన్నారు. ఆఫీసులు నడపడం వేరు. చదువులు చెప్పడం వేరు. పరిపాలనలో అనుభవం ఉన్నంత మాత్రాన. పిల్లల సైకాలజీ, పాఠాలు చెప్పే పద్ధతుల మీద పూర్తి అవగాహన ఉన్నట్టా. తెలంగాణ విద్యా భవిష్యత్తును మార్చేంత అర్హత, నైపుణ్యం ఈ కమిటీకి ఉందని మీరు నిజంగానే నమ్ముతున్నారా అంటూ ప్రశ్నించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే అత్యంత కీలకమైన విద్యా కమిషన్‌లో విద్యావేత్తలు, అనుభవం ఉన్న టీచర్లు, పిల్లల మనస్తత్వం తెలిసిన చైల్డ్ సైకాలజిస్టులు, సబ్జెక్ట్ నిపుణులు లేకుండానే రాష్ట్రానికి ఏకంగా ఒక కొత్త విద్యా విధానాన్ని తయారు చేయొచ్చనే గొప్ప ఆలోచన మీకే దక్కుతుందని పేర్కొన్నారు.సిలబస్ ఎలా ఉండాలి, బోధనా పద్ధతులు ఎలా ఉండాలి అనేది గ్రౌండ్ లెవెల్లో పాఠాలు చెబుతున్న సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ కు తెలుస్తుంది కానీ.. అసలు ఆ సంబంధమే లేని అధికారులకు, వేరే రంగాల వారికి ఎలా తెలుస్తుందని నిలదీశారు. విద్యావ్యవస్థ మీద కనీస అవగాహన లేకుండా, అర్హత లేని వారితో ప్రయోగాలు చేయడం అంటే తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడటమేనని అన్నారు. విద్యాశాఖను ముఖ్యమంత్రి ఎంత నిర్లక్ష్యంగా గాలికి వదిలేశారో చెప్పడానికి ఈ కమిటీ ఏర్పాటే ఒక ఉదాహరణ అని విమర్శించారు. కొత్త విద్యా విధానం విషయంలో తెలంగాణలోని విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు పారదర్శకతను కోరుకుంటున్నారని తెలిపారు. గడిచిన రెండేండ్లుగా విద్యాశాఖను గాలికి వదిలేసి, సబ్జెక్ట్ తెలిసిన విద్యావేత్తలకు ఈ బాధ్యత అప్పగించకుండా, సంబంధం లేని వారితో కమిటీ వేసి కాలయాపన చేసి ఏం సాధించినట్లని ఆరోపించారు. వేసిన కమిటీ ఎంత గొప్పగా ఉంటే, వారిచ్చిన నివేదిక ఇంకెంత గొప్పగా ఉంటుందో అర్థమవుతున్నదని, విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించే నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు.

# రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోంది

- రాష్ట్రంలో కాంగ్రెస్ ఉన్నా.. నడిగడ్డ బీఆర్‌ఎస్ వెనకే : కేటీఆర్
- పాలమూరులో గెలిచిన కౌన్సిలర్లకు సన్మానం




**హైదరాబాద్, ఫిబ్రవరి 27 :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పటికీ నడిగడ్డలో మాత్రం ప్రజల విశ్వాసం ఇప్పటికీ బీఆర్‌ఎస్ పైనే ఉందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నడిగడ్డ స్ఫూర్తి రాష్ట్రం మొత్తం వ్యాపించాలని పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ పార్టీ తరఫున గెలిచిన కౌన్సిలర్లకు తెలంగాణ భవన్‌లో సన్మానించారు. సర్పంచ్ ఎన్నికల నుంచి మున్సిపల్ ఎన్నికల వరకు మెజారిటీ స్థానాలు గెలుచుకోవడం పార్టీ బలాన్ని నిరూపిస్తోందన్నారు. ఆలంపూర్, ఐజ, గద్వాల, వడ్డేపల్లి ప్రాంతాల్లో బీఆర్‌ఎస్‌కు ప్రజలు అందించిన మద్దతు విశేషమని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం అరాచక పాలన నడుస్తోందని కేటీఆర్ విమర్శించారు. నాగర్‌కర్నూల్‌లో రెండు నెలల పాప మరణ ఘటన, కోదాడలో దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ వంటి ఘటనలు ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. ఖమ్మం వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేతలు ప్రజలను రోడ్డున పడేసిన దారుణ చర్యలని ఆక్షేపించారు. కేసీఆర్ నాయకత్వంలో గతంలో అభివృద్ధి, సంక్షేమం రెండు జోడెడ్లలా ముందుకు సాగాయని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి, అరాచకం జోడెడ్లుగా మారాయని విమర్శించారు. చెక్ డ్యామ్‌లు పేల్చడం, ఫ్లలె ప్రకృతి వనాల్లో చెట్ల నరుకులు వంటి చర్యలు రాష్టాన్ని వెనక్కి నెడుతున్నాయని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని, రైతు బంధు, ఎరువుల సరఫరా వంటి అంశాల్లో రైతులను తీవ్రంగా నిరాశపరిచిందని పేర్కొన్నారు. ప్రజలకు ఇప్పుడు కాంగ్రెస్ నిజ స్వరూపం అర్థమైందన్నారు.ఎమ్మెల్సీ చల్ల వెంకట్రామి రెడ్డి ప్రజల సమస్యలపై అంకితభావంతో పనిచేసే నాయకుడని, ఎమ్మెల్యే విజయుడు కూడా అదే తత్వాన్ని కొనసాగిస్తున్నారని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను ప్రలోభాలకు గురిచేసే ప్రయత్నాలు చేస్తుందని ముందుగానే హెచ్చరించిన కేటీఆర్, పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోసారి కేసీఆర్ నాయకత్వంలో గులాబీ జెండా ఎగరడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# న్యాయవ్యవస్థపై పెట్టుకున్న నమ్మకం నిలబడింది

- కడిగిన ముత్యంలా బయటకు వస్తానని ఆనాడే చెప్పా
- కష్టకాలంలో అండగా నిలిచి వారిందరికీ కృతజ్ఞతలు
- ఢిల్లీ కోర్టు తీర్పుపై కవిత హర్షం

**హైదరాబాద్, ఫిబ్రవరి 27:** న్యాయవ్యవస్థపై తాను పెట్టుకున్న నమ్మకం నిలబడిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత అన్నారు. తను నిందితురాలిగా ఉన్న దిల్లీ మద్యం కేసును కోర్టు కొట్టివేసిన నేపథ్యంలో హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. నేను కడిగిన ముత్యంలా బయటికి వస్తానని తెలంగాణ ప్రజలకు మొదట్నుంచి చెబుతున్నాను. అలాగే వచ్చాను. ఇది కేవలం రాజకీయ కక్షతో పెట్టిన కేసు అని ఎన్నోసార్లు చెప్పాను. అదే నిజమైంది. దీంతో నేను, నా కుటుంబం కొన్ని నెలలపాటు క్షోభ అనుభవించాం. విపక్షాలను వేధించేందుకు దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నారు. కోర్టు తీర్పు రాకుండానే నాపై కొందరు అనుచితంగా మాట్లాడారు. కష్ట సమయంలో అండగా నిలిచిన అందరికీ ధన్యవాదాలు. మరింత ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తాను అని కవిత అన్నారు. కోర్టు తీర్పు వెలువడిన అనంతరం 'సత్యమేవ జయతే' అని 'ఎక్స్'లో ఆమె పోస్ట్ చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసులో రౌస్ అవెన్యూ కోర్టు కీలక తీర్పు వెల్లడించింది. లిక్కర్ పాలసీ అవినీతి కేసులో సరైన ఆధారాలు లేవని వ్యాఖ్యలు చేసింది. సీబీఐ సరైన మెటీరియల్ లేకుండా కేసులో ఇరికించిందని కోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. భారీ ఛార్జ్‌షీట్‌లో అనేక లోపాలు ఉన్నాయని, వాటికి సాక్షులు లేదా స్టేట్‌మెంట్ల మద్దతు లేదని స్పష్టం చేసింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు భారీ ఊరట లభించింది. కవితకు క్లీన్ చీట్ ఇచ్చింది రౌస్ అవెన్యూ కోర్టు కవితపై సీబీఐ నమోదు చేసిన అభియోగాలన్నిటిని కొట్టివేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి జితేందర్ సింగ్. అరవింద్ కేజ్రీవాల్, సిసోడియాతో పాటు కవితకు క్లీన్ చిట్ ఇచ్చింది. లిక్కర్ కేసులో ఐదు నెలల పాటు కవిత జైల్లో ఉన్నారు. లిక్కర్ కేసులో కోర్టు తీర్పుపై కవిత స్పందించారు. కవిత మాట్లాడుతూ.. నిజం గెలిచింది.. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటకు వచ్చా.. నా తల్లిదండ్రులు, అత్తామామలు మాకు అండగా నిలిచారు.. కేసీఆర్,



బీఆర్‌ఎస్ పార్టీని టా÷-గ్గ్‌÷ట్ చేయడానికే ఈ కేసు పెట్టారు.. నన్ను మూడేళ్ల పాటు నానా మాటలు అన్నారు.. సోషల్ మీడియాలో ట్రోల్స్ చేశారు.. రాజకీయ కుట్రతోనే ఈ కేసు పెట్టారని నిరూపితమైంది.. నాకు అండగా నిలిచిన వారిని మరిచిపోను అంటూ కవిత భావోద్వేగానికి గురైంది.

# అవగాహన లేకుండా మాట్లాడొద్దు.. బండి

## కోర్టు తీర్పు మేరకే కూల్చివేతలు

## సంజయ్‌కు మంత్రి పొన్నం కౌంటర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 27:** కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ చేసిన ఆరోపణలపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా స్పందించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి న్యాయస్థానాల తీర్పులను కించపరిచేలా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన, కూల్చివేతలు, నిధుల విడుదల మరియు రైతు భరోసాపై బీజేపీ వైఖరిని ఎండగట్టారు. "హైకోర్టు, సుప్రీంకోర్టులు సదరు స్థలం ప్రభుత్వానిదే అని స్పష్టం చేశాక, అక్కడ ఉన్న అక్రమ కట్టడాలను తొలగించడం జరుగుతోంది. న్యాయస్థానాల పట్ల గౌరవం ఉన్న వ్యక్తి ఇలా మాట్లాడరు. బండి సంజయ్‌కు బహుశా ఈ విషయంపై అవగాహన లేకపోయి ఉండవచ్చు. జిల్లా కలెక్టర్ ద్వారా కోర్టు తీర్పు కాపీలను ఆయనకు పంపిస్తాం, అవి చదివిన తర్వాత మాట్లాడితే మంచిది" అని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తాము వ్యక్తిగతంగా ఎవరికీ వ్యతిరేకం కాదని, కేవలం చట్టం తన పని తాను చేసుకుపోతోందని స్పష్టం చేశారు. రైతు భరోసాతో పాటు ఎన్నికల హామీలన్నింటినీ విఫలం కాకుండా అమలు చేస్తున్నామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఇక ఢిల్లీ మద్యం కేసు తీర్పుపై స్పందిస్తూ.. "రాజకీయ కక్ష సాధింపు ధోరణిలో బీజేపీది పైచేయి. అక్కడ కేజ్రీవాల్, ఇక్కడ కవితలపై కక్షగట్టారు. కవితకు కోర్టులో క్లీన్ చిట్ వచ్చినా, ప్రజల్లో ఒక అపవాదు మాత్రం ఉంది. దానికి సంబంధించి భవిష్యత్తులో ప్రజలే తీర్పు చెప్తారు" అని వ్యాఖ్యానించారు. తెలంగాణ నుండి కేంద్రానికి వెళ్తున్న పన్నుల నిధులు మరియు తిరిగి రాష్ట్రానికి వస్తున్న వాటాపై బీజేపీ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.





# బీఆర్‌ఎస్ ఓటమి స్వయంకృతపరాధమే

## లిక్కర్ కేసుతో ఓటమి అన్నది బోగస్

## కేటీఆర్ ట్వీట్‌పై మండిపడ్డ కవిత

**హైదరాబాద్, ఫిబ్రవరి 27:** దిల్లీ మద్యం కేసు కారణంగానే బీఆర్‌ఎస్ ఓటమి చెందిందని కెటిఆర్ చేసిన వ్యాఖ్యలపై జాగృతి అధ్యక్షురాలు కవిత మండిపడ్డారు. స్వయంకృతంతో ఓడిపోయిన వారు ఇప్పుడు ఈ కేసే కారణమని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. మద్యం కేసులో తన తప్పు తేలకుండానే వ్యక్తిత్వ హననం చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు వెల్లడైన తర్వాత ఎక్స్‌లో తన అన్న కేటీఆర్ పెట్టిన పోస్టు చూశానని, నాపై పెట్టిన కేసు వల్లే బీఆర్‌ఎస్ ఓడిందనట్లుగా ఆయన పోస్టు చేశారని అన్నారు. బీఆర్‌ఎస్ నేతలను నేను సూటిగా ప్రశ్నిస్తున్నా. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమికి నేను కారణమా? ప్రజలకు ఇళ్లు ఇవ్వకపోవడం బీఆర్‌ఎస్ ఓటమికి కారణం. ఉద్యోగాలు ఇవ్వకపోవడం కారణం. అభ్యర్థులను మార్చకుండా దోపిడీదారులకే మళ్లీ టికెట్లు ఇవ్వడం కారణం. అన్నిటికంటే ముఖ్యంగా మీ అహంకార ధోరణెళి పార్టీ ఓటమికి కారణం అంటూ ఏకి పారేశారు. ఇవాళ కోర్టు తీర్పును మీకు అనుకూలంగా మార్చుకొని మాట్లాడుతున్నారు. బీఆర్‌ఎస్ ఓటమిని నా మెడలో వేయాలని చూడటం కరెక్ట్ కాదు. కేటీఆర్.. ఇప్పటికైనా మీరు ప్రజల తీర్పును గౌరవించాలని అన్నారు. నేను కడిగిన ముత్యంలా వస్తానని అన్నారు. అలాగే తీర్పుతో రుజువు అయ్యిందన్నారు. దిల్లీ మద్యం కుంభకోణం కేసులో కవితకు క్లీన్‌చిట్ ఇస్తూ వచ్చిన తీర్పుపై బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. 'మద్యం కుంభకోణం పేరుతో దిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని కూల్చారు. ఈ కుంభకోణం కారణంగానే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి పాలైంది. ఇవాళ కవితకు అనుకూలంగా వచ్చిన తీర్పుతో న్యాయం జరిగింది. ఇదే విధంగా మా నాయకులపై పెట్టిన ప్రతి కేసు రాజకీయ కక్షలో భాగమే. నిజాలు బయటకు రానంత కాలం కాంగ్రెస్, భాజపా దుష్ప్రచారాలను చూస్తూనే ఉంటాం అని పేర్కొన్నారు.

# పేదల ఇండ్లు కట్టేది మోదీ.. కూల్చేది రేవంత్ రెడ్డి

## కూల్చివేతలు ఆపకపోతే ప్రభుత్వాన్ని ప్రజలే కూల్చేస్తారు


## 'రైతు భరోసా' బాకీ రూ. 27 వేల కోట్లు ఎక్కడ?

## కేంద్ర మంత్రి బండి సంజయ్ నిప్పులు

## కాళేశ్వరం విచారణపై సీఎంకు బహిరంగ సవాల్



**కరీంనగర్, ఫిబ్రవరి 27:** కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 4 కోట్ల ఇండ్లు నిర్మించి పేదలకు అండగా నిలుస్తుంటే, రాష్ట్రంలోని రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం పేదల ఇండ్లను కూల్చడంలో పోటీ పడుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం కరీంనగర్‌లోని 51వ డివిజన్‌లో రూ. 16 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పేదలు అప్పోసప్పో చేసి కట్టుకున్న ఇండ్లను కూల్చడం దుర్మార్గమని బండి సంజయ్ మండిపడ్డారు. "ఇండ్లు కట్టేటప్పుడు అభ్యంతరం చెప్పని అధికారులు, ఇప్పుడు కూల్చడానికి ఎలా వస్తారు? రేవంత్ రెడ్డి తన తీరు మార్చుకోకపోతే, రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రజలే కూల్చివేసే రోజు దగ్గర్లోనే ఉంది" అని హెచ్చరించారు. కూల్చివేతలను వెంటనే నిలిపివేయాలని, లేనిపక్షంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు నాయకత్వంలో రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని స్పష్టం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి.. కేసీఆర్‌ను మించిపోయారని ఎద్దేవా చేశారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత 'రైతు భరోసా' వేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. కాళేశ్వరం అవినీతిపై విచారణ జరిపించే దమ్ము రేవంత్ రెడ్డికి లేదని, ఆ విషయం ఒప్పుకుంటూ కేంద్రానికి లేఖ రాస్తే.. తామే విచారణ చేపట్టి బాధ్యులను శిక్షిస్తామని సవాల్ విసిరారు. కాంగ్రెస్, మజ్లిస్ పార్టీలు రెండూ ఒక్కటేనని, మున్సిపల్ ఎన్నికల్లో పదవులు పంచుకున్న ఈ రెండు పార్టీలు ఇప్పుడు విడిపోయినట్లు డ్రామాలాడుతున్నాయని విమర్శించారు. "ముస్లిం అంటే కాంగ్రెస్ అని సీఎం చెప్పారు కదా, మరి ఓవైసీతో ఎక్కడ చెడిందో ప్రజలకు చెప్పాలి" అని డిమాండ్ చేశారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావివ్వనని, కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొచ్చి కరీంనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఈ సందర్భంగా బండి సంజయ్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కార్పొరేటర్ భండారి వేణు తదితరులు పాల్గొన్నారు.



సంపాదకీయం

# చీప్.. లిక్కర్ కేసు!

**లిక్కర్ కేసు ఉత్తిదే అని తేలిపోయింది. అభియోగాలు కాదు..ఆధారాలు చూపండి అని కోర్టు వేసిన ప్రశ్నలకు సిబిఐ బిక్కచచ్చిందనే చెప్పాలి. అభియోగాలు సరే..ఆధారాలు ఉన్నాయా అని నిలదీసింది. ఆధారాలు లేకుండా ఎలా కేసు నమోదు చేశారని ప్రశ్నించింది. ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు ఢిల్లీ లిక్కర్ కేసును కొట్టివేసింది. ఈ వ్యవహారంతో ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కల్వకుంట్ల కవిత సహా 23మంది నిర్దోషులుగా కోర్టు తేల్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా..సిబిఐ ఎందుకింత నిర్లక్ష్యంగా, నిస్తేజంగా తయారయ్యిందన్న అనుమానం కలుగుతోంది.**

సిబిఐ లాంటి సంస్థ లిక్కర్ పాలసీ కేసులో పక్కా ఆధారాలు లేకుండా ఎందుకింత డ్రామా నడిపిందన్నదే అనుమానం. ఇక్కడే ఆధారాలు లేవని కోర్టు తేల్చింది. అయినా హైకోర్టులో సవాల్ చేస్తామని చెబుతోంది. అక్కడా ఇలాగే ఎదురుదెబ్బలు తప్పవంటే...ఆధారాలు రెడీ చేసుకోవాలి. అలాంటి ఆధారాలు ఉన్నాయా అన్నది సిబిఐకే తెలియాలి. నిజానికి ఈ కేసులో ఆధారాలు ఉండివుంటే సిబిఐ బలంగా పోరాడి ఉండేది. కానీ ఆధారాలు లేకుండా కేసులు పెట్టడం వల్ల కేజ్రీవాల్ రాజకీయ జీవితం దెబ్బతింది. కవిత రాజకీయ జీవితం దెబ్బతింది. అంటే ఇదంతా ఓ పద్ధతి ప్రకారం, ఓ ప్లాన్ ప్రకారం జరిగిందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఆయేషా మీరా కేసు, వైఎస్ వివేకానంద కేసు, ఇప్పుడు లిక్కర్ పాలసీ కేసు కూడా తుస్సుమంది. ఏ విషయంలోనూ సిబిఐ విజయం సాధించలేదు. అయితే రాజకీయంగా మోడీ, అమిత్ షాలు విజయం సాధించారు. ఈ కేసులతో వారు రాజకీయంగా లబ్ది పొందారనే చెప్పాలి. ఇకపోతే ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఢిల్లీ సిఎంను ఆరు నెలలపాటు జైలులో పెట్టారు. మనీష్ సిసోడియాను రెండేళ్లకు పైగానే జైల్లో పెట్టారు. కవితను కూడా ఓ ఆరు నెలలు జైల్లో పెట్టారు. ఇప్పుడు వారి జీవితాల్లో ఓ మచ్చ పడింది. వారు నిర్దోషుల ని కోర్టు తెలిపింది. అయితే ఈ జైలు జీవితం అనుభవించడానికి కారణమైన సిబిఐ ఏం సమాధానం చెబుతుందన్నదే ప్రశ్న. పలుకుబడి ఉన్నవారే ఇంతటి నరకానికి గురయితే ఇక, సామాన్యుల గతేం కాను. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను లిక్కర్ వ్యవహారంలో ఈడీ అధికారులు అరెస్టు వెనక.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తలపెట్టిన రాజకీయ యాగం ఉందని ఆనాడు నమ్మని వారికి ఇప్పుడు నిజమని తోస్తున్నది. ఈ ప్రశ్నకు అప్పుడే సమాధానం లభించినా ఎవ్వరూ నమ్మలేదు. లిక్కర్ పాలసీ కేసు నిజమే కాబోలని అంతా అనుకున్నారు. ఎందుకంటే కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కాషాయ ఏలుబడి లోకి రావాలన్న మోదీ సంకల్పంలో భాగంగానే కేసులని అర్థం అవుతోంది.

యూపీఏ హయాంలో అన్నా హజారేతో కలసి అవినీతి వ్యతిరేక ఉద్యమం నడిపిన కేజ్రీవాల్... ఇప్పుడు అవే అవినీతి ఆరోపణలపై అరెస్టవడం మోదీ మహిమ కాక మరోటి కాదని ఇప్పుడు తేలిపోయింది. అవినీతి వ్యతిరేక ఉద్యమంలో చేరక ముందు ఇండియన్ రెవెన్యూ సర్వీస్ అధికారిగా పనిచేసిన కేజ్రీవాల్‌పై సర్వీస్‌లో ఉన్నప్పుడు అవినీతి ఆరోపణలు లేవు. ఢిల్లీ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత కూడా ఆయనపై అవినీతి ఆరోపణలు లేవు. ఆమ్ ఆద్మీ పార్టీని ఇతర రాష్ట్రాలకు విస్తరించాలనుకున్న తర్వాతే ఆయనకు కష్టాలు మొదలయ్యాయి. తనకు పోటీగా వస్తున్నాడని మోడీ భావించినందు వల్లనే పక్కాగా ఈ కేసు పథక రచన సాగిందని, తాజాగా ఢిల్లీ రౌస్ అవెన్యూ ఇచ్చిన తీర్పుతో స్పష్టం అయ్యింది. ఈలోగా కేజ్రీవాల్‌కు జరగాల్సిన డ్యామేజీ జరిగి పోయింది. మద్యం కేసులో స్వీకరించిన ముడుపుల మొత్తాన్ని పంజాబ్, గోవా ఎన్నికల్లో ఖర్చు చేశారని ఈడీ ఆరోపించడంతో పాటు, పెట్టిన కేసులతో ఆయన పరువు గంగలో కలిసింది.ఎంతగా అంటే ఆప్ పార్టీ అతః పాతాళానికి తొక్కివేయబడింది. మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ కుమార్తె కవితను కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు లిక్కర్ కేసులో అరెస్టు చేసి ఢిల్లీ జైల్లో పడేశారు. ఆరు నెలలు ఆమె జైలులో మగ్గాల్లి వచ్చింది. కవిత అరెస్టు న్యాయమా? అన్యాయమా? అన్న చర్చ జరిగింది. ఈ దుస్థితికి ఆమె స్వయంకృతాపరాధమే కారణం అన్న ప్రచారం జరిగింది. పదేళ్లపాటు తండ్రి కేసీఆర్ ఏకఛత్రాధిపత్యంగా పాలించిన తెలంగాణ రాష్ట్రంలో సంపాదించుకున్నది చాలక లిక్కర్ కేసులో తలదూర్చారని అంతా న ఇందించారు. సంపాదించింది చాలదు అన్నట్టుగా ఆమె ఏకంగా దేశ రాజధాని ఢిల్లీలో లిక్కర్ వ్యాపారంలోకి కూడా చొరబడ్డారని దుమ్మెత్తి పోశారు. ఈడీ అధికారులు ఉద్దేశపూర్వకంగానే కవితకు న్యాయస్థానాలలో ఉపశమనం లభించకుండా అరెస్టు చేశారని కేటీఆర్ ఆరోపించారు. జార్ఖండ్ రాష్ట్రం కోసం పోరాడిన దివంగత శిబూ సోరెన్ జైలుకు కూడా వెళ్లారు. ముఖ్యమంత్రిగా ఉన్న ఆయన కుమారుడు హేమంత్ సోరెన్‌ను కూడా జైల్లో పెట్టారు.ఇదంతా కూడా మోడీ రాజకీయ చతురతలో భాగమా అన్న అనుమానాలు ఉన్నాయి. జైలుకు వెళ్లిన వారు ఔననే అంటున్నారు. రాజకీయంగా బిజెపిని విస్తరించే క్రమంలో తమకు అడ్డుగా ఉన్న పార్టీలను అడుసు లోకి తొక్కే ప్రయత్నంలో భాగంగానే కేసులతో జైల్లో కుక్కారన్నది ప్రధాన ఆరోపణ. ఈ ఆరోపణలు ఎలా ఉన్నా కోర్టు తీర్పుతో ఇప్పుడది నిజమని స్పష్టం అవుతోంది. అదను చూసి దెబ్బ కొట్టాలని అంటారు. కేజ్రీవాల్, కవితలను అరెస్టు చేయడం, కేసు వీగి పోవడం వంటి పరిణామాలు ఇప్పుడు బీజేపీకి కీడు చేసే అవకాశం ఎక్కువగా ఉంది. వీరంతా మరోమారు మోడీ లక్ష్యంగా గళం విప్పే అవకాశం ఉంది. ప్రధాని మోదీని ఎదిరించడం అసాధ్యమని గుర్తించిన నాయకులు తమ సొంత రాష్ట్రాలకే పరిమితమై సామంత రాజులుగా మారిపోయి అధికారంలో కొనసాగగలుగుతున్నారు. అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీకే పరిమితమై ఉన్నట్టయితే గోవా, పంజాబ్ ఎన్నికల్లో తలదూర్చేవారు కాదు. ఢిల్లీని ఏలుకోమని ప్రజలు ఆశీర్వదిస్తే దేశాన్ని ఏలుతానని బయలుదేరి ఇప్పుడు జైలుకు వెళ్లాల్సిన పరిస్థితి కొనితెచ్చుకున్నారు. ఆమ్ ఆద్మీ పోటీ చేయడం వల్ల అనేక రాష్ట్రాలలో ప్రతిపక్ష ఓట్లు చీలి బీజేపీ లాభపడింది. ప్రతిపక్షాల అనైక్యత, రాజకీయ దురాశ వల్ల రాజకీయంగా పెనుభూతంగా మారిన ప్రధాని మోదీని ఇప్పుడు అందరూ ఏకమైనా కదిలించలేని పరిస్థితి. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నిన్నటి వరకు ఎగిరెగిరి పడ్డారు. ప్రధానమంత్రి అయిపోదామని కలలుగన్నారు. స్వరాష్ట్రంలో ఎదురు ఉండకూడదని వామపక్ష కూటమిని దెబ్బతీశారు. అధికారంలో కొనసాగాలంటే నరేంద్ర మోదీ రాజకీయ చదరంగంలో ఆరితేరాలి.

# అభియోగాలే తప్ప ఆధారాలేవీ!

- కేజ్రీవాల్, సిసోడియా, కవితకు ఊరట
- సీబీఐపై రౌస్ అవెన్యూ కోర్టు తీవ్ర ఆగ్రహ
- నిందితులందరికీ క్లీన్ చిట్
- దర్యాప్తు అధికారులపైనే విచారణ జరగాలని వ్యాఖ్య
- హైకోర్టుకు వెళ్తామన్న సీబీఐ




**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** ఢిల్లీ మద్యం లిక్కర్ పాలసీ కేసును ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కొట్టి వేసింది. ఈ కేసులో దోషులుగా ఉన్న దిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ , మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, మాజీ ఎంపీ కవిత కు భారీ ఊరట లభించింది. మద్యం పాలసీ కేసుపై తాజాగా విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు నిందితులందరి పైన నమోదు చేసిన కేసులు కొట్టివేసింది. వారందరి పేర్లను డిశ్చార్జ్ చేసినట్లు వెల్లడించింది. సరైన ఆధారాలు లేకుండానే వీరి పేర్లు కేసులో చేర్చారని సీబీఐపై ఆగ్రహం వ్యక్తంచేసింది. ఈ కేసులో పూర్తిగా లోపభూయిష్టమైన దర్యాప్తు జరిగిందని కోర్టు సీబీఐపై మండిపడింది. ఈ విషయంలో సీబీఐ అధికారుల పైనే దర్యాప్తు జరగాలని కోర్టు పేర్కొంది. కవిత ఆడిటర్ బుచ్చిబాబు సహా అభియోగాలు మోపిన 23 మందికి ఈ కేసు నుంచి విముక్తి కల్పిస్తున్నట్లు తెలిపింది. వారిపై ఉన్న అభియోగాలను నిరూపించడంలో సీబీఐ విఫలమైందని వ్యాఖ్యానించింది. ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం ఊహాగానాల ఆధారంగా ఈ కేసులో కుట్ర జరిగిందని సీబీఐ అధికారులు ఆరోపించారని న్యాయస్థానం పేర్కొంది. కానీ దానిని నిరూపించడంలో విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎక్సైజ్ పాలసీపై ముగ్గురు న్యాయ నిపుణుల అభిప్రాయాలు తమ కేసుకు మద్దతు ఇస్తున్నాయని గతంలో సీబీఐ చేసిన ప్రకటనపై స్పష్టత ఇవ్వాలని అధికారులను ఆదేశించింది. ఈ కోర్టు తీర్పును సవాలుచేస్తూ సీబీఐ అధికారులు దిల్లీ హైకోర్టును ఆశ్రయించనున్నట్లు తెలుస్తోంది. దిల్లీ ప్రభుత్వం 2021 నవంబర్ 17న మద్యం పాలసీని తీసుకొచ్చింది. 2022 సెప్టెంబరు చివరికి దానిని వెనక్కి తీసుకుంది. ఈ మధ్యలో మద్యం విధానంలో పలు అవకతవకలు జరిగాయని.. ఆప్ నేతలు మనీలాండరింగ్‌కు పాల్పడ్డారంటూ ఆరోపణలు వచ్చాయి. ఎక్సైజ్ పాలసీని సవరించేటప్పుడు వీరు అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ, ఈడీలు ఆరోపించాయి. లైసెన్స్‌దారులకు అవసరమైన సాయం చేసి, ప్రతిఫలంగా కొంత మొత్తాన్ని పొందినట్లు దర్యాప్తు సంస్థలు చెప్పాయి. ఈ కుంభకోణంలో భాగంగా దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మాజీ ఉప ముఖ్యమంత్రి సిసోదియా, ఇతర ఆప్ నేతలు, మాజీ తెలంగాణ ఎంపీ కవితలను అధికారులు అరెస్టు చేశారు. అనంతరం వారు బెయిల్‌పై విడుదలయ్యారు.ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు భారీ ఊరట లభించింది. సీబీఐ కోర్టు ఈ కేసునుంచి కేజ్రీవాల్‌ను డిశ్చార్జ్ చేసింది. శుక్రవారం ఢిల్లీ మద్యం పాలసీ కేసుపై ది రౌస్ అవెన్యూ కోర్టు విచారణ జరిపింది. సీబీఐ వేసిన చార్జ్‌షీట్‌లో మెరిట్ లేదని కోర్టు పేర్కొంది. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌తో పాటు ఉప ముఖ్యమంత్రి సిసోడియాకు కూడా క్లీన్‌చిట్ ఇచ్చింది. కవితతో పాటు 23 మంది నిందితులు తప్పు చేసినట్టు సాక్ష్యాధారాలు లేవని కోర్టు స్పష్టం చేసింది. అందరికీ క్లీన్ చిట్ ఇచ్చింది. అయితే, రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును సీబీఐ సవాల్ చేయనుంది.

## అమెరికా విద్యపై విముఖత

**45 శాతం తగ్గిన భారతీయుల విద్యార్థుల సంఖ్య**

**- ట్రంప్ వీసా పాలసీల గందరగోళం..**

**భారతీయ మేనేజ్‌మెంట్ కోర్సులకు పెరిగిన డిమాండ్**




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27: ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లాలనే భారతీయ విద్యార్థుల కల క్రమంగా మసకబారుతోంది. అమెరికా వీసా విధానాల్లో అనిశ్చితి, అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠిన నిర్ణయాల కారణంగా అక్కడి యూనివర్సిటీల్లో చేరుతున్న భారతీయ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోయింది. గ్రాడ్యుయేషన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ కౌన్సిల్ తాజాగా విడుదల చేసిన శ్వేతపత్రం ప్రకారం, ఆగస్ట్ 2025 నాటికి అమెరికాలో భారతీయ విద్యార్థుల ప్రవేశాలు ఏకంగా 45 శాతం తగ్గాయి. ఇదే సమయంలో భారతీయ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్స్‌కు అంతర్జాతీయంగా డిమాండ్ 25 శాతం పెరగడం విశేషం. ఉత్తర అమెరికా స్టడీ కారిడార్‌లో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, వలస చట్టాల కఠినతరం విద్యార్థులను భయాందోళనకు గురిచేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేనంతగా స్టూడెంట్ వీసాల తిరస్కరణ పెరగడం, చదువు పూర్తయ్యాక ఉద్యోగ అవకాశాల (హెచ్‌ఉ 1బీ)పై స్పష్టత లేకపోవడంతో విద్యార్థులు ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. కెనడా, బ్రిటన్, అమెరికా దేశాల్లో వీసా రూల్స్ కఠినతరం కావడంతో ఇప్పుడు ఆసియా మరియు ఐరోపా దేశాలు విద్యార్థులకు ఆకర్షణీయమైన గమ్యస్థానాలుగా మారుతున్నాయి. కేవలం వీసా సమస్యలే కాకుండా, అమెరికాలో విద్య ఇప్పుడు సామాన్య మధ్యతరగతి విద్యార్థులకు భారంగా మారింది. గత ఐదేళ్లతో పోలిస్తే చదువుల ఖర్చు రెట్టింపైంది. ప్రస్తుతం ప్రైవేట్ వర్సిటీల్లో చదువుకోవాలంటే సుమారు రూ. 40 లక్షల వరకు ఖర్చవుతుండగా, గతంలో ఇది రూ. 25 లక్షలుగా ఉండేది. ప్రభుత్వ వర్సిటీల్లో కూడా ఫీజులు రూ. 17 లక్షలకు చేరాయి. వీటికి తోడు నివాస ఖర్చులు ఏటా రూ. 12 లక్షలు, హెల్త్ ఇన్సూరెన్స్ కోసం రూ. 1.5 లక్షలు అదనంగా భరించాల్సి వస్తోంది. పార్ట్ టైమ్ ఉద్యోగాలపై ఆంక్షలు ఉండటంతో భారతీయ విద్యార్థులు అమెరికా ఆశలను వదులుకుని స్వదేశీ విద్యా వ్యవస్థపై లేదా ఖర్చు తక్కువగా ఉండే ఇతర దేశాలపై మొగ్గు చూపుతున్నారు.

# నేను నిజాయితీపరుడిని.. నిజమే గెలిచింది

**మోదీ, అమిత్ షాల కుట్రకు బలయ్యా.. ● ఆరు నెలల జైలు జీవితంపై ఉద్వేగం**

**కన్నీరు పెట్టుకున్న అరవింద్ కేజ్రీవాల్**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 27:** ఢిల్లీ మద్యం విధానం కేసులో రౌస్ అవెన్యూ కోర్టు తనను నిర్దోషిగా ప్రకటిస్తూ డిశ్చార్జ్ చేసిన అనంతరం అరవింద్ కేజ్రీవాల్ మీడియా సమావేశంలో కన్నీటి పర్యంతమయ్యారు. "నేను నిజాయితీపరుడిని అని ఈరోజు కోర్టు నిరూపించింది. నా జీవితంలో నేను ఎన్నడూ తప్పు చేయలేదు, కేవలం ప్రజల కోసమే పనిచేశాను" అని చెబుతూ ఆయన భావోద్వేగానికి గురయ్యారు. తనపై మోపిన నిందలు, ఎదుర్కొన్న అవమానాలపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కేజ్రీవాల్ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా కలిసి ఆమ్ ఆద్మీ పార్టీని నాశనం చేసేందుకు కుట్ర పన్నారని ఆరోపించారు. దేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక సిట్టింగ్ ముఖ్యమంత్రిని అరెస్టు చేసి, ఆరు నెలల పాటు జైల్లో ఉంచడం రాజకీయ కక్ష సాధింపునకు పరాకాష్ట అని మండిపడ్డారు. మనీష్ సిసోడియా వంటి నేతలు రెండేళ్ల పాటు జైలులోనే గడపాల్సి వచ్చిందని గుర్తు చేస్తూ, టీవీ ఛానెళ్లలో తనను దొంగగా, అవినీతిపరుడిగా చిత్రీకరించి దుష్ప్రచారం చేశారని విలపించారు. రౌస్ అవెన్యూ కోర్టు తీర్పును ప్రస్తావిస్తూ.. సీబీఐ సరైన ఆధారాలు లేకుండా, కేవలం కల్పిత కథనాలతో కేసులో ఇరికించిందని న్యాయస్థానమే స్పష్టం చేసిందని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ కేసులో కల్వకుంట్ల కవిత సహా 23 మందికి క్లీన్ చిట్ లభించడంపై స్పందిస్తూ, ఇప్పటికైనా కేంద్రం ప్రతిపక్షాలపై వేధింపులు ఆపి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని హితవు పలికారు. సత్యమే గెలుస్తుందని ఈ తీర్పు మరోసారి రుజువు చేసిందన్నారు.

# అఫ్గాన్-పాక్ మధ్య ముదిరిన ఘర్షణ

- పాకిస్థాన్ 'బహిరంగ యుద్ధం' ప్రకటన
- వైమానిక దాడులతో దద్దరిల్లిన కాబుల్, కాందహార్
- రంగంలోకి 'సూసైడ్ స్క్వాడ్'


**ఇస్లామాబాద్/కాబుల్, ఫిబ్రవరి 27:** పాకిస్థాన్ – అఫ్గానిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు పరాకాష్టకు చేరుకున్నాయి. అఫ్గానిస్థాన్‌తో తాము 'బహిరంగ యుద్ధం' ప్రారంభించామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ప్రకటించారు. "మా సహనం నశించింది.. ఇకపై మాకు, మీకు మధ్య యుద్ధమే" అంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా హెచ్చరించారు. గురువారం రాత్రి అఫ్గాన్ దళాలు జరిపిన కాల్పులకు ప్రతిగా పాక్ వైమానిక దళం 'ఆపరేషన్ గజబ్ లిల్ హక్' పేరుతో అఫ్గాన్ భూభాగంపై విరుచుకు పడింది. పాక్ యుద్ధ విమానాలు అఫ్గాన్ రాజధాని కాబుల్‌తో పాటు కాందహార్, పక్తియా ప్రావిన్సుల్లోని పలు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని దాడులు జరిపాయి. కాబుల్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయని, ప్రజలు భయాందోళనలతో వణికిపోయారని స్థానికులు తెలిపారు. ఈ దాడుల్లో తమ వైపు 133 మంది అఫ్గాన్ సైనికులు మరణించారని, 27 పోస్టులను ధ్వంసం చేశామని పాక్ పేర్కొంది. అయితే, అఫ్గాన్ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ మాత్రం ప్రాణనష్టం జరగలేదని చెబుతూనే, పాక్ సైనికులను తమ వారు బందీలుగా పట్టుకున్నారని వెల్లడించారు.

### అఫ్గాన్ 'సూసైడ్ స్క్వాడ్' హెచ్చరిక

పాక్ దాడులకు ప్రతిగా అఫ్గాన్ మీడియా ఒక ఆందోళనకరమైన చిత్రాన్ని విడుదల చేసింది. 'సూసైడ్ స్క్వాడ్' పేరుతో ఉన్న ఈ ఫోటోలో ఆత్మాహుతి బాంబర్లు పేలుడు పదార్థాలు అమర్చిన దుస్తులు, కారు బాంబులతో సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తోంది. పాక్‌లోని ప్రధాన నగరాలను లక్ష్యంగా చేసుకుని ఈ బెటాలియన్ దాడికి సిద్ధమవుతోందని అఫ్గాన్ భద్రతా వర్గాలు హెచ్చరించాయి. ఇప్పటికే తమ దాడుల్లో 55 మంది పాక్ సైనికులు చనిపోయారని అఫ్గాన్ ప్రకటించగా, పాక్ దానిని తోసిపుచ్చింది.

### మధ్యవర్తిత్వానికి ఇరాన్ సిద్ధం

ఇరు దేశాల మధ్య యుద్ధ మేఘాలు కమ్ముకున్న నేపథ్యంలో పొరుగు దేశమైన ఇరాన్ శాంతి చర్చల కోసం ముందుకు వచ్చింది. రెండు దేశాల మధ్య సయోధ్య కుదిర్చేందుకు తాము మధ్యవర్తిత్వం వహించడానికి సిద్ధంగా ఉన్నామని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి ప్రకటించారు. రంజాన్ మాసం దృష్ట్యా ఇరు దేశాలు సంయమనం పాటించాలని కోరారు. రష్యా, చైనా దేశాలు కూడా ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తూ కాల్పుల విరమణకు పిలుపునిచ్చాయి.



నేటి సాక్షి
TGTEL/25/A1737

కరీంనగర్ | శనివారం 28 ఫిబ్రవరి 2026

# మోకిలా వద్ద తప్పిన ప్రాణాపాయం

## అదుపుతప్పి నారాయణ స్కూల్ బస్సు బోల్తా

**నేటి సాక్షి,శంకర్‌పల్లి :** రంగారెడ్డి జిల్లా శంకర్ పల్లి మండల పరిధిలోని మోకిలా గ్రామ సమీపంలో సోమవారం ఉదయం ఒక భీభత్సం చోటుచేసుకుంది. నారాయణ విద్యాసంస్థకు చెందిన స్కూల్ బస్సు లక్ష్మీనరసింహస్వామి దేవాలయం వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాద సమయంలో బస్సులో ఉన్న విద్యార్థులు తృటిలో ప్రాణాపాయం నుండి తప్పించుకున్నారు. స్థానికులు మరియు ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. ప్రతిరోజూ బస్సు నడిపే రెగ్యులర్ డ్రైవర్‌కు బదులుగా, ఈరోజు అతని కుమారుడు వాహనాన్ని నడిపినట్లు తెలుస్తోంది. డ్రైవింగ్‌లో సరైన అనుభవం లేకపోవడం మరియు అతివేగం కారణంగానే మలుపు వద్ద బస్సు అదుపుతప్పి పక్కకు ఒరిగిపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ అక్కడి నుండి పరారయ్యాడు. బస్సు బోల్తా పడటంతో లోపల ఉన్న విద్యార్థులు భయాందోళనకు గురై కేకలు వేశారు. వెంటనే స్పందించిన స్థానికులు బస్సు అద్దాలు పగులగొట్టి విద్యార్థులను బయటకు తీశారు. గాయపడిన విద్యార్థులను వెంటనే సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించారు. ప్రస్తుతం విద్యార్థులందరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. సమాచారం అందుకున్న శంకర్‌పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బస్సును పరిశీలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, డ్రైవర్‌కు ఉన్న లైసెన్స్ వివరాలను సేకరిస్తున్నారు. ఈ ఘటనతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తమ పిల్లల ప్రాణాలు ప్రమాదంలో పడ్డాయని వారు మండిపడుతున్నారు. అనుభవజ్ఞులైన వ్యక్తులకు స్కూల్ బస్సులను అప్పగించడంపై విద్యాశాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# శిథిలావస్థకు చేరిన హెల్త్ ఆరోగ్య ఉపకేంద్రం..



- సబ్ సెంటర్ పడగొట్టి.. కొత్త ఆరోగ్య కేంద్రం ను కట్టాలి.

మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు .. కలబండి. అంకన్న, కే. సోషల్ వర్కర్. నాగరాజు

- ఇరుకు అద్దె భవనాలలో కొనసాగుతున్న ఆరోగ్య ఉప కేంద్రం.సోషల్ వర్కర్ కలబండి. నాగరాజు

**నేటి సాక్షి, పాములపాడు:** పాములపాడులోని, కేజీ రోడ్డు పక్కన ఉన్న పురాతనమైన ఆరోగ్య ఉప కేంద్రం శిధిలావస్థకు చేరి ఉన్నదని, దాన్ని పడగొట్టి, క్రింద హెల్త్ సబ్ సెంటర్ ను, పైన 108 అంబులెన్స్ కార్యాలయాన్ని ప్రభుత్వం వెంటనే కట్టాలని మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న కోరారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కే. అంకన్న మాట్లాడుతూ పాములపాడు మండలంలో అన్ని గ్రామాలలో అన్ని హెల్త్ సెంటర్లు కొత్త గా, చాలా చక్కగా, నిర్మించారు. కానీ పాములపాడు హెడ్ క్వాటర్ లో శిదిలావస్థకు చేరింది. దీనిని గత ప్రభుత్వంలో పాములపాడులో పడిపోవడానికి రెడీగా ఉన్న ఈ హెల్త్ సబ్ సెంటర్ ను కూలగొట్టి, క్రింద ఆరోగ్య ఉప కేంద్రాన్ని, పైన 108 అంబులెన్స్ కార్యాలయాన్ని నిర్మించాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎన్నిసార్లు వినతి పత్రాలు ఇచ్చిన కూడా, ఇంతవరకు దీనికి మోక్షం రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం పడిందంటే ఈ సబ్ సెంటర్లో మోకాళ్లలోతు నీళ్లు నిలబడతాయని, పాములు, తేళ్ళు, పలు రకాల విష సర్పాలు లోపలికి వచ్చి ప్రమాదకరంగా మారిందన్నారు. దీనిని ఏ నాయకుడు, ఏ అధికారి పట్టించుకోకపోవడంతో, చిన్న ఇరుకైన అద్దె భవనంలో హెల్త్ సబ్ సెంటర్ ను వైద్య సిబ్బంది నిర్వహిస్తున్నారని అన్నారు.అద్దె భవనంలో చాలా ఇబ్బంది పడుతున్నారు అని, సూపెర్వైజర్, మద్దయ్య, విజిట్ కి వెళ్ళినప్పుడు అక్కడి పరిస్థితి చాలా దారుణంగా ఉంది అని, అద్దె భవనం లో ఉంటున్నారు,చెప్పారు.మరియు ఏఎన్ఎమ్,లు మాధవి, అనురాధ వాళ్ళు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటుంన్నారు అని చెప్పారు. అంతే కాకుండా పాములపాడు ఆశా కార్యకర్తలు దేవమని, వెంగమ్మ, మొగిలేశ్వరి, కుమారి వీళ్ళు కూడా ప్రతి రోజు చాలా సబ్ సెంటర్ లేక అద్దె భవనంలో చాలా ఇబ్బంది కరంగా ఉంటున్నాము అని. మాల మహా నాడు అంకన్న గారికి తమ గోడు వినిపించారు.మరియు సోషల్ వర్కర్ కలబండి నాగరాజు మాట్లాడుతూ. పాములపాడు ఈ ఆరోగ్య ఉపకేంద్రం దగ్గరకు వచ్చే గర్భవతులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు వ్యాక్సిన్లు, ఇంజక్షన్లు, టీకాలు వేయించుకోవడానికి వచ్చే వారు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. 108 సిబ్బంది కూడా వారికి రెస్ట్ రూమ్ లేక, ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో టేబుల్ల, కుర్చీల, మెటీరియల్ల సందులలో దోమల మధ్య నిద్ర పోవలసిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యే గిత్త.జయ సూర్య, నంద్యాల పార్లమెంట్ టిడిపి ఇంచార్జ్ మాంద్ర. శివానందరెడ్డి, జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని పాములపాడులో ఆరోగ్య ఉప కేంద్రాన్ని, దానిపైన 108 అంబులెన్స్ కార్యాలయాన్ని వెంటనే నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, ఏఎన్ఎంలు, మాధవి, అనురాధ తదితరులు పాల్గొన్నారు. పాములపాడు మండల వైద్య అధికారిని. వివరణ కోరగా.నాగలక్ష్మి .. మాట్లాడుతూ ..... పాములపాడు మండల కేంద్రంలోని ఆరోగ్య ఉపకేంద్రం శిథిలావస్థలో ఉన్నది.. పడిపోవడానికి సిద్ధంగా ఉన్నది చాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాము. అనే విషయం గత ప్రభుత్వం నుండి కూడా మా పై ఉన్నతాధికారులకు మరియు ప్రజా ప్రతినిధులకు కూడా ఈ సమస్య గురించి తెలపడం జరిగింది. ఇప్పుడు ఈ కూటమి ప్రభుత్వం అయిన చొరవ తీసుకొని పడగొట్టి కొత్త ఆరోగ్య ఉపకేంద్రం కట్టించాలని మనవి చేస్తున్నాము అని చెప్పడం జరిగింది.

# అభివృద్ధిపై రాజకీయ కక్ష సాధింపు

- కాంగ్రెస్ పై మండిపడ్డ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి
- గజ్వేల్ అభివృద్ధిని ఆపేసిన కాంగ్రెస్ పాలన - పూర్తి చేయని పనులు వెంటనే పూర్తి చేయాలి: ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి ఫైర్

**నేటి సాక్షి గజ్వేల్ :** ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గజ్వేల్ నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఉద్దేశపూర్వకంగా నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని తన ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ–గజ్వేల్ నియోజకవర్గంలో ప్రారంభించిన అనేక అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయని తెలిపారు. రహదారులు, డ్రైనేజీలు, మౌలిక వసతుల నిర్మాణాలు పూర్తి కాక ప్రజలు తీవ్ర అసౌకర్యాలు ఎదుర్కొంటున్నారని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు పాలనలో గజ్వేల్ నియోజకవర్గం వేల కోట్ల రూపాయల అభివృద్ధిని చూసిందని గుర్తుచేశారు. సాగునీటి ప్రాజెక్టులు, రహదారుల విస్తరణ, పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి వంటి రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించామని చెప్పారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, కొత్త పనులు చేపట్టడమే కాకుండా ఇప్పటికే ప్రారంభించిన ప్రాజెక్టులను కూడా పూర్తి చేయడంలో నిర్లక్ష్యం చూపుతోందని విమర్శించారు. గజ్వేల్ ప్రజలపై రాజకీయ వైరం చూపుతూ అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదని ఆయన అన్నారు. అసంపూర్తిగా ఉన్న అన్ని నిర్మాణ పనులను తక్షణమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రజల తరఫున పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరిస్తూ – గజ్వేల్ అభివృద్ధిని ఆపే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని స్పష్టం చేశారు.



# ప్రభుత్వ టీచర్ల ప్రతిష్టకు భంగంకలిగిస్తున్న విద్యా కమిషన్





**నేటి సాక్షి తొగుట.. (వడ్డే నరసింహులు):** తెలంగాణ విద్యా కమిషన్ ముఖ్యమంత్రికి సమర్పించిన నివేదికలో కమిషన్ పరిధిలో లేని ఉపాధ్యాయుల జీతాల గురించి ప్రస్తావించడం విడ్డూరమని,ఉపాధ్యాయులకు రెండు మూడు సంవత్సరాలుగా పెండింగ్ బిల్లులు రావడంలేదని ఉపాధ్యాయుల సమస్యలు ప్రస్తావించని కమిషన్ జీతాల గురించి ప్రస్తావించడం ఉపాధ్యాయుల ప్రతిష్టకు భంగం కలిగించడమేనని పిఆర్ టియు తొగుట మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రామచంద్ర రెడ్డి సురేందర్ రెడ్డిలి గార్లు అన్నారు. పేదవాళ్లను ప్రభుత్వ విద్యకు దూరం చేసే చాలా విషయాలు ఈ నివేదిక లో ఉన్నాయని సమగ్రమైన అధ్యయనం చేయకుండా మండలానికి రెండు మూడు స్కూళ్లు మాత్రమే ఉండాలని పేర్కొనడం శోచనీయమని అన్నారు. ఉపాధ్యాయుల అర్హతల విషయంలో కూడా సాంకేతిక సంస్థలు ఇచ్చిన సూచనలను పరిగణలోకి తీసుకోకుండా ఇష్టం వచ్చిన సిఫారసులు చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను కుదించడం పేదవాళ్లకు ప్రభుత్వ విద్యను దూరం చేయడమేనని, వందల మంది విద్యార్థులను ఒకే చోట ఉంచడం వలన మధ్యాహ్న భోజనం మరియు టాయిలెట్స్ వినియోగంలో పారిశుధ్య సమస్యలు, విద్యార్థులపై ఏకాగ్రత ఉంచడం మొదలగు సమస్యలు ఏర్పడతాయని వారు ఆక్షేపించడం జరిగినది ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసి విద్యా కమిషన్ సిఫారసులను పునః సమీక్షించాలని పిఆర్టియు తొగుట మండల శాఖ పక్షాన పుల్లగుర్ల రామచంద్రారెడ్డి బత్తుల సురేందర్ రెడ్డిలి డిమాండ్ చేశారు.

# ఏప్రిల్ లో ఉపాధ్యాయ బదిలీలు

### టీచర్ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి



**నేటి సాక్షి (కరీంనగర్) :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ బదిలీలు ఏప్రిల్ లో నిర్వహిస్తారని రేషనలైజేషన్ తో కూడిన బదిలీలు ఉంటాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. కరీంనగర్ పట్టణంలో ఫిబ్రవరి నెలలో ఉద్యోగ విరమణ పొందుతున్న ఉపాధ్యాయులకు పి.ఆర్.టి.యు టి.ఎస్ కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు అందజేసే డిజిటల్ హెల్త్ కార్డులపై ఎలాంటి అపోహలు ఉండకూడదని ఖచ్చితంగా ఇవి ఉద్యోగులకు మేలు చేస్తాయని తెలియజేశారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష టెట్ లేకుండానే పదోన్నతులు ఇవ్వాలని, తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించడంతోపాటు ప్రతి పాఠశాలలో ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ ప్రవేశపెట్టడం ద్వారా విద్యా వ్యవస్థను బలోపేతం చేయొచ్చని ప్రభుత్వానికి సూచించారు. ఫిబ్రవరి నెలలో ఉద్యోగ విరమణ చేస్తున్న వేముల మహిపాల్ రెడ్డి, కర్యాద మల్లారెడ్డి లను ఎమ్మెల్సీ సన్మానించారుఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అయిలేని కరుణాకర్ రెడ్డి, మర్రి జైపాల్ రెడ్డి సంఘ బాధ్యులు తిరుపతి రెడ్డి, శ్రీకాంత్ రావు, జమీల్, లక్ష్మీనారాయణ, రామ్మోహన్ రావు, శ్రీనివాస్ వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, జిల్లా, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు

# అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య



**నేటి సాక్షి వేడిపల్లి:** భీమారం మండలం కమ్మరిపేట గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కోటగిరి రాజేందర్ (60) అనే వృద్ధుడు మనస్తాపంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కమ్మరిపేట గ్రామానికి చెందిన గౌడ కులస్థుడైన కోటగిరి రాజేందర్ (తండ్రి: నర్సయ్య), గత 15 ఏళ్లుగా తీవ్రమైన నడుము నొప్పి, కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు పలుమార్లు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స చేయించినప్పటికీ ఫలితం లేకపోయింది. మరోవైపు ఆర్థిక ఇబ్బందుల కారణంగా మళ్లీ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఏర్పడింది. నిరంతర శారీరక వేదన, పేదరికం కారణంగా జీవితంపై విరక్తి చెందిన రాజేందర్ మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలోనే తేదీ 26.02.2026 రాత్రి 9 గంటల నుండి 27.02.2026 ఉదయం 6 గంటల మధ్య కాలంలో, తన గదిలోని సీలింగ్ ఫ్యాన్‌కు పాలీస్టర్ ధోవతితో ఉరివేసుకుని ప్రాణాలు విడిచాడు. ఉదయం గమనించిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి భార్య కోటగిరి భారతం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడిపల్లి ఎస్సై మాడ శ్రీధర్ రెడ్డి కేసు నమోదు చేశారు. ఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

# జెడ్పిహెచ్ఎస్ కట్లకుంటలో సాంఘిక శాస్త్ర మేళా



**నేటి సాక్షి,మేడిపల్లి:** మేడిపల్లి మండలం కట్లకుంట గ్రామం జడ్పీహెచ్ఎస్ యందు సాంఘిక శాస్త్ర మేళాను ప్రధానోపాధ్యాయులు హనుమాన్ సాగర్, ఆధ్వర్యంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు అనుమల్ల వైకుంఠం, పర్యవేక్షణలో విద్యార్థినీ విద్యార్థులు 34 ప్రదర్శనలను ప్రదర్శించడం జరిగినది. ఈ యొక్క మేళా ఉద్దేశం భూమి ఏ విధంగా గుండ్రంగా ఉంటుంది దానికి గల కారణాలు, సమాజంలో పౌరుల యొక్క విధులు ఏంటి హక్కులు ఏమిటో వాటి గురించి చూపిన ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఓటు హక్కు ద్వారా ప్రజాప్రతినిధులను ఎన్నుకునే విధానం గురించి ప్రదర్శన బాగుంది. అలాగే వివిధ దేశాలకు సంబంధించిన కరెన్సీ నోట్లు కాయిన్స్ ప్రదర్శించడం జరిగింది. ఒక బండికి కావలసిన పత్రాలు అన్ని ఏ విధంగా ఉండాలో చూపించిన విధానం ఆకట్టుకుంది. సాంఘిక శాస్త్రం గురించి విద్యార్థులకుతెలియడంలోకనుమరుగవుతున్న ఈ రోజులలో వరుసగా సాంఘికశాస్త్రఉపాధ్యాయుడు వైకుంఠం సార్4వ సారి కూడా ఈ మేళా ద్వారా విద్యార్థులకు తెలియజేసి వారిలో నైతిక విలువల గురించి, చరిత్ర గురించి అద్భుతంగా తెలియజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో సిఆర్పి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు శ్రీధర్, రాజయ్య, రమాదేవి, సంతోష్, గోపికృష్ణ, రవీందర్, ఇమామ్,తదితరులు పాల్గొన్నారు.

# చెరువు పరిశీలించిన సర్వే అధికారులు



**నేటి సాక్షి నారాయణపేట (ఇమామ్ సాబ్ ):** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలోని కనకల్ చెరువును మరికల్ ఆర్ ఐ సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నాడు సర్వే అధికారులతో సర్వే చేయించారు. కనకాల చెరువు మొత్తంను సర్వే చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సర్వే కార్యక్రమంలో మరికల్ మండల సర్వేధికారి కృష్ణయ్య, ఆంజనేయులు, రమేష్ రవి, బలరాం తదితరులు పాల్గొన్నారు.

# చెన్నూరు ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

## మంత్రి వివేక్ వెంకటస్వామి



**నేటి సాక్షి ,మంచిర్యాల జిల్లా :** చెన్నూర్‌లో వివేక్ వెంకటస్వామి మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దింటి పద్మ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ మంత్రి మాట్లాడుతూ చెన్నూరు ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను గెలిపించి మున్సిపాలిటీలో బాధ్యతలు అప్పగించినందుకు ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ కౌన్సిలర్లు ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించే దిశగా పని చేయాలని సూచించారు. చెన్నూరు మున్సిపాలిటీలో సుమారు రూ.50 కోట్ల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. అనేక వార్డుల్లో బోర్‌వెల్స్, సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అమృత్ 2.0 పథకం ద్వారా ఇంటింటికి తాగునీరు అందజేస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరిట నిధులను దుర్వినియోగం చేసిందని విమర్శించిన మంత్రి, చెన్నూరు పట్టణ ప్రజలకు గోదావరి నుంచి శుద్ధజలాల పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. త్వరలో పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు కూడా చేపడతామని వెల్లడించారు అనంతరం పట్టణంలోని కుల సంఘాల భవనాల నిర్మాణానికి ఇప్పటికే నిధులు కేటాయించినట్లు తెలిపారు. మరో ఆరు నెలల్లో గోదావరి ఇసుకను అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. మారెమ్మవాడలో రహదారి సమస్యను పరిష్కరించామని గుర్తు చేస్తూమున్సిపాలిటీలో 100 కొత్త ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల సమస్యలపై కేబినెట్‌లో చర్చలు జరిపినట్లు పేర్కొన్నారు. దేవులవాడ, బబ్బేరు, చెలుక గ్రామాల రైతులకు సుమారు రూ.18 కోట్ల పరిహారం మంజూరు చేసి పంపిణీ చేసినట్లు వివరించారు. మే నెలలో 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించనున్నట్లు తెలిపారు. కోటి ఇరవై లక్షల రూపాయలతో శ్మశానవాటిక అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు.చెన్నూరు మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుదామని మంత్రి వివేక్ వెంకటస్వామి పిలుపునిచ్చారు.

# అభియోగాలన్నీ కూల్చిన తీర్పు కవిత నిర్దోషి

- **అక్రమ కేసు కూలింది కవితకు విముక్తి! సీబీఐపై జాగృతి ఆగ్రహం**

**నేటి సాక్షి గజ్వేల్:** లిక్కర్ కేసులో జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవితకు కీలక ఉపశమనం లభించింది. ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టు ఆమెపై నమోదైన అభియోగాలను పూర్తిగా కొట్టివేస్తూ నిర్దోషిగా ప్రకటించింది. ఈ పరిణామంపై జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది కొట్టాల యాదగిరి ముదిరాజ్ స్పందిస్తూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కవితపై సీబీఐ నమోదు చేసిన కేసులో సరైన ఆధారాలు లేవని కోర్టు తేల్చడం ద్వారా నిజం వెలుగులోకి వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సుదీర్ఘ కాలంగా న్యాయపోరాటం చేసిన కవిత చివరకు "కడిగిన ముత్యంలా" బయటపడటం న్యాయం గెలిచిన ఉదాహరణగా నిలిచిందన్నారు. సీబీఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జితేందర్ సింగ్ ఇచ్చిన తీర్పు దేశ న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని మరింత బలపరిచిందని చెప్పారు. ఎలాంటి స్పష్టమైన సాక్ష్యాధారాలు లేకుండానే సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ కేసు నమోదు చేసి ఆమెను జైలుకు పంపడం తీవ్రంగా ఖండించాల్సిన విషయమన్నారు. ఒక రాజ్యాంగ సంస్థపై రాజకీయ వత్తిడులు పనిచేశాయనే అనుమానాలు ఈ తీర్పుతో బలపడుతున్నాయని విమర్శించారు. కవిత ఎదుర్కొన్న మానసిక వేదన, కుటుంబానికి కలిగిన ఇబ్బందులు చిన్నవి కావని, దీనికి బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా జాగృతి సంస్థ తన ఉద్యమాలను మరింత ఉత్సాహంతో ముందుకు తీసుకెళ్తుందని తెలిపారు. బీసీల హక్కుల సాధన, 42 శాతం రిజర్వేషన్ అమలు వంటి కీలక అంశాలపై రాజీలేని పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కోర్టు తీర్పుతో కవితపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా కొట్టివేయబడగా, ఇది




రాజకీయంగా కూడా ప్రభావం చూపే పరిణామంగా మారే అవకాశాలు ఉన్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# గజ్వేల్ 16వ వార్డులో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు వేగం



- **మురికి కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణానికి త్వరలో పనుల ప్రారంభం : కౌన్సిలర్ నాయిని సత్యలక్ష్మి యాదగిరి**

**నేటి సాక్షి గజ్వేల్ :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 16వ వార్డులో దీర్ఘకాలంగా నెలకొన్న మౌలిక సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని కౌన్సిలర్ నాయిని సత్యలక్ష్మి యాదగిరి తెలిపారు. శుక్రవారం వార్డులో అత్యవసర సమస్యగా గుర్తించిన పాత ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని మురికి కాలువల్లో నిల్వ నీటిని తొలగించే పనులను ఆమె ప్రారంభించారు. సంవత్సరాలుగా నిలిచిపోయిన మురికి నీటి కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దుర్వాసనతో పాటు దోమల సమస్య పెరిగి ఆరోగ్య సమస్యలకు దారి తీస్తోందని స్థానికులు తెలియజేశారు. ఈ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించేందుకు వెంటనే నీటిని తొలగించే చర్యలు చేపట్టామని తెలిపారు. వచ్చే మున్సిపల్ బడ్జెట్‌లో మురికి కాలువల నిర్మాణం, సీసీ రోడ్ల ఏర్పాటు కోసం అవసరమైన నిధులను ప్రతిపాదించనున్నట్లు ఆమె వెల్లడించారు. పాత ఎంపీడీవో కార్యాలయం నుండి పాత పోలీస్ స్టేషన్ వరకు మురికి కాలువలు సరిగా లేకపోవడం వల్ల వర్షాకాలంలో నీరు నిలిచిపోతుందని, రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని చెప్పారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు వివరించారు. అదేవిధంగా రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన వారికి ప్రభుత్వం నుంచి అందే పరిహారం, సహాయాన్ని త్వరితగతిన అందజేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులు పూర్తి కావడానికి ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వార్డులోని అంగన్వాడీ కేంద్రాన్ని కూడా ఆమె సందర్శించారు. అక్కడి సౌకర్యాలు, చిన్నారులకు అందుతున్న సేవలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కేంద్రంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకుని, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నేత నాగరాజు, పరుచూరి రాజు, జుబేర్, జలాల్, నర్సింలు, హరి, పండు తదితరులు పాల్గొన్నారు. వార్డులో అభివృద్ధి పనులు దశలవారీగా చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని కౌన్సిలర్ తెలిపారు.

# ధన్వాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద 'రచ్చ రచ్చ'

## నర్సరీ వివాదంతో రెండు గ్రామాల మధ్య పోరు!

**నేటి సాక్షి ధన్వాడ నారాయణపేట జిల్లా(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా ధన్వాడ మండల పరిధిలో మొక్కల నర్సరీ ఏర్పాటు వ్యవహారం రెండు గ్రామాల మధ్య తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. గోటూరు మరియు కొండ్రోనిపల్లి గ్రామస్తుల మధ్య నెలకొన్న ఈ వివాదం శుక్రవారం నాడు తహసీల్దార్ కార్యాలయం సాక్షిగా రసాభాసగా మారింది. గోటూరు – కొండ్రోనిపల్లి గ్రామాల శివారులో ఉన్న ప్రభుత్వ రైతు వేదిక పక్కన, ప్రభుత్వ స్థలంలో కొండ్రోనిపల్లి గ్రామ పరిధిలో మొక్కల నర్సరీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే, ఆ స్థలంలో నర్సరీని ఎలా ఏర్పాటు చేస్తారంటూ గోటూరు గ్రామ ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై చర్చించేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన తరుణంలో, తహసీల్దార్ ముందే ఇరు వర్గాల మధ్య వాగ్వివాదం మొదలైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకే నిబంధనల ప్రకారం నర్సరీని ఏర్పాటు చేశామని కొండ్రోనిపల్లి సర్పంచ్ సుధాకర్ స్పష్టం చేశారు. అయితే గోటూరు గ్రామస్తులు దీనిని వ్యతిరేకిస్తూ సర్పంచ్‌ను నిలదీశారు. దీంతో మాట మాట పెరిగి సుమారు అరగంట పాటు తహసీల్దార్ కార్యాలయం వివాదానికి వేదికైంది. పరిస్థితి చేయి దాటుతుండటంతో ధన్వాడ ఎస్సై ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాలకు నచ్చజెప్పి శాంతింపజేశారు.



రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన నర్సరీ కేంద్రాన్ని గోటూరు గ్రామస్తులు ధ్వంసం చేశారని కొండ్రోనిపల్లి సర్పంచ్ సుధాకర్ మరియు గ్రామస్తులు ఆరోపించారు. ఈ మేరకు ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో గోటూరు గ్రామస్తులపై ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. ప్రస్తుతం ఈ వివాదం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

# ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశిష్ట స్పందన



**నేటి సాక్షి-మేడిపల్లి:** లయన్స్ క్లబ్ జిర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త రేకుర్తి కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో భీమారం మండలం గోవిందారం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశిష్ట స్పందన వచ్చిందని లయన్స్ క్లబ్ అధ్యక్షులు అడ్డగట్ట శంకర్, జిర్డ్స్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ లైన్స్ క్లబ్ సభ్యులు అంగడి ఆనంద్ కుమార్ తెలిపారు, స్థానిక సర్పంచ్ పుల్లూరు ఉమాదేవి దేవయ్య, తో కలిసి ప్రారంభించడం జరిగింది ఈ వైద్య శిబిరంలో 85 మంది వైద్య పరీక్షలు నిర్వహించి 30 మందికి కంటి ఆపరేషన్ నిమిత్తం రేకుర్తి పంపించినట్లు నిర్వాహకులు తెలిపారు, ఈ కార్యక్రమంలో రేకుర్తి కంటి హాస్పిటల్ టెక్నీషియన్ సురేందర్ ,పసునూరు గ్రామ సర్పంచ్ గణేష్, లయన్స్ క్లబ్ కార్యదర్శి గుండేటి గంగాధర్, కోశాధికారి సామల శ్రీహరి, డి దేవదాస్, ఉప సర్పంచ్ స్వామి, మాజీ జెడ్పిటిసి సభ్యులు నెల్లుట్ల ప్రభాకర్, స్థానిక నాయకులు నరహరి, ఎన్ఆర్ఐ కిరణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ధన్వాడ సంత బజార్లో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి

**మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి.....**

**కూరగాయల వ్యాపారస్తుల అధికారులకు విన్నపం.....**



**నేటి సాక్షి, నారాయణపేట,(ఇమామ్ సాబ్ ):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల కేంద్రంలో ప్రతి ప్రతి గురువారం నిర్వహించే సంత బజార్లో మరుగుదొడ్లు లేక మహిళలు ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని కూరగాయల వ్యాపారులు వాపోతున్నారు. సంత బజారులో ఉదయం నుండి రాత్రి 8 గంటల వరకు నిర్వహించే సంత బజార్లో కనీస సౌకర్యాలు మరుగుదొడ్లు కూరగాయల వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారని వివిధ గ్రామాల నుండి వచ్చే వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధన్వాడ తై బజార్ గుత్తేదారు డెవరి రాజు గౌడ్ స్థానిక విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ధన్వాడ సంత బజార్లో మరుగుదొడ్లు ఏర్పాట్లు చేయాలన్నారు. తాగనీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని గ్రామపంచాయతీ అధికారులను గ్రామ సర్పంచ్ను ఆయన కోరారు, గతంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోలేదన్నారు. సంత బజారులో కొందరు టాక్సీ సక్రమంగా చెల్లించడం లేదన్నారు. ఇకనైనా గ్రామ సర్పంచ్ స్పందించి సంత బజార్లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

# ఎస్పీ డాక్టర్ వినీత్ గౌతమ్‌కు సన్మానం




**నేటి సాక్షి,నారాయణపేట,(ఇమామ్ సాబ్):** నారాయణపేట జిల్లా లో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సార్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ గౌతమ్ చేతుల మీదుగా స్వేరో క్యాలెండర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. స్వేరో జిల్లా అధ్యక్షులు నడ్డి రాజు.స్టేట్ కమిటీ ఈసీ బోడా వెంకటేష్, మాజీ మార్కెట్ చైర్మన్ బుల్లెట్ రాజు, స్వేరో కోర్ జిల్లా సతీష్ కుమార్ , స్వేరో మీడియా ఇన్చార్జి కొత్తపల్లి నరేష్.. స్వేరో నాయకులు తదితరులు పాల్గొన్నారు..

# హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించిన అధికారులు



**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామంలో ఈరోజు పారువెల్ల దుబ్బ పల్లె వెళ్లే మార్గమధ్యలో. లోలెవెల్ బ్రిడ్జి ఉన్నందున రాను పోను ప్రజలకు వర్షాకాలం రెండు మూడు నెలలు ఇబ్బంది పడుతున్న ప్రజలకు హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి. పి ఎం జి వై ఎస్. పథకంలో కిలోమీటర్ నర రోడ్డు మంజూరు చేయుటలో భాగంగా హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలించుటకు వచ్చిన ప్రత్యేక అధికారులు. ఎన్ఐటి ప్రొఫెసర్ మరియు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించడం జరిగినది . స్థానిక రైతులను అడిగి వరద ఎంతవరకు వస్తుంది అదేవిధంగా ఈ బ్రిడ్జ్ యొక్క అవసరం ఎంత ఉంది. క్షుణ్ణంగా అడిగి విషయాలు తెలుసుకున్నారు తప్పకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా దీర్ఘకాలికంగా ఉండేటువంటి నాణ్యమైన బ్రిడ్జిని. నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నుండి మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ రాజేష్ కుమార్ ఎస్‌టిఏ మెంబర్. పిఎంజి ఎస్ వై ప్రొఫెసర్. ఎస్ శంకర్ ఎన్ఐటి వరంగల్. ఎస్‌టిఏ కోఆర్డినేటర్ పి ఎం జి ఎస్ వై. పి ఆర్ డి ఈ తిమ్మాపూర్ సబ్ డివిజన్ మంజుల భార్గవి. పిఆర్డిఇ రవి ప్రసాద్ మానకొండూర్ డివిజన్. పిఆర్ స్పెషల్ ఏఈ ప్రవీణ్ కుమార్. స్థానిక సర్పంచ్ లక్ష్మీరామిరెడ్డి. ఉప సర్పంచ్ సిహెచ్ తిరుపతి. మాజీ సింగిల్ విండో చైర్మన్ అల్వాల కోటి. మాజీ సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి. వార్డు సభ్యులు. సిహెచ్ మంగ మధుసూదన్ రెడ్డి. బండి పెల్లి సంతోష్. లచ్చిరెడ్డి. కోటేశ్వర్ రెడ్డి. నరసింహారెడ్డి. సంజీవరెడ్డి. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు





# రెండు కోణాల్లో చూడాలి..

## సంజూ బ్యాటింగ్ పై అశ్విన్ కీలక వ్యాఖ్యలు

టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా భారత్ జింబాబ్వేపై భారీ విజయాన్ని నమోదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఓపెనర్ గా సంజూ శాంసన్‌కు అవకాశం లభించింది. ప్లేయింగ్ ౹×లో రింకూ సింగ్ స్థానంలో వచ్చిన శాంసన్, అభిషేక్ శర్మతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించాడు. 15 బంతుల్లో 24 పరుగులు చేసి టీమ్‌కు మంచి ఆరంభాన్ని అందించాడు. అతని స్ట్రైక్ రేట్ టీమ్‌కు మొదటి మంచి మోమెంటమ్ ఇచ్చింది. ఇక మ్యాచ్ ముగిసిన తర్వాత టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తన యూట్యూబ్ ఛానెల్‌లో సంజూ శాంసన్ ప్రదర్శనపై విశ్లేషణ చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేను దీనిని రెండు కోణాల్లో చూస్తాను. ఒకటి నాకు తెలిసిన సంజూ శాంసన్ వ్యక్తిత్వం, అతని సామర్థ్యం. రెండోది భారత జట్టులో అతని పాత్ర. ఈ వరల్డ్ కప్‌లో ఓపెనింగ్ భాగస్వామ్యం పై ఈ మ్యాచ్ లో స్పష్టత వచ్చింది. జట్టుకు మంచి ఆరంభం లభించింది. సంజూ 15 బంతుల్లో 28 లేదా 16 బంతుల్లో 30 పరుగులు చేస్తే.. ఫైనల్ వరకు అదే కొనసాగిస్తే, అతను తన పని చేసినట్టే.. అని అశ్విన్ అన్నాడు. అశ్విన్ మరింతగా మాట్లాడుతూ.. శాంసన్ భారీ ఇన్నింగ్స్ ఆడాలని తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. సంజూ వ్యక్తిగా నాకు ఇష్టం. అతను ఒక పెద్ద స్కోర్ చేయాలని నేను కోరుకుంటున్నాను. ఇంత మంచి వేదిక అతనికి మళ్లీ రాకపోవచ్చు. మంచి ఆరంభాన్ని పెద్ద ఇన్నింగ్స్ గా మార్చుకోవాలి.. ఇన్ని సంవత్సరాల కష్టానికి ఇది సరైన సమయమని అన్నాడు. కనీసం ఒక సెంచరీ లేదా మ్యాచ్ విన్నింగ్ ఇన్నింగ్స్ తో వరల్డ్ కప్ ముగిస్తే.. అతని ఆత్మవిశ్వాసానికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నాడు. దానికి అందుకు అర్హుడు అని అశ్విన్ వ్యాఖ్యానించాడు. ఇక సూపర్ 8లో చివరి మ్యాచ్ మార్చి 1న వెస్టిండీస్ తో ఆడనుంది. ఈ మ్యాచ్ ఇరుజట్లకూ డూ ఆర్ డై మ్యాచ్. ఈ మ్యాచ్ లో ఎవరు గెలిస్తే వారు సెమిస్ లో అడుగు పెడతారు.

# పాడె మోస్తూ.. కన్నీటి వీడ్కోలు

## తుదిశ్వాస విడిచిన రింకూ సింగ్ తండ్రి..



**నోయిడా:** భారత బ్యాటర్ రింకూసింగ్ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన తండ్రి ఖచంద్ర సింగ్ అనారోగ్యంతో శుక్రవారం తుది శ్వాస విడిచారు. టీ20 ప్రపంచ కప్ సమయంలో రింకూకు తండ్రి మరణం రూపంలో షాక్ తగిలింది. చెన్నైలో జరిగిన జింబాబ్వే మ్యాచ్‌కు ముందే రింకూ తండ్రికి సీరియస్‌గా ఉన్నట్లు తెలియడంతో అతను నోయిడా వెళ్లి వచ్చారు. శుక్రవారం గ్రేటర్ నోయిడాలోని యథర్త్ ఆస్పత్రిలో ఖచంద్ సింగ్ మరణించారు. నాలుగో దశ కాలేయ క్యాన్సర్‌తో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఆయన మరణించడం రింకూ కుటుంబానికి తీరని లోటు మిగిల్చింది. జింబాబ్వే మ్యాచ్ ముగిసిన తర్వాత రోజే రింకూ తండ్రికి అంత్యక్రియలు నిర్వహించారు. దీనికి సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. వైరల్ వీడియోలో, రింకు తన తండ్రి మృతదేహాన్ని మోస్తున్నప్పుడు భావోద్వేగానికి గురయ్యాడు, చుట్టూ పోలీసు సిబ్బంది, నివాళులు అర్పించడానికి గుమిగూడిన వందలాది మంది అభిమానులు ఉన్నారు. జింబాబ్వే మ్యాచ్‌లో రింకూ ప్లేయింగ్ 11లో చోటు దక్కించుకోలేదు. అభిషేక్ శర్మతో పాటు సంజు సామ్సన్ ఓపెనింగ్ జోడీగా ఎంపిక చేయడంతో, జట్టు కూర్పు నుంచి రింకూ తప్పుకున్నాడు. ఈ టోర్నీలో రింకూ పెద్దగా బ్యాట్‌తో ఆకట్టుకోలేకపోయాడు. అతను ఐదు ఇన్నింగ్స్‌లలో కేవలం 24 పరుగులు మాత్రమే చేశాడు, రెండుసార్లు నాటౌట్‌గా నిలిచాడు. అత్యధిక స్కోర్ 11 పరుగులు. ఆదివారం వెస్టిండీస్‌తో కోల్‌కతా వేదికగా చివరి సూపర్-8 మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిస్తే భారత్ సెమీస్ బెర్త్ కన్ఫామ్ అవుతుంది.

# బుమ్రా రికార్డుకు చెక్ పెట్టిన అర్ష్‌దీప్ సింగ్

## భారత్ తరపున అత్యధిక వికెట్లు!





**చెన్నై:** టీమిండియా ఎడమచేతి ఫాస్ట్ బౌలర్ అర్ష్‌దీప్ సింగ్ టీ20 వరల్డ్ కప్ చరిత్రలో కొత్త రికార్డు సృష్టించాడు. చెన్నై వేదికగా జింబాబ్వేతో జరిగిన సూపర్ 8 మ్యాచ్ లో మూడు కీలక వికెట్లు తీసి ప్రత్యర్థి మిడిల్ ఆర్డర్ ను కుదేలు చేశాడు. సికందర్ రాజా, ర్యాన్ బర్ల్, టోనీ మున్యోంగా వికెట్లు పడగొట్టి భారత్‌కు 72 పరుగుల భారీ విజయాన్ని అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మూడు వికెట్లతో అర్ష్‌దీప్ రికార్డును అందుకున్నాడు. టీ20 వరల్డ్ కప్ చరిత్రలో టీమిండియా తరుపున ఇప్పటి వరకు 35 వికెట్లను పడగొట్టాడు. దీనితో టీ20 వరల్డ్ కప్ లలో భారత్ తరపున అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్‌గా నిలిచాడు. ఇప్పటివరకు ఈ రికార్డు 33 వికెట్లతో జస్ప్రీత్ బుమ్రా పేరిట ఉండేది. ఈ లిస్ట్ లో మూడో స్థానంలో రవిచంద్రన్ అశ్విన్ 32 వికెట్లతో ఉన్నాడు. ఆ తర్వాత హార్దిక్ పాండ్య 29, రవీంద్ర జడేజా 22 వికెట్లతో ఉన్నారు. ప్రస్తుతం జరుగుతున్న టోర్నీలో అర్ష్‌దీప్ మంచి ఫామ్‌లో ఉన్నాడు. ఐదు మ్యాచ్‌ల్లో 8 వికెట్లు తీసి జట్టుకు కీలక సహకారం అందిస్తున్నాడు. అయితే ఈ ఎడిషన్‌లో అత్యధిక వికెట్లు సాధించిన భారత బౌలర్‌గా వరుణ్ చక్రవర్తి 6 మ్యాచ్‌ల్లో 11 వికెట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు. అయితే దక్షిణాఫ్రికా మ్యాచ్‌లో 47 పరుగులు, జింబాబ్వేపై 35 పరుగులు ఇవ్వడంతో ఆందోళన కలిగిస్తోంది. నిన్న జరిగిన మ్యాచ్ అనంతరం అర్ష్‌దీప్ ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. వెస్టిండీస్ఉదక్షిణాఫ్రికా మ్యాచ్‌ను కుటుంబంతో కలిసి హోటల్ గదిలో చూస్తున్నానని తెలిపాడు. ఆ మ్యాచ్ భారత్‌కు కీలకం కావడంతో, వెస్ట్ ఇండీస్ గెలిస్తే సెమీ ఫైనల్ అవకాశాలు దెబ్బతినే పరిస్థితి ఉండేది. "వెస్టిండీస్ బ్యాటర్లు సిక్స్ కొట్టినప్పుడల్లా నా నాన్న కోపంగా అరవడం మొదలుపెట్టారు.. 'ఏం చేస్తున్నారు?' అంటూ వ్యాఖ్యలు చేశారు. నేను ఆయన్ను శాంతింపజేసి, క్రికెట్‌ను ఆస్వాదించమని చెప్పాను. భారత్‌కు నెక్స్ట్ మ్యాచ్ కోల్‌కతా వేదికగా వెస్టిండీస్ తో జరగనుంది. ఈ మ్యాచ్ గెలిచిన జట్టు సెమీఫైనల్‌కు అర్హత సాధించే అవకాశముండటంతో రెండు టీమ్స్ కు 'డూ ఆర్ డై' గా మారింది.

# సెమీస్ చేరే అర్హత భారత్‌కు లేదు..

## షాహిద్ ఆఫ్రిది సంచలన వ్యాఖ్యలు!

టీ20 వరల్డ్ కప్ 2026లో భారత్ ప్రదర్శనపై పాకిస్థాన్ మాజీ కెప్టెన్ షాహిద్ ఆఫ్రిది సంచలన వ్యాఖ్యలు చేశాడు. లీగ్, సూపర్-8లో టీమిండియా సాధించిన విజయాలు.. అసలు విజయాలేనా అని విమర్శించాడు. చిన్న జట్లపైనే టీమిండియా ప్రతాపం చూపిస్తుందని, పెద్ద జట్లపై తేలిపోతుందని ఎద్దేవా చేశాడు. వరల్డ్ కప్ 2026లో భారత్‌కు సెమీస్ చేరే అర్హత లేదన్నాడు. టోర్నీలో భారత్ కంటే వెస్టిండీస్ మెరుగైన ప్రదర్శన చేసిందని, సెమీఫైనల్ చేరేందుకు కరేబియన్లకే 100 శాతం అర్హత ఉందని ఆఫ్రిది అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం ఆఫ్రిది వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. షాహిద్ ఆఫ్రిది మాట్లాడుతూ 'భారత్ చిన్న జట్లను మాత్రమే ఓడించి టీ20 వరల్డ్ కప్ 2026 సెమీఫైనల్‌కు చేరడం టోర్నమెంట్ స్థాయిని దిగజార్చినట్లే. ఈ పోటీ నిష్పక్షపాతంపై ప్రశ్నలు లేవనెత్తుతుంది. బలమైన జట్లను ఎదుర్కొన్నప్పుడు భారత్ అస్థిరంగా కనిపిస్తోంది. ముఖ్యంగా దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో పూర్తిగా ఆధిపత్యం కోల్పోయింది. అమెరికాపై సూర్యకుమార్ యాదవ్ కీలక ఇన్నింగ్స్ ఆడకపోయి ఉంటే ఫలితం మరోలా ఉండేది. అలాగే పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో కొన్ని కీలక పరిణామాలు జరిగి ఉంటే భారత్ ఓడిపోయే అవకాశం కూడా ఉండేది. టోర్నీలో భారత్ కంటే వెస్టిండీస్ మెరుగైన ప్రదర్శన చేసింది. సెమీఫైనల్ చేరేందుకు భారత్‌కు అర్హత లేదు. విండీస్ టీమ్ సెమీస్‌కు అర్హత గల టీమ్' అని అన్నాడు. బలమైన జట్లపై విజయాలు సాధించకపోతే సెమీఫైనల్ అర్హత విలువ తగ్గిపోతుందని షాహిద్ ఆఫ్రిది అంటున్నాడు. ఆఫ్రిది వ్యాఖ్యలు సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారి తీశాయి. కొందరు ఆఫ్రిది విశ్లేషణను సమర్థిస్తుంటే.. మరికొందరు మాత్రం భారత్ సాధించిన విజయాలను ఓర్వలేక ఇలా మాట్లాడుతున్నాడని విమర్శిస్తున్నారు. సూపర్-8లో దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో ఓడి సెమీస్ అవకాశాలను భారత్ సంక్లిష్టం చేసుకున్న విషయం తెలిసిందే. జింబాబ్వేపై గెలిచి సెమీస్ ఆశలను సజీవంగా నిలుపుకొంది. ఇక వెస్టిండీస్‌పై గెలిచి సెమీస్ చేరాలని చూస్తోంది. మార్చి 1న వెస్టిండీస్‌తో భారత్ తలపడనుంది.





# సచిన్ వర్సెస్ విరాట్

## ఇద్దరిలో ఎవరు బెస్టో చెప్పేసిన కోహ్లి!

సచిన్ వర్సెస్ కోహ్లి.. ఈ ఇద్దరిలో ఎవరు బెస్ట్ అనే ప్రశ్న చాలా మంది అభిమానులకు వచ్చే ఉంటుంది. ఎప్పటి నుంచో జరుగుతున్న ఈ చర్చకు ముగింపులేదు. కానీ.. విరాట్ మాత్రం తాను సచిన్ ఫ్యాన్ అని చెప్పుకుంటాడు. మరోసారి సచిన్ అంశంపై కోహ్లి కీలక వ్యాఖ్యలు చేశాడు. కాగా, ఇద్దరూ వేర్వేరు యుగాల్లో, వేర్వేరు సవాళ్లను ఎదుర్కొన్నారు. సచిన్ టెండుల్కర్ యుగంలో క్రికెట్ మామూలుగా ఉండేది కాదు.. ఒకే బంతితో రివర్స్ స్వింగ్‌ను ఎదుర్కోవడం అప్పట్లో సాధారణ విషయం కాదు. ఆ పరిస్థితుల్లోనూ సచిన్ అద్భుతంగా రాణించాడు. మరోవైపు విరాట్ కోహ్లి చేజింగ్‌లో చూపించిన ఆధిపత్యం అంతా ఇంతా కాదు.. ముఖ్యంగా వన్డేల్లో విరాట్ స్థిరత్వం ఆధునిక క్రికెట్‌లో అరుదైన స్థాయిగా అభివర్ణిస్తారు. వాస్తవానికి.. 1990లలో భారత జట్టు తరచుగా టెండూల్కర్‌పైనే ఆధారపడేది.. చాలా మ్యాచ్‌లు సచిన్ ఒంటరిగా గెలిపించేవాడు. అలాగే కోహ్లి కూడా ఎన్నో సంవత్సరాలు అదే బాధ్యతలో మోశాడు.

అయితే.. తాజాగా ఐపీఎల్ 19వ సీజన్‌కు ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జెర్సీలో కోహ్లి కనిపించాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఆ అఫిషియల్ ఎక్స్ అకౌంట్‌లో పోస్ట్ చేశారు. ఈ వీడియోలో విరాట్ మాట్లాడుతూ.. "టెండూల్కర్ నుంచి ఒక విషయం తీసుకోవాలంటే? ఏం తీసుకుంటారు" అనే ప్రశ్నకు "ఎవరీథింగ్" అని విరాట్ సింపుల్‌గా సమాధానమిచ్చాడు. 1999లో వెన్నునొప్పి తర్వాత టెండూల్కర్ తన ఆటను ఎలా మార్చుకున్నాడో కోహ్లి గుర్తుచేశాడు. భారీ షాట్లకు బదులుగా స్పిన్నర్లపై ల్యాప్ షాట్, ప్యాడిల్ స్వీప్‌లతో కొత్త మార్గం చూపించాడని.. ఆ సాఫ్ట్ ల్యాప్ షాట్ టెండూల్కర్‌కు ప్రత్యేకతగా మారిందని తెలిపాడు. "నేను టెండూల్కర్ నుంచి ఒక షాట్ తీసుకోవాలంటే.. అది ల్యాప్ షాట్. స్పిన్నర్లపై అంత సాఫీగా, ఎప్పుడూ తొందరపడకుండా ఆడేవాడు. నేను ఆ షాట్ ఆడేటప్పుడు గందరగోళంగా కనిపిస్తాను," అని కోహ్లి నవ్వుతూ అన్నాడు. ఈ వీడియో వైరల్‌గా మారింది. కొందరు అభిమానులు ఈ వీడియోపై కామెంట్స్ చేశారు. సచిన్ తనకన్నా మెరుగ్గా ఆడినట్లు విరాట్ కోహ్లి ఒప్పుకున్నాడని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.






# ఐపీఎల్ షెడ్యూల్ మరింత వెనక్కి..

## మార్చి 26న కాదు 28న టోర్నీ షురూ..!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 19వ సీజన్ తేదీపై ఉత్కంఠ కొనసాగుతోంది. అబూధాబీలో వేలం ముగిసి మూడు నెలలు కావొస్తున్నా ఇంకా బీసీసీఐ నుంచి షెడ్యూల్ ప్రకటన రాలేదు. ఆనవాయితీ ప్రకారం మార్చి ఉ మే నెల మధ్యలో మెగా టోర్నీ జరగాలి. ఈసారి కూడా అదే సంప్రదాయం పాటించే అవకాశముంది. అయితే.. ఇదివకూ చెప్పినట్టు మార్చి 26న కాకుండా మరో రెండు రోజులు ఆలస్యంగా మెగాటోర్నీ ప్రారంభమవుతుందని వార్తలు వినిపిస్తున్నాయి. త్వరలోనే నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికల నేపథ్యంలోనే ఐపీఎల్ 19వ సీజన్ షెడ్యూల్ ప్రకటన ఆలస్యం అవుతోంది. కేరళ, అస్సాం, బెంగాల్, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా సీజన్ ఆరంభంపై బీసీసీఐ ఆలోచనలో పడింది. ఆ రాష్ట్రాల్లో ఎన్నికలపై కేంద్ర ఎన్నికల సంఘం తేదీలు ప్రకటించగానే.. ఐపీఎల్ తేదీలను ఖరారు చేయాలని బీసీసీఐ భావిస్తోంది. 2019లోలోనూ ఇదే సమస్య ఎదురైంది. అప్పుడు పూర్తి స్థాయిలో కాకుండా కొన్ని మ్యాచ్‌లకే షెడ్యూల్ వెల్లడించింది. ఈసారి కూడా అదే పంథాను అనుసరించాలని బీసీసీఐ కసరత్తు చేస్తోంది. అయితే.. వేలం సందర్భంగా చూచాయగా పేర్కొన్నట్టు మార్చి 26వ తేదీన కాకుండా.. మరో రెండు రోజులు ఆలస్యంగా టోర్నీ షురూ కానుంది. అంటే.. అంటే మార్చి 28న వేసవి వినోదంగా ఐపీఎల్ సందడి మొదలవ్వనుంది. ఒకవేళ.. ఈ రోజున కాదంటే.. మార్చి 29. ఈ రెండు తేదీల్లో ఒకటి ఖరారు అవుతుందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.



# విరోష్ జంట పోస్టులకు మిలియన్లకొద్దీ వ్యూస్

టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ-రష్మికలు మూడు ముళ్ల బంధంతో ఒక్కటయిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26, గురువారం ఉదయం 10 గంటల 10 నిమిషాలకు విజయ్, రష్మిక మెడలో తాళి కట్టడంతో వీరి వివాహం సంప్రదాయబద్ధంగా పూర్తయ్యింది. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరైన ఈ వేడుక రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో హిందూ సాంప్రదాయాల ప్రకారం ఘనంగా జరిగింది. పెళ్లి అనంతరం నూతన దంపతులు తమ ఆనందాన్ని అభిమానులతో పంచుకున్నారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వివాహ వేడుక ఫోటోలను షేర్ చేస్తూ రష్మిక హృదయాన్ని తాకే సందేశాన్ని పోస్ట్ చేశారు. హాయ్ మై లవ్స్.. నా భర్త విజయ్ దేవరకొండని పరిచయం చేస్తున్నాను అంటూ ప్రారంభించిన ఆమె, విజయ్ తన జీవితంలో ఎంత ప్రత్యేకమో భావోద్వేగంగా వివరించారు. నిజమైన ప్రేమ అంటే ఏమిటో చూపించిన వ్యక్తి విజయ్ అని, ప్రతిరోజూ పెద్ద కలలు కనమని ప్రోత్సహించిన వ్యక్తి ఆయనేనని చెప్పారు. తనలోని పాజిటివిటీని వెలికితీసిన వ్యక్తి విజయ్ అంటూ, 'నేను ఈ వ్యక్తి గురించి ఒక పుస్తకం రాయగలను' అని రష్మిక పలు ఫొటోలు షేర్ చేశారు. అలానే విజయ్ దేవరకొండ కూడా భావోద్వేగ పోస్టుతో అభిమానులను ఆకట్టుకున్నారు. ఒక రోజు ఆమెను చాలా మిస్ అయ్యాను. ఆమె ఉంటే నా రోజు ఇంకా బాగుండేదని అనిపించింది. ఆమెతో ఉంటే ఎక్కడైనా ఇంటి అనుభూతి కలుగుతుందని భావించాను. అందుకే నా బెస్ట్ ఫ్రెండ్‌ను నా భార్యగా చేసుకున్నాను. 26.02.2026' అంటూ తన ప్రేమను వ్యక్తం చేస్తూ పిక్స్ షేర్ చేశారు. అయితే విజయ్ దేవరకొండ పెట్టిన పోస్ట్‌కి కొద్ది గంటలలోనే 13 మిలియన్స్‌కి పైగా వ్యూస్ రాగా, రష్మిక పోస్ట్‌కి 15 మిలియన్స్‌కి పైగా వ్యూస్ వచ్చినట్టు తెలుస్తుంది. అంటే ఇద్దరికి కలిపి 28 మిలియన్స్‌కి పైగానే వ్యూస్ వచ్చాయి. ఇది సరికొత్త రికార్డ్ అంటున్నారు. భారతీయ సెలబ్రిటీల వివాహ జీవితాలలో ఇదో సరికొత్త రికార్డ్ అని చెబుతున్నారు. ఇక వీరి రిసెప్షన్ మార్చి 4న హైదరాబాద్ వేదికగా అట్టహాసంగా జరగనున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ నూతన దంపతులు కలిసి రణబాలి అనే పీరియడ్ యాక్షన్ డ్రామాలో నటిస్తున్నారు. భార్యాభర్తలుగా మారిన తర్వాత వీరిద్దరూ కలిసి నటిస్తున్న తొలి చిత్రం ఇదే కావడం విశేషం.





## ఉదయపూర్ ఎయిర్‌పోర్టులో కొత్త జంట సందడి

టాలీవుడ్ స్టార్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహ బంధంలోకి అడుగుపెట్టారు. 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో అత్యంత వైభవంగా వీరి వివాహం జరిగింది. అయితే పెళ్లయిన మరుసటి రోజు ఈ నూతన వధూవరులు ఉదయ్‌పూర్ ఎయిర్‌పోర్ట్‌లో ప్రత్యక్షమవడంతో అక్కడ ఒక్కసారిగా సందడి నెలకొంది. కొత్త పెళ్లికూతురు రష్మిక ఎరుపు రంగు సంప్రదాయ దుస్తుల్లో మెరిసిపోగా, విజయ్ స్టైలిష్ ఇండో-వెస్ట్రన్ అవుట్‌ఫిట్‌లో రాజసం ఉట్టిపడేలా కనిపించారు. తమ అభిమాన జంటను చూడటానికి ఎయిర్‌పోర్ట్‌కు భారీగా చేరుకున్న అభిమానులకు విజయ్, రష్మిక చిరునవ్వుతో అభివాదం చేస్తూ, ఫ్లయింగ్ కిసెస్ ఇస్తూ ఉత్సాహపరిచారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. వీరు నేరుగా ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీని, కేంద్రమంత్రి అమిత్ షాను కలిశారు.



## ప్రాణస్నేహితులిద్దరూ వివాహంతో ఒక్కటయ్యారు

### కళ్యాణి ప్రియదర్శన్ పోస్ట్


క్యూట్ కపుల్ విజయ్ దేవరకొండ-రష్మిక మందన్నా వివాహ బంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే. పెళ్లి అనంతరం విజయ్?రష్మిక తమ వివాహ వేడుక ఫోటోలను సోషల్ మీడియా ద్వారా అభిమానులతో పంచుకున్నారు. దీంతో 'విరోష్' జంటకు అభిమానుల నుంచి శుభాకాంక్షల వెల్లువ కురుస్తోంది. ఇదిలా ఉండగా, రష్మికకు స్నేహితురాలైన కళ్యాణి ప్రియదర్శన్ సోషల్ మీడియా వేదికగా చేసిన పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. విజయ్-రష్మికల పెళ్లి ఫోటోను షేర్ చేస్తూ ఆమె భావోద్వేగంగా రాసుకొచ్చారు. అత్యంత దయగల అమ్మాయి తన ప్రాణ స్నేహితుడిని వివాహం చేసుకోవడం నేను చూశాను. ఆమె అతడి వైపు అడుగులు వేస్తూ వస్తున్నప్పుడు ఇద్దరి కళ్లలో కనిపించిన ఆనందభాష్పాలు వారి ప్రేమకు గుర్తులుగా మారాయి అంటూ పేర్కొన్నారు. అలాగే, ఆమె ప్రతి అడుగు ఎన్నో భావోద్వేగ క్షణాలను మోసుకువస్తున్నట్టుగా అనిపించింది. వారి మౌనమే ప్రతిదానికి సమాధానంగా నిలిచింది. స్నేహంగా మొదలై ప్రేమగా మారిన ఈ జంటను ఇలా చూడటం నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నా. వీరికి ఇది మరో అందమైన ప్రారంభం అని కళ్యాణి తన పోస్ట్‌లో తెలిపారు. కళ్యాణి ప్రియదర్శన్ చేసిన ఈ ఎమోషనల్ పోస్ట్ సోషల్ మీడియాలో వేగంగా వైరల్ అవుతోంది. అభిమానులు ఆమె పోస్ట్‌ని షేర్ చేస్తూ, నూతన దంపతులకు మరోసారి శుభాకాంక్షలు తెలుపుతున్నారు.గీతా గోవిందం, డియర్ కామ్రేడ్ చిత్రాలలో కలిసి నటించిన ఈ జంట ఇప్పుడు భార్య భర్తలుగా మారారు. స్నేహం ప్రేమగా మారి ఇప్పుడు వివాహ బంధంతో ఒకటవ్వడం అభిమానులను ఆనందంలో ముంచెత్తుతోంది.టాలీవుడ్‌లో ఈ పెళ్లి వేడుక హాట్ టాపిక్‌గా మారగా, సెలబ్రిటీలు, ఫ్యాన్స్ సోషల్ మీడియా వేదికగా కొత్త జంటకి ఆశీస్సులు అందిస్తున్నారు.

## కామెడీలో కథాత్మక జోడింపు

### నవ్వుల విందులో అదిరిపోయే ట్విస్ట్..

వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించే శ్రీవిష్ణు, ఈసారి 'విష్ణు విన్యాసం'తో పక్కా వినోదాన్ని పంచారు. దర్శకుడు యదునాథ్ మారుతీరావు రాసుకున్న వైవిధ్యమైన పాయింట్, దానికి కామెడీని జోడించిన విధానం ప్రేక్షకులను మెప్పిస్తోంది. కథా నేపథ్యం.. విష్ణు (శ్రీవిష్ణు) ఒక కాలేజీలో ట్రైనీ లెక్చరర్. అక్కడ పర్మినెంట్ ఉద్యోగం పొందాలంటే సీనియర్ లెక్చరర్ల దగ్గర అసిస్టెంట్‌గా పనిచేసి వారి మెప్పు పొందాలి. అయితే కాలేజీలో కొందరు విష్ణుకు అడ్డంకులు సృష్టిస్తుంటారు. అలాంటి సమయంలో లేడీ లెక్చరర్ మనీషా (నయన్ సారిక) విష్ణును తన అసిస్టెంట్‌గా చేర్చుకుంటుంది. మనీషా ప్రవర్తన చాలా వింతగా ఉంటుంది.. ఆమెకు అన్ని రకాల వ్యసనాలు ఉన్నట్లు కనిపిస్తుంది. విధిలేక ఆమె దగ్గర పనిచేసే విష్ణు, క్రమంగా ఆమెతో ప్రేమలో పడతాడు. అయితే వీరి పెళ్లి సమయంలో మనీషా గురించి విష్ణుకు ఒక షాకింగ్ నిజం తెలుస్తుంది. అసలు మనీషా ఎందుకు అలా ప్రవర్తించింది? జాతకాలపై విపరీతమైన నమ్మకం ఉన్న విష్ణు, జాతక లోపం ఉన్న మనీషాను ఎలా పెళ్లి చేసుకున్నాడు? అనేదే మిగతా కథ. విశ్లేషణ.. దర్శకుడు యదునాథ్ మారుతీరావు కథను చాలా ఆసక్తికరంగా మొదలుపెట్టారు. ప్రథమార్ధం అంతా కాలేజీ డ్రామా, శ్రీవిష్ణు మేనరిజమ్స్‌తో హిలేరియస్‌గా సాగిపోతుంది. ముఖ్యంగా హీరోయిన్ క్యారెక్టర్‌పై ప్రేక్షకుల్లో అనుమానం కలిగేలా చేస్తూనే కామెడీ పండించడం బాగుంది. ఇంటర్వెల్ బ్యాంగ్‌లో వచ్చే ట్విస్ట్ సినిమాను మరో మలుపు తిప్పుతుంది. ద్వితీయార్థంలో కథ కాస్త ఎమోషనల్ టర్న్ తీసుకున్నా, ఎక్కడా వినోదం తగ్గకుండా జాగ్రత్త పడ్డారు. ఇదొక రకంగా హీరోయిన్ చుట్టూ తిరిగే కథ అయినా, హీరో పాత్ర ద్వారా దానికి ముగింపు పలికిన తీరు ఆకట్టుకుంటుంది. నటీనటుల పనితీరు.. శ్రీవిష్ణు తన టైమింగ్‌తో మరోసారి 'మ్యాన్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్' అని నిరూపించుకున్నారు. లెక్చరర్ పాత్రలో ఆయన ఒదిగిపోయారు. నయన్ సారిక చాలా తక్కువ సమయంలోనే బరువైన పాత్రను పోషించే అవకాశం దక్కించుకుంది. నటనలో పరిణతి చూపించింది. సత్య కమెడియన్ సత్య తనదైన పంచ్‌లతో థియేటర్లో నవ్వులు పూయించారు. మిగతా నటీనటులు తమ పరిధి మేరకు మెప్పించారు. సరదాగా నవ్వుకోవాలనుకునే వారికి 'విష్ణు విన్యాసం' మంచి ఛాయిస్. శ్రీవిష్ణు కామెడీ టైమింగ్, ఆసక్తికరమైన కథాంశం ఈ సినిమాకు ప్రధాన బలాలు.



## దీపిక అవకాశాలు చేజార్చుకుంటోందా ?

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణెళి ఇటీవల వం-సస వార్తలతో ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారుతున్నారు. ఆమె కండీషన్స్ కారణంగా ఇప్పటికే ఒప్పుకున్న ప్రాజెక్టులు చేజారిపోతున్నాయనే ప్రచారం గత కొద్ది రోజులుగా నడుస్తోంది. ముఖ్యంగా టాలీవుడ్‌లో భారీ స్థాయిలో తెరకెక్కుతున్న స్పిరిట్, కల్కి 2 చిత్రాల నుంచి ఆమె బయటకు వచ్చినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తాజాగా మరో హాలీవుడ్ అవకాశం కూడా చేజారిందనే టాక్ వినిపిస్తోంది. హాలీవుడ్‌లో పాపులర్ సిరీస్‌గా రూపొందిన ది వైట్ లోటస్ నాలుగవ సీజన్ కోసం దీపికా పదుకొనే పేరును మేకర్స్ పరిశీలించినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. గ్లోబల్ రీచ్ ఉన్న ఈ సిరీస్‌లో నటించే అవకాశం దక్కింది అంటే అంతర్జాతీయంగా మంచి గుర్తింపు దక్కే అవకాశం ఉంటుంది. అయితే ఈ ప్రాజెక్ట్ కోసం మేకర్స్ ఆమెను ఆడిషన్‌కు రావాలని కోరినట్లు సమాచారం. కానీ, తాను ఆడిషన్‌కు హాజరు కాలేనని దీపికా స్పష్టం చేసినట్లు టాక్ వినిపిస్తోంది. దీంతో ఆమె స్థానంలో మరో నటిని ఎంపిక చేసుకునే దిశగా 'ది వైట్ లోటస్' టీమ్ ముందుకు సాగిందని తెలుస్తోంది. ప్రముఖ అంతర్జాతీయ సిరీస్‌లో నటించే అవకాశం కోల్పోయిందనే వార్తలతో దీపికా అభిమానులు నిరాశకు గురవుతున్నారు. ఇప్పటికే కొన్ని పెద్ద ప్రాజెక్టుల నుంచి బయటకు వచ్చిన నేపథ్యంలో, హాలీవుడ్ కమ్‌బ్యాక్‌కు ఇది మంచి అవకాశంలా భావించకుండా ఇలా ఎందుకు బయటకు వచ్చిందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

# అఖిర స్కిన్ క్లినిక్ ప్రారంభం

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి చేతుల మీదుగా ఘనంగా ప్రారంభోత్సవం



**నేటి సాక్షి గజ్వేల్:** సిద్ధిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన అఖిర స్కిన్ క్లినిక్ ను మెదక్ ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి ఘనంగా ప్రారంభించారు. 2వ వార్డు కౌన్సిలర్ గోలి మమత సంతోష్ గుప్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ చందన రవి, వైస్ చైర్మన్ కళ్యాణ్ కర్ పద్మా బాయి నర్సింగ రావు హాజరై క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి మాట్లాడుతూ గజ్వేల్ పట్టణ ప్రజలకు మరియు పరిసర గ్రామాల వారికి నాణ్యమైన చర్మ వైద్య సేవలు అందించేందుకు డెర్మటాలజిస్ట్, కాస్మోటాలజిస్ట్ అయిన డాక్టర్ శ్రీరంగం అఖిర ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. ఆధునిక సదుపాయాలతో ఏర్పాటు చేసిన ఈ క్లినిక్ ద్వారా ప్రజలకు మెరుగైన చికిత్స అందుబాటులోకి రానుందని ఆయన పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని చర్మ సంబంధిత సమస్యలకు నిపుణులైన డాక్టర్ శ్రీరంగం అఖిర సేవలను పొందాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సంతోష్ కుమార్, రామారావు, సదాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం సాదాసీదాగా కాకుండా స్థానిక ప్రజల సమక్షంలో ఉత్సాహంగా జరిగింది.

# నర్సరీ మొక్కలు తొలగింపు పై అధికారులకు ఫిర్యాదు

కొండ్రోని పల్లి గ్రామ సర్పంచ్ సుధాకర్......



**నేటి సాక్షి నారాయణపేట (ఇమామ్ సాబ్ ):** నారాయణపేట జిల్లాలోని ధన్వాడ మండల పరిధిలోని కొండ్రంపల్లి గ్రామంలోని రైతు వేదిక వద్ద నిర్వహిస్తున్న ప్రభుత్వ మొక్కల నర్సరీ కేంద్రాన్ని తొలగించారని శుక్రవారం నాడు కొండ్రోని తుల పల్లి గ్రామ సర్పంచ్ సుధాకర్,గ్రామస్తుల ఆధ్వర్యంలో ధన్వాడ మండల ఉపాధి హామీ పథకం అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు ఇట్టి ఫిర్యాదు పై విచారణ. చేస్తామని ఉపాధి హామీ పథకం మండల అధికారి తెలిపారు.

# చంద్రశేఖర్ ఆజాద్ 95వ వర్ధంతి వేడుకలు



**నేటి సాక్షి తిరుమలాయపాలెం (మెట్టు రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల కేంద్రంలో చంద్రశేఖర్ ఆజాద్ 95వ వర్ధంతి వేడుకలు ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ సుబ్లేడ్ మాజీ సర్పంచ్ మందడి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వతంత్ర ఉద్యమ పోరాటంలో భగత్ సింగ్ రాజగురు సుఖదేవ్ అనేకమంది ఉద్యమకారుల ను సమీకరించి బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన మహోన్నత వ్యక్తి చంద్రశేఖర్ ఆజాద్ అని అయినా అన్నారు ఈ కార్యక్రమంలో బానోత్ సిమ్లా నాయక్ అనిల్ నిమ్మల వెంకన్న గుగ్గిళ్ళ అంబేద్కర్ జేఏసీ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మన్నెగూడెంలో కోతుల బెడద



**నేటి సాక్షి-మేడిపల్లి:** మన్నెగూడెం గ్రామంలో ఉదయం హోటల్ నుండి టిఫిన్ తీసుకొని వెళుతున్న చెక్కరికోట ధర్మయ్య అనే వృద్ధుడి పైన కోతులు దాడి చేయడంతో వృద్ధుడికి తీవ్ర గాయలపాలు అయ్యాడు. గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందని దీనిపైన ప్రభుత్వ వ్యవస్థగాని గ్రామ అధికారులు కానీ చొరవ చూపకపోవడంతో ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతూనే ఉన్నాయని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వాధికారులు ప్రజా నాయకులు ఇప్పటికైనా దీనిపైన శ్రద్ధపెట్టి కోతుల బెడదని నివారించాలని గ్రామస్తులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# ఖకీ కన్నీరు

## రిటైర్మెంట్ తర్వాత 'ఆర్థిక' గాయం!

- 37 ఏళ్ల పాటు పోలీస్ శాఖలో అంకితభావంతో సేవలు
- కానిస్టేబుల్ నుంచి ఎస్సై స్థాయి వరకు సాగిన సుదీర్ఘ ప్రస్థానం
- రిటైర్మెంట్ బకాయిలు అందక వృద్ధాప్యంలో తీరని కష్టాలు
- కనీస అవసరాల కోసం కన్నీరుమున్నీరవుతున్న రిటైర్డ్ ఎస్సై ఇస్మాయిల్





**నేటి సాక్షి, గజ్వేల్:** శాంతిభద్రతల పరిరక్షణ కోసం తన యవ్వనాన్ని ధారబోశారు.. ఖకీ చొక్కా వేసుకుని దశాబ్దాల పాటు ప్రజల కోసం అహర్నిశలు శ్రమించారు. కానిస్టేబుల్ నుంచి ఎస్సై స్థాయి వరకు ఎన్నో సవాళ్లను ఎదుర్కొని 37 ఏళ్ల సుదీర్ఘ సర్వీసు అందించారు. తీరా రిటైర్మెంట్ తర్వాత ప్రశాంతంగా గడపాల్సిన ఆ వృద్ధ అధికారి.. ఇప్పుడు తన సొంత బకాయిల కోసం, కనీస అవసరాల కోసం కన్నీరు మున్నీరవుతున్నారు. గజ్వేల్ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఎస్సై మహమ్మద్ ఇస్మాయిల్ దీనగాథ ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ అనంతర దుస్థితికి అద్దం పడుతోంది.

**సర్వీసులో సింహం.. సమస్యల్లో సామాన్యుడు!**

మహమ్మద్ ఇస్మాయిల్ పోలీస్ శాఖలో అత్యంత నిబద్ధత కలిగిన అధికారిగా పేరు తెచ్చుకున్నారు. కానిస్టేబుల్ గా ప్రస్థానం మొదలుపెట్టి ఏఎస్ఐ, ఎస్సై హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. అయితే, ఉద్యోగ విరమణ చేసిన తర్వాత ఆయన జీవితం తలకిందులైంది. కుటుంబ బాధ్యతలు ఒకవైపు, వృద్ధాప్య ఆరోగ్య సమస్యలు మరోవైపు ఆయన్ని చుట్టుముట్టాయి. పెరిగిన వైద్య ఖర్చులు, నిత్యావసరాల ధరలతో రోజువారీ జీవనం భారంగా మారింది.

**అందని 'గ్రాట్యుటీ'.. అగమ్యగోచరంగా బతుకు!**

ప్రభుత్వం నుంచి రావలసిన గ్రాట్యుటీ, పెన్షన్ బకాయిలు, ఇతర ప్రయోజనాలు ఇప్పటికీ అందకపోవడంతో ఇస్మాయిల్ తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు. "ప్రభుత్వం కోసం నా జీవితాంతం పనిచేశాను.. ఇప్పుడు నా సొంత డబ్బుల కోసం వేడుకోవాల్సిన పరిస్థితి రావడం బాధాకరం" అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తన బకాయిలు తక్షణమే విడుదల చేస్తేనే తన కుటుంబాన్ని ఆదుకోగలనని కన్నీటి పర్యంతమవుతున్నారు.

**న్యాయం జరిగేనా..?**

ఇస్మాయిల్ ఒక్కరే కాదు, రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది రిటైర్డ్ ఉద్యోగులు ఇలాంటి సమస్యలతోనే సతమతమవుతున్నారు. విరమణ చేసిన ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించాల్సిన అవసరం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, రిటైర్డ్ ఎస్సై ఇస్మాయిల్ కు రావలసిన బకాయిలను తక్షణమే విడుదల చేసి, ఆయనకు ఆర్థిక భద్రత కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

# సర్పంచ్ లు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలి



జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**నేటి సాక్షి, మంచిర్యాల జిల్లా:** గ్రామస్థాయిలో ప్రజల సంక్షేమం కోసం సర్పంచ్ లు బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని హాజీపూర్ మండలం ముల్కల్ల లో గల ఐజా ఇంజనీరింగ్ కళాశాలలో సర్పంచ్ లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, డివిజనల్ పంచాయతీ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాలలో సర్పంచుల విధులు, అధికారాలపై సర్పంచులకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. తెలంగాణ గ్రామీణాభివృద్ధి శిక్షణా సంస్థ వారు రూపొందించిన కరదీపికలోని అన్ని అంశాలపై సుశిక్షితులైన మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామాలలో త్రాగునీరు, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతి ఇంటికి త్రాగునీరు అందాలని, ప్రతిరోజు ఇంటింటి నుండి తడి, పొడి చెత్తలను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డులకు తరలించాలని తెలిపారు. ఉపయోగకరమైన చెత్తను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్ల ద్వారా సేంద్రియ ఎరువుల తయారీకి వినియోగించాలని తెలిపారు. గ్రామాలలో వ్యర్థ పదార్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. గ్రామాలకు మంజూరైన నిధులను నిబంధనల ప్రకారం ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని తెలిపారు. గ్రామాలలో ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని, తద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు అందిస్తున్న ఉచిత ఇసుకను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గ్రామాలలో అభివృద్ధి పనుల అమలులో ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామస్థాయిలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా ఉన్నట్లయితే విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలో పూర్తి సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని, జిల్లాలో విద్యార్థుల హాజరు శాతం పెరిగిందని, వేసవిలో నిర్వహించే సమ్మర్ క్యాంప్ లకు సైతం విద్యార్థులు పూర్తిస్థాయిలో హాజరవుతున్నారని తెలిపారు. అంగన్వాడి కేంద్రాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అంగన్వాడి కేంద్రం పరిధిలోని పిల్లలు హాజరయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామాలలో ఇంటి పనులు ఎలాంటి బకాయి లేకుండా పూర్తిగా వసూలు చేయాలని, గ్రామాలకు మంజూరయ్యే నిధులను నిబంధనలకు లోబడి ప్రజా ప్రయోజనాలకు వినియోగించాలని తెలిపారు. వీధి కుక్కల అంశంలో సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం చర్యలు తీసుకోవాలని తెలిపారు. సర్పంచ్ లు శిక్షణలో నేర్చుకున్న అంశాలను ప్రజా శ్రేయస్సు దృష్ట్యా వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# భావితరాలకు 'కళా' గంధం..

## గుడికందులలో నృత్య శిక్షణ!





**నేటి సాక్షి,తొగుట (వడ్డే నరసింహులు):** నేటి యాంత్రిక జీవనంలో విద్యార్థులు మన భారతీయ సంప్రదాయ కళలను విస్మరించకుండా, వాటి గొప్పతనాన్ని చాటిచెప్పేందుకు 'స్పిక్ మాకే' (SPIC MACAY – సొసైటీ ఫర్ ద ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగ్ యూత్) సంస్థ నడుం బిగించింది. సిద్దిపేట జిల్లా తొగుట మండల పరిధిలోని గుడికందుల జెడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సాంప్రదాయ కళలపై ప్రత్యేక అవగాహన మరియు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ప్రముఖ కథక్ నృత్య కళాకారిణి ఆస్కి దేశాయ్ విద్యార్థులకు నృత్యంలోని ప్రాథమిక మెలుకువలను నేర్పించారు. సుమారు రెండు గంటల పాటు సాగిన ఈ శిక్షణలో కథక్ నాట్యంలోని తాళాల ప్రాముఖ్యత, భావవ్యక్తీకరణ మరియు పదనిసలు వంటి అంశాలపై సమగ్ర వివరణ ఇచ్చారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని నాట్య కళపై తమ ఆసక్తిని కనబరిచారు. నాట్యం కేవలం వినోదం మాత్రమే కాదని, దాని ద్వారా వ్యక్తిత్వ వికాసం, క్రమశిక్షణ మరియు ఏకాగ్రత పెంపొందుతాయని ఆమె ఈ సందర్భంగా తెలియజేశారు. పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శ్రీ పరుపాటకం అంజిరెడ్డి మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థుల్లో మన దేశీయ సంప్రదాయ కళలపై అవగాహన పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని కొనియాడారు. విద్యార్థులు చదువుతో పాటు లలిత కళల పట్ల కూడా అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. కనకారాములు, టి. హనుమారెడ్డి, ఎన్. రవీందర్ రెడ్డి, బి. శివయ్య, ఐ. భాస్కర్, కె. అనసూయ, సిఆర్పి వై. వెంకటస్వామి, టి. లావణ్య, ఎల్. బిక్షపతి తదితరులు పాల్గొని విద్యార్థుల ప్రతిభను చూసి ఆనందం వ్యక్తం చేశారు.

# రోడ్డు ప్రమాదాలు నివారిద్దాం

ఎస్పీ మహేష్ బీ గీతే

**నేటి సాక్షి సిరిసిల (శివకుమార్ ):** రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఎల్లారెడ్డిపేట పోలీసుల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.మండల పరిధిలోని వివిధ వాహనాల డ్రైవర్ల కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరం అశ్విని హాస్పిటల్స్ సహకారంతో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ మహేష్ బీ గీతే శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ డ్రైవర్ల భద్రతే ప్రజల భద్రత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతతో వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ట్రాఫిక్ నియమాలు పాటించడం ప్రతి వాహనాదారుడి సామాజిక బాధ్యత అని అన్నారు. దీర్ఘకాలం వాహనాలు నడిపే డ్రైవర్లు కంటి చూపు సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా నిరంతరం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. స్పష్టమైన చూపు లేకపోవడం కూడా రోడ్డు ప్రమాదాలకు కారణమవుతుందని



తెలిపారు. వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్, రోడ్డు భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం,

# ప్రతి ప్రాణం విలువైనదే, రోడ్డు భద్రతలో నిర్లక్ష్యం ప్రాణాంతకం




- పరిగిలో 'అరైవ్-అలైవ్' అవగాహన సదస్సులో పాల్గొన్న
- జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా,.

**నేటి సాక్షి పరిగి:** తెలంగాణ రాష్ట్ర డీజీపీ రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'అరైవ్ – అలైవ్ (ఎర్రివ్ అలీవ్)' కార్యక్రమంలో భాగంగా, నేడు పరిగి పోలీస్ స్టేషన్ పరిధిలోని శారద గార్డెన్స్ లో భారీ రోడ్డు భద్రత అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై, కొడంగల్ చౌరస్తా నుండి శారద గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించి,ఇట్టి అవగాహనా కార్యక్రమం లో జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిగి సబ్ డివిజన్ పరిధిలోని వివిధ రవాణా సంఘాలకు చెందిన డ్రైవర్లకు ప్రముఖ కంటి ఆసుపత్రి మాక్స్ విజన్ సౌజన్యంతో ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లజోడులను పంపిణీ చేశారు. డ్రైవర్ల ఆరోగ్య సంరక్షణే రహదారి భద్రతకు మూలమని ఈ సందర్భంగా ఎస్పీ స్పష్టం చేశారు.ఈ సదస్సులో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి పౌరుడు క్షేమంగా తన గమ్యస్థానానికి చేరుకోవాలనే లక్ష్యంతోనే 'అరైవ్ – అలైవ్' కార్యక్రమాన్ని రూపొందించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు అనాథలవుతున్నాయని, ముఖ్యంగా వృత్తిపరమైన డ్రైవర్లు తమ ఆరోగ్యం పట్ల, ముఖ్యంగా కంటి చూపు పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిద్రలేమి, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడమే మెజారిటీ రోడ్డు ప్రమాదాలకు కారణం. వాహనం నడిపే సమయంలో క్రమశిక్షణ పాటిస్తే మన ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా కాపాడగలము" అని డ్రైవర్లను ఉద్దేశించి తెలిపారు.కంటి చూపులో లోపాలు ఉన్న డ్రైవర్లకు ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రమాదాల ముప్పు ఎక్కువగా ఉంటుందని, అందువల్ల క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, సూచించిన కళ్లజోడులను తప్పనిసరిగా వినియోగించాలని ఎస్పీ కోరారు. హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగం తప్పనిసరి చేయడంతో పాటు, వాహనాలకు రిఫ్లెక్టర్ స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ భారీ అవగాహన కార్యక్రమంలో ఆటో, కార్, బస్సు, లారీ, హెవీ వెహికల్ డ్రైవర్ యూనియన్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. డ్రైవర్లతో రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించడంతో పాటు, ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.రాములు నాయక్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్,పరిగి ఏం ఆర్ ఓ వెంకటేశ్వరి, సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,పరిగి ఆర్ టీ ఓ వీరేందర్ నాయక్,పరిగి ఆర్టీ సి, డిమ్, కృష్ణమూర్తి, పరిగి మునిసిపల్ కమిషనార్ వెంకటయ్య, జిల్లా పోలీస్ ప్రసిడెంట్ ఆశోక్, పరిగి సబ్ డివిజన్ ఎస్.ఐ లు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోస్టర్ ఆవిష్కరణ







- వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ విజయవంతం చెయ్యాలి

**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి) లో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోస్టర్‌ను ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అంతటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహాత్మాగాంధీ ఎన్ఎస్ఎస్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ మారం రమణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అంతటి శ్రీనివాస్ మాట్లాడుతూ, వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ చైర్మన్ డా. సముద్రాల ఉపేందర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పార్లమెంటును విజయవంతం చేయాలని అన్నారు. జిల్లాకు నోడల్ కళాశాలగా నాగార్జున ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), నల్లగొండ ఎంపిక చేయబడిందని, జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్‌ను నిర్వహించే అవకాశం లభించడం పట్ల నాగార్జున ప్రభుత్వ కళాశాల గౌరవంగా భావిస్తోందని అన్నారు. అనంతరం మహాత్మా గాంధీ యూనివర్సిటీ కో–ఆర్డినేటర్ డాక్టర్ మారం రమణారెడ్డి మాట్లాడుతూ, వికసిత్ భారత్ ప్రయాణ దిశగా యువ భారతం అడుగులు వేయాలని అన్నారు. 2047 వికసిత్ భారత్ లో భాగంగా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ప్రపంచంలో అగ్రగామి దేశంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలలో మన దేశం ఇంకా ముందు వరసలో ఉండాలని, ప్రధాన మంత్రి పిలుపు మేరకు 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ,కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడాశాఖ మాత్యులు వారి ఆదేశాల మేరకు యువకులను సన్నదం చేయాలని యువపార్ల మెంట్ పోటీలను జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించి, రాష్ట్ర అసెంబ్లీలో మరియు దేశ పార్లమెంట్ లో మాట్లాడే అవకాశం యువకులకు కల్పిస్తూ నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యూత్ పార్లమెంటును విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్ మరియు వికసిత్ భారత్ చైర్మన్ డా. సముద్రాల ఉపేందర్ అన్నారు. అంతేకాకుండా వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ లో పాల్గొనుటకు రిజిస్ట్రేషన్ కు మై భారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ తేదీ మార్చి 04వరకు అవకాశం ఉందని అన్నారు. "ఈ పోటీ యువతకు ప్రజాస్వామ్య విలువలు నేర్చుకునే వేదిక అని, మన దేశ భవిష్యత్తు వారి చేతుల్లో ఉంది" అని తెలిపారు. పాల్గొనేవారి వయస్సు 18 నుండి 25 సంవత్సరాల మధ్య ఉండాలని, ఈ ఏడాది జిల్లా స్థాయి పోటీ అంశం: "50 Years of Emergency Lessons for Indian Democracy (50 సంవత్సరాలకు ముందుగా అత్యవసర పరిస్థితి: భారత ప్రజాస్వామ్యానికి పాఠాలు) అనే అంశంపై ప్రతి అభ్యర్థి 3 నిమిషాల ప్రసంగం ఇవ్వాలని, తెలుగు, హిందీ లేదా ఇంగ్లీష్ ,(అస్సామీ, బెంగాల్, గుజరాతి, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడిశా, పంజాబీ, తమిళం) భాషలలో మాట్లాడవచ్చని, ఎంపికైన విద్యార్థులు రాష్ట్ర స్థాయికి పది మందిని ఎంపిక చేస్తారు, ఆపై జాతీయ స్థాయికి వెళ్తారు అని తెలిపారు. నాగార్జున ప్రభుత్వ కళాశాల నల్గొండలో జరుగు జిల్లా స్థాయిలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ పోటీలను విజయవంతం చెయ్యాలని కోరారు. జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్దులను రాష్ట్ర అసెంబ్లీ కి విద్యార్దులను పంపుతారని, అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మునిస్వామి, అకాడమీ కో–ఆర్దినేటర్ బత్తిని నాగరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ నర్సింగ్ కోటయ్య, ఎం వెంకటరెడ్డి, డాక్టర్ బొజ్జ అనిల్ కుమార్, కంబాలపల్లి శివరాణి, డాక్టర్ ఏ మల్లేశం, ఎం సావిత్రి,డా బట్టు కిరీటం, హరికిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

## అరైవ్ –అలైవ్ కార్యక్రమం.

**జిల్లా ఎస్పీ స్నేహమెహ్రా.**



**నేటి సాక్షి వికారాబాద్:** తెలంగాణ రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు, జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా రూపొందించిన 'అరైవ్–అలైవ్' (ూతీతీఱఙవ-ూశ్రీఱఙవ) కార్యక్రమాన్ని వికారాబాద్ జిల్లా పోలీసులు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ క్యాంపెయిన్ లో భాగంగా వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్యభారతి హాల్‌లో ప్రత్యేక కంటి వైద్య శిబిరం అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ముఖ్య అతిథిగా విచ్చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి, జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రోడ్డు నియమ నిబంధనలపై అవగాహన ఉన్నప్పటికీ, వాహనదారులు ప్రదర్శించే చిన్నపాటి నిర్లక్ష్యం అనేక కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగులుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్ల ప్రాణాలు మాత్రమే కాకుండా, రోడ్డుపై ప్రయాణించే ఇతరుల ప్రాణాలు కూడా డ్రైవర్ల చేతుల్లోనే ఉంటాయని ఎస్పీ తెలిపినారు. వాహనం నడిపే సమయంలో క్రమశిక్షణ పాటిస్తే మన ప్రాణాలతో పాటు ఎదుటివారిని కూడా సురక్షితంగా ఉంచగలమని పేర్కొన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావడానికి క్షేత్రస్థాయిలో మరిన్ని అవగాహన సదస్సులు నిర్వహిస్తామని, అదే సమయంలో నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా కంటి చూపు లోపాలు ఉన్న డ్రైవర్లకు రాత్రి వేళల్లో ప్రమాద ముప్పు ఎక్కువగా ఉంటుందని ఎస్పీ సూచించారు. అందువల్ల డ్రైవర్లందరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ఆటో, కార్, బస్సు, లారీ డ్రైవర్లు, విద్యార్థులు యువతతో కలిసి ఆమె రహదారి భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ శిబిరంలో ప్రముఖ ఆసుపత్రుల సహకారంతో డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించారు. అలాగే, కార్యక్రమంలో పాల్గొన్న మీడియా మిత్రులకు జిల్లా ఎస్పీ గారి చేతుల మీదుగా హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, టౌన్ ఇన్ స్పెక్టర్ రఘు కుమార్, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్, సబ్ డివిజన్ ఎస్.ఐలు, డ్రైవర్ యూనియన్ సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# క్షుద్ర పూజల కలకలం



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి:** మండలంలోని ఆమినిగుంట పంచాయతీ పులి కోన వంకలో క్షుద్ర పూజల కలకలం రేపింది ,ప్రధాన రహదారి నుంచి గ్రామానికి వెళ్లే మార్గంలో గుర్తు తెలియని వ్యక్తులు పలు రకాలతో ముగ్గులు నిమ్మకాయతో రక్తం తడిసిన నేల ఇలాంటి గుర్తులు కనిపించడంతో గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు, గత రెండు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొని ఉందని క్షుద్ర పూజలతో గ్రామానికి అరిష్టం వాటిల్లే ప్రమాదం ఉందని వారు. వాపోతున్నారు ఇటీవల కాలంలో ఇలాంటి దృశ్యాలు కనిపిస్తుండడంతో పిల్లలు వృద్ధులు పిల్ల నుంచి బయటకు రాకుండా బిక్కు బిక్కుమంటూ ఇళ్లలోనే ఉండాల్సి వస్తుంది .అని యానాదులు తెలుపుతున్నారు,

# ఇబ్బందులు లేకుండా పనులు త్వరగా పూర్తి చేయాలి

**ఎమ్మెల్యే బిఎల్ఆర్**



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** పట్టణంలోని సాగర్ రోడ్డులో ప్రధాన రహదారి మధ్యలో నిర్మిస్తున్న డివైడర్స్ పనులను స్థానిక శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా, ప్రజలకు ఎటువంటి ఇబ్బంధి లేకుండా పనులు త్వరగా పూర్తి చేయాలను సంబంధిత అధికారులను అదేశించారు. వారి వెంట కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు తదితరులు ఉన్నారు.

# కోతుల బాధ ఇక ఉండదు.

**కోతులను పట్టిస్తున్న ఎంపీ. ఫలించిన ప్రయత్నం. వినూత్నంగా ఆలోచనతో రైతులకు కోతుల బాధతో విమక్తి చేయనున్న కొండ.**



**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ నియోజకవర్గంలోని రెండు మండలాలలో కోతులు రైతుల పంటలను నాశనం చేస్తున్నాయని గ్రహించి కోతులున్న దగ్గరికి వెళ్లి వినూత్నంగా చాకచక్యంగా కోతులను పట్టుకునేందుకు ప్రత్యేక ట్రేన్నర్ ను నియమించి కోతులను పడుతున్న పరిస్థితి ఉంది వికారాబాద్ అసెంబ్లీ పరిధిలోని ధారూర్ మండలంలోని కొండాపూర్ కలాన్‌లో చేవెళ్ల ఎంపి శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి స్వయంగా తయారు చేయించి సుమారుగా 150 నుండి 200 పట్టే విధంగా కేజెస్ జాలీలు తయారు చేసి రైతులకు పట్టేవిధంగా ట్రైనింగ్ ఇచ్చి కోతులు లేని ఊర్లను చెయ్యాలనే పట్టుదలతో ఎంపి శ్రీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఉన్నారు. ఈ కార్యక్రమములో బిజెపి వికారాబాద్ అసెంబ్లీ కోఆర్డినేటర్ వడ్ల నందు,నర్సాపూర్ సర్పంచ్ బీర్ల రాజు,మాజీ సర్పంచ్ పరమేష్,వార్డ్ సభ్యులులాలయ్య,రైతులు కుర్వ యాదయ్య,గంతల అంజిల్ రెడ్డి,వడ్ల సంగమేష్,లాల్ రెడ్డి,వీరా రెడ్డి,సంగమేష్ కేశపల్లి,బాలయ్య కేశపల్లి రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ



**నేటి సాక్షి వికారాబాద్:** వికారాబాద్ పురపాలక సంఘం కార్యాలయం ఆవరణలో వికారాబాద్ పట్టణానికి చెందిన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి –78, షాదిముబారక్ –31 సీఎంఆర్ఎఫ్ –23 చెక్కులను పంపిణీ చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య పాల్గొన్న వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి , మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్ మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి, ఏంఆర్ఓ లక్ష్మీనారాయణ, వార్డు కౌన్సిలర్లు, మమతా అంజి నాయకులు, ముత్తారఫ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# మహా జాతరకు ఎస్ఐకి ఆహ్వానం

**గుడి పూజారి బాడీష నాగారమేష్**




**నేటిసాక్షి,ములుగు ,మంగపేట:** మండలంలో రాజుపేట శివారులో వాగొడ్డుగూడెంగ్రామ పంచాయతీలో వెలసిన శ్రీ నాగులమ్మ మహా జాతర మార్చి 3నుండి 7వరకు జరుగును ఈ మహా జాతరకు ముఖ్య అతిధిగా స్థానిక ఎస్ఐ టివిఅర్ సూరి ని శ్రీ నాగులమ్మ జాతర కు రావలసిందిగా ఆహ్వాన పత్రిక ఇచ్చి ఆహ్వానించిన శ్రీ రామకృష్ణ సేవ ట్రస్ట్ చైర్మన్ నాగులమ్మ గుడి ప్రధాన పూజారి బిఅర్ఎస్ ములుగు జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బాడిశ నాగరమేష్ వీరి వెంట ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్థిక అక్షరాసత్య అవగాహన



**నేటి సాక్షి తిరుమలాయపాలెం,(మెట్టు రుద్రరాజు):** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం పైనంపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ ధరావత్ సరోజినీ(ఎ/శీ వెంకన్న) ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాసత్య అవగాహన సదస్సు కార్యక్రమం ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఐఆర్ డి ఎస్ జ్యోతి హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క ఖాతాదారులు కేవైసీ అప్డేట్ చేయించుకోవాలని అలాగే సెంట్రల్ గవర్నమెంట్ స్కీమ్స్ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన, సుకన్య అభివృద్ధి పథకం, అటల్ పెన్షన్ యోజన, ఈ స్కీమ్ ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని ఈ కేవైసీ అప్డేట్ చేసుకోకపోతే సైబర్ క్రైమ్ బారిన పడే అవకాశం ఉందని అపరిచితమైన లింకులను ఓపెన్ చేస్తే మీ అకౌంట్ లో ఉన్న అమౌంట్ కట్ అయితే హెల్ప్ లైన్ నెంబర్ 1930 నెంబర్ కు కాల్ చేయగలరని అన్నారు ఈ కార్యక్రమంలో సుబ్లేడ్ తెలంగాణ గ్రామీణ బ్యాంక్ క్యాషియర్ ఉపేంద్ర, మెసెంజర్ గోవర్ధన్, సిఎఫ్ఎల్ కౌన్సిలర్స్ కామల్ల కిరణ్ కుమార్, వి ఉమా, సీసీలు నాగరాజు, కోటియా, యుబిఐ బ్యాంక్ బిసి బి.నిర్మల మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బ్యాంక్ లో బంగారం చోరీ...

**నిందితుల నుండి రికవరీ చేసి బాధితులకు అందజేత**

**కేసు వివరాలు వెల్లడించిన డిఎస్పీ రాజశేఖర్ రాజు**



**నేటిసాక్షి, మిర్యాలగూడ :** బ్యాంకులో నగలు దాచుకునేందుకు వెళ్లిన కుటుంబానికి మంచి నీరు త్రాగి వొచ్చేసారికి ఆ బంగారం పోయిన సంఘటన నాగార్జున సాగర్‌లో జరిగింది. ఈ సందర్భంగా శుక్రవారం మిర్యాలగూడ డిఎస్పీ రాజశేఖర్ రాజు విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ఈనెల 23వ తేదీన నాగార్జునసాగర్ కు చెందిన కొమ్ము రాహేల్ కుమారి, భర్త రవి తన బంగారాన్ని బ్యాంకులో భద్రపరచుకోవడానికి వెళ్లిన సందర్భంలో, బ్యాగు పక్కనపెట్టి మంచినీళ్లు తాగడానికి వెళ్ళినప్పుడు, బంగారం ఉన్న బ్యాగు కనిపించకలేదు. వెంటనే నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, పైలాన్ కాలనీకి చెందిన మహిళ తీసుకున్నట్లుగా సీసీటీవీ ఫుటేజ్ లను పరిశీలించి, జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాలతో మిర్యాలగూడ డిఎస్పి రాజశేఖర రాజు ఆధ్వర్యంలో 24 గంటలలో, 9తులాల బంగారం, నల్లపూసల గొలుసు పుస్తెలతాడు, చంద్రహారం రెండు ఉంగరాలు, ఆరు తులాల దిద్దులు మహిళ నుండి రికవరీ చేసి, బాధిత మహిళకు అందజేశారు. ఈ ఆపరేషన్లో పాల్గొన్న సీఐ బీ శ్రీను నాయక్ ఎస్ఐ జి ముత్తయ్య రిసెప్షన్ రాజేశ్వరి వారి సిబ్బందిని డీఎస్పీ రాజశేఖర రాజు అభినందించారు. ఈ సందర్భంగా బాధిత మహిళా పోలీస్ లకు ధన్యవాదములు తెలిపారు.

# కొవ్వొత్తులతో నిరసన



**నేటి సాక్షి, గన్నేరువరం, (బుర్ర అంజయ్య గౌడ్):** రజక మహిళపై దాడి చేయడం అనుమానుషం మనీ రెండు నెలల పసిపాప మృతికి కారకులైన మరియు పాలకులను వెంటనే శిక్షించాలని గన్నేరువరం మండలకేంద్రంలో కొవ్వొత్తులతో నిరసన చేపట్టారు. నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మర గ్రామంలో మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చిన రజక దంపతుల పై దాడి చేసినా రెండు నెలల పసి పాప ను కాలితో తన్ని మృతికి కారణమైన వ్యక్తులను అరెస్ట్ చేసి చట్టరీత్యం చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం బాధిత కుటుంబానికి 5 ఎకరాల భూమి ప్రభుత్వ ఉద్యోగం నగదును ఇచ్చి బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ రజక సంఘం అధ్యక్షులు మునిగంటి మల్లయ్య,మండల రజక సంఘం అధ్యక్షులు మునిగంటి నాగరాజు, మునిగంటి మొండయ్య, మునిగంటి రాములు, మునిగంటి తిరుపతి, మునిగంటి నాగరాజు, మునిగంటి రాజయ్య, మునిగంటి శ్రీధర్, మునిగంటి అజయ్, తదితరులు పాల్గొన్నారు.

# పీఎంశ్రీ కార్యక్రమాల అమలు



**నేతి సాక్షి సిరిసిల్ల (శివకుమార్):** పీఎం శ్రీ కింద జిల్లాలోని పలు విద్యాలయాల్లో అమలు అవుతున్న కార్యక్రమాలను పీఎంశ్రీ నోడల్ అధికారి, కేంద్ర ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్, అర్బన్ ఎఫైర్స్ జాయింట్ సెక్రటరీ ప్రవీర్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని మోడల్ స్కూల్, కేంద్రీయ విద్యాలయాలను సందర్శించారు. మోడల్ స్కూల్, కేంద్రీయ విద్యాలయంలో పీఎంశ్రీ కింద అమలు చేస్తున్న కార్యక్రమాలను ఆసక్తిగా తిలకించారు. ఆయా పాఠశాలలో పూల మొక్కను నాటారు. పీఎంశ్రీ కింద జిల్లాలోని ఆయా స్కూల్ లలో చేపట్టిన పనులను త్వరితగతిన పనులను పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులను పాఠ్యాంశాలతో పాటుగా అన్ని రంగాల్లో ఉత్తమ ప్రతిభ చూపేట తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రదర్శనలు, ఇతర కార్యక్రమాలను అభినందించారు. అన్ని విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని, విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో రాణించేలా ప్రోత్సాహం అందించారు

# జెఎన్‌యూలో విద్యార్థులపై దాడి హేయమైన చర్య

- ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్.
- వీసీ తక్షణమే రాజీనామా చేయాలి.
- ఎన్టీఆర్ చౌరస్తా వద్ద నిరసనలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్.




**నేటి సాక్షి వికారాబాద్ :** దేశంలోని ప్రతిష్టాత్మక విద్యాసంస్థ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ)లో విద్యార్థులు, అధ్యాపకులపై జరిగిన అమానుష దాడిని ఎస్ఎఫ్ఐ (SFI) తీవ్రంగా ఖండించింది. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోనీ ఎన్టీఆర్ ప్రధాన కూడలి వద్ద ఎస్ఎఫ్ఐ వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ అండతోనే దాడులు: అక్బర్ (SFI జిల్లా కార్యదర్శి) ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అక్బర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అండతోనే క్యాంపస్‌లలో ఏబీవీపీ గూండాలు స్వైరవిహారం చేస్తున్నారని మండిపడ్డారు. ముసుగులు ధరించి విద్యార్థినుల హాస్టళ్లలోకి చొరబడి, ఇనుప రాడ్లతో దాడి చేయడం పిరికిపంద చర్య అని విమర్శించారు. ప్రశ్నించే గొంతుకలను హింసతో అణచివేయలేరని, విద్యార్థి లోకం ఈ దాడులను ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. అలాగే విద్యార్థి నాయకుల బహిష్కరణ ఎత్తివేయాలి విద్యార్థులు తమ విద్యార్థి సంఘాన్ని ఎన్నికల తమ ప్రతినిధులను ఎన్నుకున్నారని వి.సి.ని వైఖరిని ప్రశ్నించినందుకు వారిని క్యాంపస్ నుండి బహిష్కరణ చేయడం దుర్మార్గపు చర్య తక్షణమే వారిపై బహిష్కరణ ఎత్తివేయాలి లేకపోతే దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తాము. వీసీకి పదవిలో ఉండే అర్హత లేదు,క్యాంపస్‌లో గంటల తరబడి హింస జరుగుతున్నా, పోలీసులు చూస్తూ ఉండిపోయారని, యూనివర్సిటీ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించిందని ధ్వజమెత్తారు. విద్యార్థులకు కనీస రక్షణ కల్పించలేని వీసీకి ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని, ఆయన వెంటనే వైదొలగాలని డిమాండ్ చేశారు. బాధ్యులైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తేజ జిల్లా కమిటీ సభ్యులు సిద్ధు, రవి, వంశీ ,కార్తీక్ శివ తదితరులు పాల్గొన్నారు

# నేను కౌన్సిలర్ నే కానీ మీ సేవకున్ని.!



**నేటి సాక్షి, మెట్‌పల్లి,( రాధారపు నర్సయ్య ):** ఈ రోజుల్లో రాజకీయాల్లో హంగు, ఆర్భాటం సర్వసాధారణంగా మారిన తరుణంలో కోరుట్ల పట్టణంలో ఒక ప్రజాప్రతినిధి భిన్నంగా నిలుస్తున్నారు. ఎన్నికల్లో గెలిచిన వెంటనే అధికార వైభవం చాటుకునే పరిస్థితుల్లో..'నేను మీరు ఎన్నుకున్న కౌన్సిలర్ నే కానీ మీ సేవకున్ని' అనే సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ ఒకటో వార్డు ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆయన మెట్ పల్లి మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్.!

**వేసవి ముందు జాగ్రత్త - మంచినీటి సరఫరా ప్రారంభం**

వేసవికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఒకటో వార్డులో మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు చేపట్టారు. వాటర్ ట్యాంకర్ల ద్వారా శుద్ధమైన తాగునీటిని ఇంటింటికి సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజలకు ఇబ్బందులు రాకుండా ముందుగానే స్పందించడం ఆయన ప్రజాసేవకు నిదర్శనంగా నిలుస్తోంది.

**స్వయంగా ఇంటింటికి - అబ్బురపరిచిన చర్య**

సాధారణంగా ప్రజాప్రతినిధులు ఆదేశాలు ఇస్తే సరిపోతుంది అనుకునే ఈ కాలంలో స్వయంగా ట్యాంకర్ వద్ద నిలబడి, ఇంటింటికి వెళ్లి మంచినీటిని సరఫరా చేయడం స్థానికులను అబ్బురపరిచింది. మున్సిపల్ వైస్ చైర్మన్ హోదాలో ఉన్నప్పటికీ ప్రజల మధ్యే ఉండి సేవ చేయడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 'ప్రజలే నాకు బలం' అనే భావనతో పని చేస్తున్నారని వార్డు వాసులు అభినందిస్తున్నారు.

**ప్రజల సమస్యలే ప్రాధాన్యం**

ఈ సందర్భంగా ఓంకారి నవీన్ కుమార్ మాట్లాడుతూ ఒకటో వార్డు ప్రజలకు తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని తెలిపారు. నీరు, పారిశుధ్యం, వీధి దీపాలు, రోడ్లు వంటి మౌలిక సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా నేరుగా తనను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు.

- స్వయంగా మంచినీటిని సరఫరా చేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకారి నవీన్ కుమార్
- వేసవి ముందస్తు చర్యలు - ఒకటో వార్డు ప్రజల ప్రశంసలు

**సేవే లక్ష్యం - ఆదర్శంగా నిలుస్తున్న ప్రజాప్రతినిధి**

హోదా, అధికారానికి అతీతంగా ప్రజల మధ్య ఉండి పనిచేయడం వల్ల ఒకటో వార్డు ప్రజల్లో నమ్మకం పెరిగిందని స్థానికులు అంటున్నారు. రాజకీయాల్లో సేవా భావం తగ్గిపోతుందనే విమర్శల మధ్య ఓంకారి నవీన్ కుమార్ చూపిస్తున్న వినయం, కార్యదీక్ష ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.వేసవి కాలం పొడవునా మంచినీటి సరఫరా సజావుగా కొనసాగిస్తామని, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షణ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.!

# శ్రీ శివ మార్కండేయ కోటి నవదుర్గ దేవాలయానికి ఉత్సవ రథం బహుకరణ

- రూ. 1.30 లక్షల వ్యయంతో నిర్మాణం
- 25వ వార్డు కౌన్సిలర్ కలాల రాధ-సాయిచంద్ దంపతుల సేవ
- వేద మంత్రోచ్చారణల మధ్య ఘనంగా ప్రతిష్ఠాపన



**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య ):** కోరుట్ల పట్టణంలోని శ్రీ శివ మార్కండేయ కోటి నవదుర్గ దేవాలయంలో శుక్రవారం భక్తి పరవశ వాతావరణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 25వ వార్డు కౌన్సిలర్ కలాల రాధ-సాయిచంద్ దంపతులు దేవాలయానికి రూ. 1.30 లక్షల వ్యయంతో నిర్మించిన ఉత్సవ రథాన్ని బహుకరించారు. దేవాలయ ఉత్సవాలకు ఈ రథం వినియోగించనున్నారు. ఉత్సవ రథాన్ని పద్మశాలి కులోన్నతి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటుక ప్రసాద్, దేవాలయ కమిటీ చైర్మన్ జిల్లా ధనంజయ్ ప్రారంభించారు. వేద మంత్రోచ్చారణల నడుమ రథాన్ని దేవాలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై హారతులు సమర్పించారు. ఈ సందర్భంగా కలాల రాధా-సాయిచంద్..మాట్లాడుతూ నెల రోజుల క్రితం భక్తులకు ఇచ్చిన మాట ప్రకారం ఈ రోజు ఉత్సవ రథాన్ని సమర్పించడం ఆనందంగా ఉందన్నారు. శివయ్య, అమ్మవారికి సేవ చేసే అవకాశం దక్కడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. దేవాలయ అభివృద్ధికి తన వంతు సహకారం ఎప్పటికీ కొనసాగుతుందని పేర్కొన్నారు.దేవాలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈ రథం దేవాలయ వార్షిక ఉత్సవాలు, ప్రత్యేక వేడుకల్లో కీలక పాత్ర పోషించనుందని తెలిపారు. భక్తుల ఆధ్యాత్మిక భావనను మరింత బలపరుస్తూ సంప్రదాయాలను కాపాడటానికి ఈ రథం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ ప్రధాన కార్యదర్శి బండ్ల రవి కుమార్, ఆడెపు నరేష్, జక్కుల ప్రవీణ్, కట్కం వినయ్, అందె రాజ్ కుమార్, రుద్ర విఘ్నేష్, రాడం మహేందర్, గజేంగి మనీష్, బండి సురేష్, అందె రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఆధ్యాత్మిక ఉత్సాహంతో ముగిసింది.

# అవయవ దానం చేసి ఇద్దరికి జీవం ఇచ్చిన నర్సయ్య



**నేటి సాక్షి - రాయికల్,( రాధారపు నర్సయ్య ):** తాను మరణించిన అనంతరం తన అవయవాలను దానం చేసి మరో ఇద్దరి కుటుంబాల్లో ఆశాకిరణం వెలిగించిన చొప్పదండి నర్సయ్య మానవతకు ప్రతీకగా నిలిచారని స్వర్ణకార సంఘం నాయకులు పేర్కొన్నారు. రాయికల్ మండల కేంద్రానికి చెందిన స్వర్ణకారుడు నర్సయ్య ప్రమాదానికి గురై మృతి చెందగా, ఆయన కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం హృదయాలను కదిలిస్తోంది. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నర్సయ్య అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేయడానికి ముందుకు రావడం విశేషం. ఆయన లివర్, ఊపిరితిత్తులను అవసరమైన ఇద్దరు రోగులకు దానం చేసినట్లు స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మూగల మారుతీ తెలిపారు. ఈ అవయవ దానం ద్వారా ఇద్దరికి పునర్జన్మ లభించిందని, ఇది సమాజానికి ఆదర్శంగా నిలిచే సంఘటన అని అన్నారు. కుటుంబ సభ్యుల ఔదార్యం రాయికల్ ప్రాంతంలో చర్చనీయాంశమైంది. ప్రియమైన వ్యక్తిని కోల్పోయిన విషాద సమయంలో కూడా ఇతరుల ప్రాణాలు కాపాడాలనే సంకల్పంతో అవయవ దానం చేయడం గొప్ప మానవతా విలువలకు నిదర్శనమని పలువురు అభిప్రాయపడ్డారు. "మృతిలోనూ జీవం పంచిన మహోన్నత వ్యక్తి"గా నర్సయ్యను స్థానికులు స్మరించుకున్నారు. నర్సయ్య మృతి పట్ల స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు మూగల మారుతీతో పాటు సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, వారి ధైర్యం సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.అవయవ దానం ద్వారా మరొకరి ప్రాణాలను రక్షించవచ్చనే సందేశాన్ని నర్సయ్య కుటుంబం సమాజానికి అందించిందని, ఇది ప్రతి ఒక్కరికీ ఆలోచన కలిగించే సంఘటనగా నిలిచిందని వారు తెలిపారు.

- మృతిలోనూ మానవతా సందేశం
- కుటుంబ సభ్యుల ఔదార్యానికి ప్రశంసలు

# అరకొర సీపీఎస్ పెన్షన్‌తో వృద్ధాప్యంలో వైద్య ఖర్చులు ఎలా.?




- రిటైర్మెంట్ తర్వాత ఉచిత ఆరోగ్య భీమా హామీ ఇస్తేనే ఈహెచ్‌ఎస్‌కు 1.5% చందా: సీపీఎస్ ఉద్యోగుల డిమాండ్
- ప్రభుత్వం తక్షణ స్పష్టత ఇవ్వాలి - జిల్లాలో సీపీఎస్ యూనియన్ ఆందోళన

**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో,( రాధారపు నర్సయ్య ):** ప్రస్తుతం కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) విధానంలో కొనసాగుతున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులను ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్‌ఎస్)లో కొనసాగించేందుకు బేసిక్ పే నుండి 1.5 శాతం చందా మినహాయించాలని ప్రభుత్వం భావిస్తున్న నిర్ణయంపై జిల్లాలో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సర్వ సతీష్, జిల్లా కోశాధికారి గొల్లపల్లి మహేష్ గౌడ్ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గంగాధరి మహేష్ మాట్లాడుతూ.. సీపీఎస్ విధానం కారణంగా ఉద్యోగులు ఇప్పటికే బేసిక్ పే + డి.ఏలో 10 శాతం కోతను భరిస్తున్నారని గుర్తు చేశారు. రిటైర్మెంట్ తర్వాత వచ్చే నామమాత్రపు పెన్షన్‌తో వృద్ధాప్యంలో పూటగడవడమే కష్టంగా మారుతున్న పరిస్థితుల్లో, ఇప్పుడు మరో 1.5 శాతం చందా పేరుతో అదనపు భారం మోపడం అన్యాయమని అన్నారు. వృద్ధాప్యంలో అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యే సందర్భంలో లక్షల రూపాయల వైద్య ఖర్చులను ఈ అరకొర పెన్షన్‌తో ఎలా భరించగలమని ప్రశ్నించారు. రిటైర్మెంట్ అనంతరం ఆరోగ్య భద్రతపై ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వకపోతే ఈహెచ్‌ఎస్‌కు 1.5 శాతం చందా మినహాయింపును అంగీకరించడం కష్టమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో సుమారు 2.6 లక్షల సీపీఎస్ ఉద్యోగులు ఉన్నారని పేర్కొంటూ, రిటైర్మెంట్ తర్వాత కూడా ఉచిత ఆరోగ్య భీమా సదుపాయం కల్పిస్తామని ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇస్తేనే 1.5 శాతం చందాకు సమ్మతి తెలుపుతామని తెలిపారు. ప్రభుత్వం తన వంతుగా చెల్లించే 1.5 శాతం కంట్రిబ్యూషన్ మొత్తాన్ని సీపీఎస్ ఉద్యోగులు రిటైర్ అయిన తర్వాత 'హెల్త్ అలవెన్స్' రూపంలో జమ చేసి, ఈహెచ్‌ఎస్ ద్వారా ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని సూచించారు. అలా చేస్తేనే సీపీఎస్ పెన్షనర్లకు నిజమైన ఆరోగ్య భద్రత కల్పించినట్లవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం చర్చలు జరిపే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సంఘాల్లో సీపీఎస్ సంఘానికి ప్రాతినిధ్యం లేకపోవడం వల్లే తమ సమస్యలు ప్రభుత్వ దృష్టికి సరిగా వెళ్లడం లేదని యూనియన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించి, న్యాయమైన డిమాండ్లకు అనుగుణంగా తగిన ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల భవిష్యత్ భద్రత, వృద్ధాప్య ఆరోగ్య రక్షణ అంశాల్లో ప్రభుత్వం స్పష్టమైన విధానం ప్రకటించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



- కోరుట్ల కేజీబీవీ పాఠశాలపై అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ ఆకస్మిక తనిఖీ
- హాజరు, హాస్టల్ సదుపాయాలు, మధ్యాహ్న భోజనంపై సమగ్ర సమీక్ష

**నేటి సాక్షి - కోరుట్ల,( రాధారపు నర్సయ్య )** కోరుట్లలోని కస్తూర్బ గాంధీ బాలికల విద్యాలయం (ఖ+దీఎ) పాఠశాలను శుక్రవారం అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజ గౌడ్ ఆకస్మికంగా పరిశీలించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల శ్రేయస్సు, భోజన నాణ్యత అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు నమోదు పుస్తకాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ హాజరు శాతంపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులు నియమితంగా తరగతులకు హాజరు కావాలని, డ్రాప్‌అవుట్ సమస్యలు లేకుండా పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్యా ప్రగతి, బోధన విధానాలపై ఉపాధ్యాయులతో చర్చించి బోధన నాణ్యత పెంపుపై దృష్టి సారించాలని ఆదేశించారు. హాస్టల్‌లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, గదుల పరిశుభ్రత, తాగునీటి వసతి తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులు ఆరోగ్యకరమైన వాతావరణంలో చదువుకునేలా అన్ని ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. పాఠశాల పరిసరాల్లో శుభ్రతను కచ్చితంగా పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పాఠశాల వంటగదిని సందర్శించి మధ్యాహ్న భోజన తయారీ విధానం, ఆహార నాణ్యత, నిల్వ విధానాలను పరిశీలించారు. విద్యార్థులకు పోషకాహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని హెచ్చరించారు. వంటగది పరిశుభ్రతను కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన పదార్థాలనే వినియోగించాలని సూచించారు. పాఠశాల నిర్వహణ సక్రమంగా కొనసాగేందుకు సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యార్థుల శ్రేయస్సు, విద్యా ప్రమాణాల పెంపు కోసం కట్టుబడి పనిచేయాలని సూచించారు. ఈ పరిశీలనలో మండల తహసీల్దార్ కృష్ణ చైతన్య, మండల విద్యాధికారి నరేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు చేరేందుకు నిరంతరం శ్రమించాలి

- పీఎం పోషణ్ తనిఖీ లో భాగంగా కేజీబీవీ పాఠశాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్
- మధ్యాహ్న భోజనం, పదో తరగతి ఫలితాలు, వసతులపై సమగ్ర పరిశీలన





**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో,( రాధారపు నర్సయ్య ):** 'పీఎం పోషణ్' తనిఖీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ జగిత్యాల పట్టణంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న భోజనం, విద్యా ప్రమాణాలు, వసతి సదుపాయాలు తదితర అంశాలపై సమగ్రంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం కామన్ మెనూ ప్రకారం వండుతున్నారా అనే అంశాన్ని పరిశీలించారు. వంటగది పరిశుభ్రత, ఆహార నాణ్యత, నిల్వ విధానాలను సమీక్షించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, కూరగాయలు మరియు ఇతర సరుకుల సామగ్రిని స్వయంగా తనిఖీ చేసి సంబంధిత రికార్డులను పరిశీలించారు. పీఎం పోషణ్ పథకం లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యమైన, పోషకాహారం అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ఆదేశించారు. అనంతరం పదవ తరగతి ఫలితాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థుల మెరుగైన ఫలితాల కోసం తీసుకుంటున్న ప్రణాళికలపై స్పెషల్ ఆఫీసర్లు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక తరగతులు, రివిజన్ ప్లాన్, మోడల్ పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. మెస్ కమిటీ వ్యవహారాలపై వివరాలు తెలుసుకుని కమిటీ సమావేశాలు నియమితంగా నిర్వహించాలని సూచించారు. భోజన నాణ్యత, సరఫరా విధానాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని స్పష్టం చేశారు. కలెక్టర్ విద్యార్థులతో నేరుగా ముచ్చటించి పాఠశాలలో కల్పిస్తున్న అన్ని వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. పాఠ్యాంశాల్లోని పలు ప్రశ్నలు అడిగి వారి చదువు, లక్ష్యాలు, ఆశయాలపై చర్చించారు. చదువును ఇష్టంతో అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు, జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి ఆదేశించారు. పీఎం పోషణ్ పథకం లక్ష్యాలకు అనుగుణంగా నాణ్యమైన ఆహారం అందించాలని మరోసారి స్పష్టం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారికి అందుతున్న ఆహారం, వసతి సదుపాయాలపై నేరుగా అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి కె. రాము, తహసీల్దార్ రామ్మోహన్, కేజీబీవీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల జిల్లాలో మూడవ రోజు ఇంటర్ పరీక్షలు ప్రశాంతం




- 30 కేంద్రాల్లో నిర్వహణ - మొత్తం హాజరు శాతం 97.19%
- రాయికల్‌లో అదనపు కలెక్టర్ బి.ఎస్. లత పరిశీలన

**నేటి సాక్షి - రాయికల్,( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల జిల్లాలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షలు మూడవ రోజు ప్రశాంత వాతావరణంలో నిర్వహించబడ్డాయి. జిల్లావ్యాప్తంగా 30 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. జనరల్ కోర్సులకు సంబంధించి 6,750 మంది విద్యార్థులకు గాను 6,614 మంది హాజరై 136 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి 1,142 మందికి గాను 1,057 మంది హాజరై 85 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 97.19 శాతం విద్యార్థులు పరీక్షలు రాశారు. జిల్లాలో పరీక్షల నిర్వహణ సజావుగా సాగిందని అధికారులు తెలిపారు. జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్. లత రాయికల్ పట్టణంలోని ప్రణతి జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు, పరీక్ష జరుగుతున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు సమగ్రంగా ఉన్నాయా అనే అంశాలను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అలాగే బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ప్రత్యేక పరిశీలకుడు (స్పెషల్ అబ్జర్వర్) జిల్లాలోని ఆరు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసి పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా పరీక్షల కన్వీనర్ బి. నారాయణ తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి లోనైతే టెలి మానస్ సహాయ కేంద్రం నెంబర్ 14416కు ఫోన్ చేసి మానసిక వైద్యుల సహాయం పొందవచ్చని సూచించారు. జిల్లాలో పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని, రాబోయే పరీక్షలకూ ఇదే విధంగా కట్టుదిట్టమైన ఏర్పాట్లు కొనసాగిస్తామని అధికారులు వెల్లడించారు.

# పోస్టాఫీసు లో ఇన్స్పెక్షన్ అధికారుల మాయాజాలం

### అధిక నగదు ఉందని.8.26 లక్షలతో ఉడాయింపు



**నేటి సాక్షి న్యూస్ చౌడేపల్లి :** అన్నమయ్య జిల్లా, పుంగనూరు నియోజకవర్గం, సదుం మండలం, చెరుకువారిపల్లి లో గల బ్రాంచ్ పోస్టాపీసు నందు గత నాలుగు నెలల క్రితం ఇన్స్పెక్షన్ పేరుతో మెయిల్ ఓరియేషర్ కిరణ్ కుమార్ వచ్చి ధనలక్ష్మి అనే పోస్ట్ ఉమెన్ పై ఇన్పక్షన్ చేయడానికి వచ్చిన అతను నగదు అధికంగా ఉందని సుమారు 8.26 లక్షలు రూపాయలు నగదు అధికంగా ఉందని సదరు నగదును సీజ్ చేస్తున్నామని, సదరు నగదుకు ఎటువంటి రసీదు ఇవ్వకుండా, నగదు ను సీజ్ చేసినట్లు కూడా ఎటువంటి సమాచారం ఇవ్వకుండా నగదును తీసుకొని వెళ్ళి ఎక్కడ జమ చేశారో కూడా తెలియజేయకుండా ఉన్నారు. ఎస్పి వారి కార్యాలయం ద్వారా తగిన రసీదు పొందాలన్నారు. కానీ ఎటువంటి రసీదులేదు. ఇదిలా ఉండగా ఇన్స్పెక్షన్ అధికారి మోహన్ తనకు ట్రాన్సుర్ వచ్చిననూ తెలియజేయకుండా ఉండి, ఎటువంటి ఇన్స్పెక్షన్ చేయకుండా ట్రాన్స్ ఫర్ చేశారు. ఈవిషయాన్ని ఎస్పి వారి కార్యాలయం లో పిర్యాదు చేయగా మొదట సదుంలోనే మోసం జరిగినదని కాబట్టి సదుం పోలీస్టేషన్ లోనే పిర్యాదు చేయాలని సూచించారు. మోహన్ ఖాతాధారుల పుస్తకాలు తీసుకొని రమ్మని చెప్పి, అందులో లెక్కలు తేడాలు ఉన్నట్లు ఖాతాదారులకు తెలియజేశారు. ఐతే ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా పోస్టాపీసు ను మార్చారు. ఈ సమస్య పైన డిప్యూటీ సియం కార్యాలయానికి, వెళ్ళి పిర్యాదు చేశానని, వారు అక్కడి నండి సదుం పోలీసులకు సమాచారం అందించి, అక్కడికి వెళ్ళి పోలీస్ స్టేషన్‌లో కలవాలని సూచించారని ధనలక్ష్మి ఒక ప్రకటనలో తెలియజేశారు.

# బీజేపీ మజ్దూర్ విన్నపానికి కార్మిక మంత్రి స్పందన

### ఎండింగ్ బీమా నిధుల మంజూరు.భవన కార్మికులకు భరోసా



**నేటి సాక్షి, ఎండపల్లి:** భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ బీమా ఆర్థిక సాయం, నిధులు మంజూరు అంశంపై కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిని శుక్రవారం చెన్నూర్ క్యాంప్ కార్యాలయంలో బీజేపీ మజ్దూర్ సంఘం ఎండపల్లి మండల అధ్యక్షులు సిగిరి ఆనంద్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గత రెండు నెలల క్రితం రామకృష్ణాపూర్‌లో మంత్రిని కలిసి భవన నిర్మాణ కార్మికుల ప్రమాద, జీవిత బీమా పెండింగ్ ఆర్థిక సాయం మంజూరు చేయాలని విన్నవించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కాగా మంత్రి సంబంధిత జగిత్యాల జిల్లా అధికారులతో మాట్లాడి పెండింగ్‌లో ఉన్న బీమా నిధుల విడుదలకు ఆదేశాలు జారీ చేయడంతో కార్మికులకు ఊరట లభించింది. ముఖ్యంగా ధర్మపురి పట్టణానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు ఎద్మలపల్లి శంకర్ ప్రమాదవశాత్తు మరణించగా, అతని కుటుంబ సభ్యులకు ప్రమాద బీమా ఆర్థిక సాయం అందేలా మంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నట్లు తెలిపారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అవసరమైన సహాయాన్ని అందించడంలో ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేసినట్లు ఆనంద్ పేర్కొన్నారు.

# సఖి ఆవరణలో ప్రేమికుడిపై దాడి

### కత్తులు, రాళ్లతో దాడి - యువకుడికి తీవ్ర గాయాలు

### సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనిల్ కుమార్





**నేటి సాక్షి - జగిత్యాల బ్యూరో,( రాధారపు నర్సయ్య ):** జగిత్యాల పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఉన్న సఖి సెంటర్ ఆవరణలో ప్రేమ వివాహం చేసుకున్న యువకుడిపై యువతి బంధువులు కత్తులు, రాళ్లతో దాడి చేసిన ఘటన శుక్రవారం కలకలం రేపింది. ఎనగందుల అనిల్ కుమార్ (30), తండ్రి రాజేష్, కులం మాదిగకు చెందిన యువకుడు. అతనిపై చర్లబుత్కూరు గ్రామం (కరీంనగర్)కు చెందిన సౌమ్య బంధువులు దాదాపు 15 మంది కలిసి దాడికి పాల్పడ్డారు. రాళ్లతో కొట్టడంతో పాటు కత్తులతో దాడి చేయగా అనిల్ కుమార్ తల, చెయ్యి, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం అతను జగిత్యాల సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అనిల్ కుమార్‌కు తొమ్మిదేళ్ల క్రితం మల్యాల మండలం మాడంపెల్లికి చెందిన లావణ్యతో వివాహం జరిగింది. అయితే రెండేళ్ల క్రితం వీరిద్దరూ విడిపోయారు. వీరికి ఒక పాప కూడా ఉంది. సుమారు ఆరు నెలల క్రితం అనిల్ కుమార్‌కు సౌమ్యతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం ప్రేమగా మారడంతో వారం రోజుల క్రితం వీరు వివాహం చేసుకుని మల్యాల మండలం లంబాడి పల్లి గ్రామానికి వెళ్లి నివాసం ఉంటున్నారు. ఈ విషయాన్ని యువతి తన తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అనంతరం అనిల్ కుమార్ మల్యాల పోలీస్ స్టేషన్‌లో విషయాన్ని తెలియజేయగా, పోలీసులు సౌమ్యను ఐదు రోజులుగా జగిత్యాల పట్టణంలోని సఖి సెంటర్‌లో ఉంచారు. శుక్రవారం సఖి సెంటర్ అధికారులు అనిల్ కుమార్ మరియు అతని తల్లిదండ్రులకు యువతిని వచ్చి తీసుకెళ్లాలని సమాచారం ఇచ్చారు. దీంతో వారు సఖి సెంటర్‌కు చేరుకున్నారు. ఇదే సమయంలో సౌమ్యకు సంబంధించిన బంధువులు అక్కడికి చేరుకుని అనిల్ కుమార్‌పై దాడి చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం. పట్టణంలో ఈ సంఘటన చర్చనీయాంశంగా మారింది.!





# కోరుట్ల బీజేపీలో 'కొత్త కమలం'!



## కోరుట్ల సీనియర్ వైద్యుడు డా. వై అనూప్‌రావు బీజేపీలో చేరిక

### రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు కండువా కప్పి క్రియాశీల సభ్యత్వం ప్రదానం

### ఎంపీ ధర్మపురి అర్వింద్, జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు సమక్షంలో ఘన కార్యక్రమం

### 70-80 కార్లలో హైదరాబాద్‌కు తరలివెళ్లిన 350 మంది కార్యకర్తలు



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** కోరుట్ల పట్టణానికి చెందిన ప్రముఖ సీనియర్ వైద్యుడు డా. వై. అనూప్ రావు శుక్రవారం భారతీయ జనతా పార్టీలో అధికారికంగా చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పార్టీ కండువా కప్పి ఆయనకు క్రియాశీల సభ్యత్వాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. దీంతో కోరుట్ల బీజేపీలోకి 'కొత్త కమలం' రావడంతో రాజకీయ సమీకరణాలు మారే అవకాశం ఉన్నాయని చర్చించుకుంటున్నారు.

### కీలక నేతల సమక్షంలో చేరిక.!

ఇటీవల మున్సిపల్ ఎన్నికలకు ముందే అనూప్ రావు పార్టీ బాధ్యతల్లో 'కీలకపాత్ర' పోషించినప్పటికీ..అది అనధికారికంగానే భావించారు. సరైన సమయంలో 'పార్టీ తీర్థం' పుచ్చుకునేందుకు వేచి చూశారు. నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్, జగిత్యాల జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు సమక్షంలో ఈ చేరిక కార్యక్రమం ఘనంగా జరిగింది. రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు డా. భోగ శ్రావణి, రాష్ట్ర అధికార ప్రతినిధి దిలీప్ ఆచారి సహా పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి కోరుట్ల ప్రాంతంలో ఇది కీలక పరిణామంగా రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

### 70-80 'కార్ల'లో.. భారీగా తరలివెళ్లిన కోరుట్ల శ్రేణులు

డా. అనూప్‌రావు చేరిక కార్యక్రమానికి కోరుట్ల నియోజకవర్గం నుంచి సుమారు 350 మంది కార్యకర్తలు, నాయకులు 70-80 కార్లలో హైదరాబాద్‌కు తరలివెళ్లారు. కోరుట్లలోని అనూప్ రావు హాస్పిటల్ నుంచి బయలుదేరిన బృందం ఘనంగా కార్యక్రమంలో పాల్గొంది. కోరుట్ల, మెట్‌పల్లి ప్రాంతాలకు చెందిన నూతనంగా గెలిచిన కౌన్సిలర్లు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ భారీ హాజరు నియోజకవర్గంలో బీజేపీకి పెరుగుతున్న మద్దతును ప్రతిబింబించింది. ఆయన బీఆర్ఎస్ పార్టీ నుంచి 'కారు' దిగి 'కమలం' పట్టుకున్నారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

### కోరుట్లలో బీజేపీ బలోపేతానికి డా. అనూప్ రావు పాత్ర.!

డా. అనూప్ రావు గత మూడు దశాబ్దాలుగా వైద్య వృత్తిలో సేవలందిస్తూ సామాజిక వర్గాల్లో మంచి గుర్తింపు పొందారు. వైద్య సేవల ద్వారా పేదలతో, మధ్యతరగతి కుటుంబాలతో ఆయనకు ఉన్న అనుబంధం పార్టీకి సామాజికంగా విస్తృత ఆదరణను తీసుకురావడంలో సహకరించనుంది. వారిది కాంగ్రెస్ కుటుంబమే అయినా..బీఆర్ఎస్ పార్టీలో కీలక నేతగా సేవలు అందించారు. కాగా..ఇప్పుడు ఆయన 'మోడీ చరిష్మా'కు ఆకర్షితులై బీజేపీ లోకి ఎంట్రీ ఇచ్చారు. రానున్న రోజుల్లో పార్టీలోని కొత్త-పాత నేతలను..విశేష సేవలనందించే కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కంకణబద్దులైనట్టు పార్టీ పెద్దలు ఆశాభావం వ్యక్తంచేశారు.

### గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాల నిర్వహణ.!

యువతను పార్టీ వైపు ఆకర్షించే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని..మేధావులు, వైద్యులు, ఉద్యోగ వర్గాలను బీజేపీతో అనుసంధానం చేయడం..నియోజకవర్గ సమస్యలపై క్రమబద్ధమైన అధ్యయనం చేసి పార్టీ వేదికగా ప్రస్తావించడం..వంటి చర్యల ద్వారా కోరుట్ల నియోజకవర్గంలో పార్టీకి కొత్త ఊపును తీసుకురాగలరని పార్టీ శ్రేణులు విశ్వసిస్తున్నాయి. ముఖ్యంగా విద్యావంతుల వర్గంలో బీజేపీ ప్రభావాన్ని పెంచడంలో ఆయన కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

### ప్రజా సేవే చేసేందుకే..ప్రత్యక్ష రాజకీయాల్లోకి..

(డా. అనూప్ రావు స్ఫూర్తిదాయక ప్రసంగం)

ఈ సందర్భంగా డా. అనూప్ రావు మాట్లాడుతూ భావోద్వేగపూరితంగా స్పందించారు..'నేను వైద్య వృత్తిలో ఎన్నో సంవత్సరాలు ప్రజలకు సేవ చేశాను. కానీ సమాజాన్ని సమగ్రంగా మార్చాలంటే ప్రత్యక్ష రాజకీయాల్లో భాగస్వామ్యం అవసరమని నేను నమ్ముతున్నానన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వం నాకు స్ఫూర్తినిచ్చిందన్నారు. అందుకే భారతీయ జనతా పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నానని పేర్కొన్నారు. కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన ఆరోగ్య సదుపాయాలు కల్పించాలన్నవే నా లక్ష్యాలని అభిప్రాయపడ్డారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రతి గ్రామానికి, ప్రతి కుటుంబానికి చేరువ అవుతాను. ప్రజల విశ్వాసమే నా బలమన్నారు. ఇకపై నేను కేవలం వైద్యుడిగా కాదు, ప్రజల సమస్యల కోసం పోరాడే ప్రజా ప్రతినిధిగా పనిచేస్తానని. కోరుట్లలో బీజేపీ జెండా మరింత ఎగరవేయడం నా బాధ్యతగా భావిస్తున్నానని హామీనిచ్చారు. అనూప్ రావు చేరికతో కోరుట్ల రాజకీయ సమీకరణాల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గంలో బీజేపీ కార్యకలాపాలు మరింత చురుకుగా మారనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.!











# థాంక్స్ గంగన్నా రమేషన్నా!

## ఎన్నికల హామీ నిలబెట్టుకున్నందుకు..

- 'అయిలాపూర్ రోడ్డు' గోస మీరైనా పట్టిచ్చుకున్నందుకు.. కృతజ్ఞతలు
- 'కొంచెమంత' రోడ్డు విధ్వంసం..'భారీస్థాయి' నష్టం
- ఇరువైపులా..ఇరవై షాపులోల్ల 'దుమ్ము కష్టాలు' ఇక తీరినట్టే.!

'ఎన్నాళ్లకెన్నాళ్లకు 9వ వార్డులోని మా 'అయిలాపూర్ రోడ్డు' గోసల్ని పట్టించుకునేందుకు మీరొచ్చారు.. ఐదేండ్ల నుంచి కనవడ్డ నాయకుడిని అడిగితిమి..సర్కార్ సార్లనూ అడిగితిమి..సగంల ఆపేసిన రోడ్డుపనుల వల్ల 'దుమ్ము' రేగి మా ఇరవై షాపులోల్లం దంద చేసుకోలేక పోతున్నమని వేడుకుంటిమి.! ఏ ఒక్కల్లూ పట్టించుకున్న పాపాన పోలేదు.ఒకరేమో..నా కాలేజీ పోతుందని.. కోర్టుల కేసు వేసి ఆపింద్రనిరి..కాంట్రాక్టరే అర్థాంతరంగా పని ఆపిపోయింద్రనిరి..ఆర్నెల్లకోసారి నాలుగు ఎన్నికలచ్చి 'కోడ్' ఉ ందని మున్సిపల్ సార్లు దాటవేసిరి..ఇగ ఇదే దుమ్ముల 'వేల రూపాయల' కిరాయిలు..లక్షల రూపాయల పెట్టుబడులు పెట్టిన మేం దంద చేసుకోలేక..గిరాకీలు రాక.. బిజినెస్ పడిపోయి..తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక.. వస్తువులు ఖరాబు చేసుకుంటూ..మీది కెల్లి రోగాలు తెచ్చుకుంటూ..బతుకుడా.? సచ్చుడాని...' గోసపడుతున్న టైంల మున్సిపల్ ఎన్నికలు అచ్చినై.! ప్రచారంలో భాగంగా మా గోసల్ని 9వ వార్డులో పోటీచేసిన అందరికీ చెప్పుకున్నం.! ఇగో..మా గోసల్ని కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిసిన 'ఎడ్ల జలజ-రమేష్'.. మున్సిపల్ ఛైర్ పర్సన్ తిరుమల వసంత-గంగాధర్'లు చెవికెక్కించుకున్నరు.ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నరు.మేం కోరినట్టు ఓ 50 ఫీట్ల మందం 'డాంబర్ రోడ్డు' ఏపిచ్చి..మా 'దుమ్ము కష్టాలు' తీర్చినందుకు మీకు ఎల్లకాలం ఋణపడి ఉంటాం.. థాంక్స్..గంగన్నా.. థాంక్స్ రమేషన్నా.! అంటూ 'దుమ్ము బాధిత సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.!!

- నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య)....

# రోడ్డు ప్రమాదాలకు.. కంటిచూపు లోపమూ కారణమే.!





**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** రోడ్డు ప్రమాదాల నివారణను ప్రధాన లక్ష్యంగా తీసుకుని తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన 'అరైవ్ ఆలైవ్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కోరుట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ వాహనాల డ్రైవర్ల కోసం ఉచిత కంటి మరియు వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ శిబిరాన్ని ప్రారంభించి డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర డిజిపి ఆదేశాల మేరకు తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా 'అరైవ్-అలైవ్' పేరుతో ప్రత్యేక రోడ్డు భద్రతా అవగాహన కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. మొదటి దశ ఇదివరకే విజయవంతంగా పూర్తయిన నేపథ్యంలో.. రెండో దశను ఈ నెల 22 నుంచి 28 వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని అలవాటు చేయడం, రోడ్డు భద్రతా వ్యవస్థలను బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

### రోడ్డు ప్రమాదాలకు..కంటిచూపు లోపమూ ఓ కారణమే.!

- జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్ సూచనలు
- 'అరైవ్ ఆలైవ్'లో భాగంగా కోరుట్ల డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం
- 210 మంది డ్రైవర్లకు పరీక్షలు
- 160 మందికి ఉచిత కళ్లద్దాలు పంపిణీ

రోడ్డు ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నప్పటికీ చూపు లోపం కూడా ఒక ముఖ్య కారణమని ఎస్పీ స్పష్టం చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనాలు నడిపే వారు, దీర్ఘదూర ప్రయాణాలు చేసే లారీ, బస్సు డ్రైవర్లు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో స్పష్టమైన చూపు లేకపోతే ట్రాఫిక్ సిగ్నల్స్, రోడ్ సైన్ బోర్డులు, ముందున్న వాహనాలు సరిగా కనిపించక ప్రమాదాలకు దారితీసే అవకాశముందని హెచ్చరించారు. అందువల్ల డ్రైవర్లు తమ ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయకుండా సమయానుకూలంగా వైద్య పరీక్షలు చేయించుకోవడం అత్యవసరమని అన్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా ఎస్పీ అశోక్ కుమార్ ప్రతి డ్రైవర్ ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటిస్తూ, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అధిక వేగం వద్దని, సీట్ బెల్ట్ మరియు హెల్మెట్ వినియోగాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. 'ప్రాణం అమూల్యం... ప్రతి ఒక్కరూ సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలి' అనే సందేశంతో 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.డ్రైవర్ల ఆరోగ్యం -- రోడ్డు భద్రత అనే ద్వంద్వ లక్ష్యాలతో నిర్వహించిన ఈ శిబిరం కోరుట్ల ప్రాంతంలో మంచి స్పందన పొందింది. రాబోయే రోజుల్లో మరిన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పోలీస్ అధికారులు తెలిపారు.

### 210 మందికి పరీక్షలు -- 160 మందికి కళ్లద్దాలు

కోరుట్ల పట్టణంలో నిర్వహించిన ఈ శిబిరంలో లారీ, డిసిఎం, కార్, ఆటో, అంబులెన్స్ డ్రైవర్లు సహా మొత్తం 210 మందికి కంటి మరియు సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అనుభవజ్ఞులైన కంటి వైద్యులు ఆధునిక పరికరాలతో పరీక్షలు చేసి అవసరమైన వారికి సూచనలు అందించారు. చూపు సమస్యలు గుర్తించిన 160 మంది డ్రైవర్లకు ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. అవసరమైన మందులను కూడా పంపిణీ చేశారు. ఐదుగురు డ్రైవర్లకు శస్త్రచికిత్స అవసరమని గుర్తించగా, వారి చికిత్స కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అవసరమైతే తదుపరి చికిత్స కోసం సంబంధిత ఆసుపత్రులకు రిఫర్ చేసే చర్యలు కూడా తీసుకున్నట్లు వెల్లడించారు.

### ఐఎంఏ వైద్యులు-లయన్స్ క్లబ్ సహకారం

ఈ కార్యక్రమంలో కోరుట్లకు చెందిన డాక్టర్లు డా. సంపత్ కుమార్, డా. సుమన్, రెనె హాస్పిటల్ డాక్టర్ సమీర్ సేవలందించారు. అలాగే కోరుట్ల లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జీవన్ రెడ్డి, కార్యదర్శి లక్ష్మారెడ్డి సహా సభ్యులు తమ సహకారాన్ని అందించారు. శిబిరం విజయవంతంగా నిర్వహించడంలో వీరి పాత్ర కీలకంగా నిలిచింది. కార్యక్రమానికి సహకరించిన వైద్యులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులను ఎస్పీ చేతుల మీదుగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల మున్సిపల్ ఛైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్,వైస్ చైర్మన్ షాహెద్,మెట్ పల్లి డీఎస్పీ రాములు, కోరుట్ల సీఐబి సురేష్ బాబు, మెట్ పల్లి సీఐ అనిల్ కుమార్, కోరుట్ల ఎస్సైలు చిరంజీవి, రామచంద్రం, మేడిపల్లి ఎస్సై శ్రీధర్ రెడ్డి, కథలాపూర్ ఎస్సై రవి కిరణ్ తదితర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. డ్రైవర్లలో ట్రాఫిక్ నియమాల పట్ల అవగాహన పెంచుతూ డిఫెన్సివ్ డ్రైవింగ్ అలవాటు చేసుకోవాలని సూచించారు.